
వరి సాగుకు నీరివ్వకపోతే నష్టపోతాం



వరి సాగుకు నీరివ్వకపోతే తీవ్రంగా నష్టపోతాం. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శ్రీశైలం, సాగర్ జలాశయాలు నిండటంతో రైతులమంతా ఎంతో ఆనందంగా ఉన్నాం. కొందరు వరిసాగుకు నార్లు కూడా పోశారు. ఈ పరిస్థితిల్లో మాగాణికి నీరివ్వకపోతే ఆర్థికంగా దెబ్బతింటాం. ప్రస్తుతం వర్షాభావం వల్ల సాగు చేసిన ఇతర పైర్లు కూడా వాడుముఖం పట్టాయి.

- నవులూరి సురేంద్రమోహన్, రైతు విఠలాపురం

ఏం చేయాలో అర్థంకావడం లేదు



సాగర్ జలాశయంలో నిండుగా నీరు ఉన్నందున వరి సాగుకు ఇవ్వాలి. రెండేళ్లుగా వర్షాలు లేక, సాగునీరు అందక ఇబ్బంది పడ్డాం. మెట్ట పంటలూ సరిగ్గా పండ లేదు. దీంతో నష్టపోయాం. నాకు మూడు ఎకరాల సాగు భూమి ఉంది. ప్రస్తుతం కంది పైరు వేసినా ఎండిపోతోంది. సాగర్ జలాశయం నిండటంతో వరి సాగుకు సిద్ధమయ్యా. ఇప్పుడు ఆరు తడి పంటలకు నీరు అని అంటున్నారు. ఏం చేయాలో అర్థంకావడం లేదు.

- యర్రగుంట్ల శ్రీనివాసరావు, రైతు, తూర్పువెంకటాపురం

సాగర్ ఆయకట్టు రైతుల్లో అయోమయ పరిస్థితి నెలకొంది. వరిసాగుకు నీరు ఇస్తారో.. లేదో అన్న విషయం అర్థంకాక తర్జనభర్జన పడుతున్నారు. శ్రీశైలం, సాగర్ జలాశయాలలో నిండుగా నీరున్నప్పటికీ రెండో జోన్‌లో ఆరుతడి పంటలకు మాత్రమే సరఫరా చేస్తామని అధికారులు ప్రకటించడంపై అన్నదాతలు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. గత రెండేళ్లు సక్రమంగా వర్షాలు లేక, జలాశయాల్లో నీరు చేరక ఆయకట్టులో వరి సాగుకు నోచుకులేదు. ఈ ఏడాది వరుణదేవుడు కరుణించి జలాశయాల్లోకి పుష్కలంగా నీరు చేరినప్పటికీ మాగాణికి ఇవ్వలేమని అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. జిల్లాలో సాగర్ కింద 4.5లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. అందులో దర్శి ప్రాంతంలోని భూముల్లో కంది, సజ్జ పైర్లు వేశారు. జలాశయాలు నిండటంతో నీరు ఇస్తారన్న ఆశతో కొందరు రైతులు ఆ పైర్లను తీసేసి వరి నారు పోశారు. వారంతా అధికారుల ప్రకటనతో ఏమి చేయాలో పాలుపోక మదనపడుతున్నారు.

మాగాణి సాగు ప్రశ్నార్థకం



- అవసరం 69 టీఎంసీలు.. వాటా ప్రకారం వచ్చేది 56.76
- వర్షాలతో లోటు నీరు సర్దుబాటు
- ఆరుతడి పంటలకే సాగర్ జలాలు అని యంత్రాంగం ప్రకటన
- ఆందోళనలో ఆయకట్టు రైతులు
- గతేడాది నీరు లేక నిలిచిన సాగు

డ్యాంలు పొంగిపొర్లుతున్నా ఉమ్మడి జిల్లాలో నీటి ఇక్కట్లు



ఒంగోలు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది కూడా మాగాణి సాగు ప్రశ్నార్థకంగానే కనిపిస్తోంది. ప్రధాన సాగునీటి వనరుగా ఉన్న సాగర్ కాలువల్లో గత ఏడాది నీరు రాక ఆయకట్టు భూముల్లో పంటలు సాగు కాలేదు. మొత్తం ఆయకట్టు 4.50 ఎకరాలు ఉండగా 3.50 లక్షల ఎకరాలలో ఆ నీరు ఆధారంగా పంటలు సాగు చేస్తారు. అందులో ఇంచుమించు లక్షన్నర ఎకరాల్లో మాగాణి, రెండు లక్షల ఎకరాలలో ఆరుతడి పంటలు వేస్తుంటారు. అయితే గతేడాది కృష్ణానదిలో ప్రవాహం లేక కాలువలకు రాక సాగర్ ఆయకట్టులో మాగాణి సాగు పూర్తిగా నిలిచిపోయింది. వర్షాధారంగా ఆరుతడి పంటలు కొంత మేర సాగయ్యాయి. వేలాది ఎకరాల వరి పంట పండే మాగాణి భూములు బీళ్లుగా మిగిలిపోయాయి.

అయితే ఈఏడాది జూలైలోనే కృష్ణమ్మ పరవళ్లు తొక్కింది. ఇరవై రోజులపాటు వరద కొనసాగింది. శ్రీశైలం, సాగర్‌డ్యాంలు నిండి గేట్లు ఎత్తి సముద్రానికి నీటిని వదిలారు. దీంతో ఈ ఏడాది సాగుపై సాగర్ ఆయకట్టు రైతులు పూర్తి భరోసాతో ఉన్నారు. అయితే డ్యాంలు నిండి పొంగిపొర్లుతున్నా ఉమ్మడి జిల్లాలో మాగాణి సాగు ప్రశ్నార్థకంగానే కనిపిస్తోంది.

అదనపు నీరు అనుమానమే

కుడి కాలువకు వాటా ప్రకారం ఇచ్చే 132 టీఎంసీలతోనే సర్దుకోవాల్సి ఉంటుంది. అందులో ఉమ్మడి జిల్లాకు 43శాతం వాటా ప్రకారం 56.70 టీఎంసీల నీరు వచ్చే అవకాశం ఉంటుంది. అయితే ఈ ఏడాది సాగుకు 57 టీఎంసీలు, తాగునీటికి 12 టీఎంసీలు వెరసి 69 టీఎంసీలు అవసరంగా ఎన్ఎస్‌పీ ఒంగోలు సర్కిల్ అధికారులు అంచనా వేశారు. ఈమేరకు నెలక్రితమే ఉన్నతాధికారులకు నివేదించారు. అంటే వాటా ప్రకారం జిల్లాకు వచ్చే నీటి కన్నా వాస్తవ అవసరం దాదాపు 12 టీఎంసీలు అధికంగా ఉంది. ఆ మేర అదనపు నీరు సాగర్ నుంచి ఏ మేరకు వస్తుందన్నది అనుమానమే.

రాష్ట్ర విభజనతోనే సమస్య

జిల్లాలోని సాగర్ ఆయకట్టు రైతులు ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేసుకోవాలని యంత్రాంగం ఇప్పటికే ప్రకటించింది. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. అందుకు ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులే ప్రధాన కారణమని చెప్తున్నారు. సాగర్ కుడి కాలువకు 132 టీఎంసీల నీరు తీసుకొనే అవకాశం స్పష్టంగా ఉంది. అయితే వాస్తవ అవసరం మరో 40 నుంచి 50 టీఎంసీల వరకూ ఉంటుంది. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని కుడి కాలువ పరిధిలో సుమారు 11 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. అలాగే వందలాది చెరువులు, ఎస్ఎస్ ట్యాంకులు ఉండటంతో ఆమేరకు అదనపు నీరు అవసరం. పుష్కలంగా వర్షాలు కురిస్తే ఆమేర సాగర్ నీటి అవసరం తగ్గుతుంది. అలాంటి సమయంలో వాటా ప్రకారం వచ్చే 132 టీఎంసీలకు అటుఇటుగా ఇస్తే పంట చేతికి వచ్చేది. గతంలో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు పంటలు వేశాక వర్షాలు సరిలేకపోతే సాగర్ డ్యాంలో ఉన్న నీటిని పంటలను కాపాడేందుకు ఇచ్చేవారు. రాష్ట్ర విభజన అనంతరం ఆ పరిస్థితి లేకుండా పోయింది.

నేతలు స్పందిస్తేనే..

తక్షణం ఉమ్మడి జిల్లా కీలక ప్రజాప్రతినిధులు ఈ అంశంపై దృష్టిసారించి రైతులకు భరోసా ఇవ్వాల్సిన అవసరం కనిపిస్తోంది. గతంలో డ్యాంలు పొంగి గేట్లు ఎత్తిన సమయంలో కాలువలకు ఇచ్చిన నీటిని ఆ ఏడాది వాటా నీరు నుంచి మినహాయించే వారు.

ముందు జాగ్రత్త కోసమే ప్రకటన

పుష్కలంగా వర్షాలు కురవడంతోపాటు నీటి సరఫరాను మెరుగ్గా చేయగలిగితే వాటా ప్రకారం వచ్చే దానితో పంట పండించుకొనే అవకాశం ఉంటుంది. కానీ ఈ ఏడాది ఇప్పటి దాకా పరిస్థితిని చూస్తే తీవ్ర వర్షాభావ పరిస్థితులే కనిపిస్తున్నాయి. రబీ సీజన్‌లోనైనా ఏమేరకు వర్షం కురుస్తుందో తెలియదు. దీన్ని గమనించిన యంత్రాంగం ముందు జాగ్రత్తగా సాగర్ ఆయకట్టుకు సెప్టెంబరు మొదటివారంలో నీరు ఇస్తున్నట్లు ప్రకటించినా ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేయాలని షరతు విధించింది. ఆ మేరకు అధికారికంగా కలెక్టర్, జలవనరుల శాఖ ఎస్ఈలు ప్రకటన కూడా ఇచ్చారు. దీంతో ఇప్పటి దాకా కృష్ణానది పరవళ్లు చూసి నార్లు పోసిన, పోసేందుకు సిద్ధమైన రైతులు ఆందోళన చెందుతున్నారు.

అలా వచ్చిన నీటితో రామతీర్థం, గుండ్లకమ్మ రిజర్వాయర్లతోపాటు మొత్తం ఎస్ఎస్ ట్యాంకులు, నోటిఫైడ్, నాన్ నోటిఫైడ్ చెరువులు నింపేవారు. తద్వారా వాటా ప్రకారం వచ్చే నీటిని అవసరమైనప్పుడు తీసుకొనే సౌకర్యం కలిగేది. అలాగే ఇప్పుడు తక్కువనీటి అవసరం, తక్కువ కాల పంట సాగు వంటి అంశాలను పరిశీలించి రైతులకు మాగాణి సాగుపై భరోసా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వాగులో నిర్మించిన శాశ్వత భవనం

వాగు స్థలం హాంఫట్!

- సోమవరప్పాడు పరిధిలో ఆక్రమణలు
- వైసీపీ ప్రభుత్వ హయాంలో శాశ్వత కట్టడాల నిర్మాణం
- కబ్జాదారుల గుప్పిట్లో రూ.3కోట్ల విలువైన స్థలం
- చోద్యంచూస్తున్న రెవెన్యూ అధికారులు



తాళ్లూరు, ఆగస్టు 28 : మండలంలోని తూర్పుగంగవరం పంచాయతీ పరిధి సోమవరప్పాడు గ్రామసర్వే నంబరు 231/2, 231/3లోని 2ఎకరాల 36 సెంట్ల విస్తీర్ణం గల వాగు స్థలం అన్యాక్రాంతమైంది. దాదాపు 13 ఏళ్ల క్రితం ఓ వ్యక్తి నుంచి అగ్రిమెంట్ మీద అనధికారికంగా కొనుగోలు చేసిన వ్యక్తి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో శాశ్వత కట్టడాలు నిర్మించాడు. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించారు. వివరాల్లోకెళ్తే... తూర్పుగంగవరం నుంచి చీమకుర్తి వెళ్లే మార్గంలో డంపింగ్ యార్డు ఎదురు ఉన్న వాగు స్థలంలోని కొంత భాగంలో దాదాపు 15 ఏళ్ల క్రితం ఓ వ్యక్తి గుడిసె వేసుకున్నాడు. అతని వద్ద నుంచి ప్రస్తుతం వైసీపీలో తిరుగుతున్న ఓ నాయకుడు 13 ఏళ్ల క్రితం అనధికారికంగా అగ్రిమెంట్ ద్వారా కొని గుట్టుగా ఉంచాడు. గత ప్రభుత్వ పాలనలో ఆ స్థలంలో యథేచ్ఛగా పక్కాభవనం నిర్మించాడు. ఇంత జరుగుతున్నా ఆ గ్రామ వీఆర్వోలు, రెవెన్యూ అధికారులు గుడ్లప్పగించి చూశారే తప్ప అడ్డుకోలేదు. అదే అదునుగా భావించిన ఇంకొందరు వాగులో మిగిలిన స్థలాన్ని కూడా ఆక్రమించి శాశ్వత భవనాలు నిర్మించారు.

అక్రమ నిర్మాణాలను పరిశీలించిన ఆర్డీవో

సోమవరప్పాడు గ్రామ రెవెన్యూ పరిధిలోని వాగును ఆక్రమించి కట్టడాలు చేపట్టారని గ్రామస్థులు కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఒంగోలు ఆర్డీవో సుబ్బారెడ్డి బుధవారం పరిశీలించారు. రికార్డు ప్రకారం వాగు విస్తీర్ణం, ఎంతమేర స్థలంలో ఆక్రమణలు జరిగాయో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి.శింగారావు పాల్గొన్నారు.

నాలుగు చోట్ల శాశ్వత కట్టడాలు

వాగు స్థలంలో ప్రస్తుతం అక్రమార్కులు నాలుగుచోట్ల శాశ్వత కట్టడాలు చేపట్టారు. రెవెన్యూ రికార్డుల్లో ఎఫ్ఎల్ఆర్‌లో ఆ స్థలం వాగుగా నమోదై ఉంది. భూములకు ధరలు విపరీతంగా పెరగటంతో వాగును పూర్తిగా ఆక్రమించి కట్టడాలు చేపట్టారు. మార్కెట్ రేట్ ప్రకారం ఆ స్థలం విలువ ప్రస్తుతం రూ.3కోట్లకుపైనే ఉంది. వాగును పూడ్చి కట్టడాలు చేపట్టడం వల్ల భవిష్యత్‌లో భారీవర్షాలు కురిస్తే నీరు దిగువకు వెళ్లే మార్గంలేక రోడ్డును ముంచెత్తుతుందని ప్రజలు చెబుతున్నారు. పేదవర్గాలకు సెంటు భూమి పంపిణీ చేసేందుకు వెనుకాడే రెవెన్యూ అధికారులు వాగును ఆక్రమంచి అక్రమంగా కట్టడాలు చేస్తున్నా ఆక్రమణదారుల వద్ద అధిక మొత్తంలో ముడుపులు తీసుకుని మిన్నకున్నారని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి ఆక్రమణకు గురైన వాగులోని కట్టడాలు తొలగించి యథావిధిగా వాగు ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

- పారిశుధ్యం మెరుగునకు అత్యంత ప్రాధాన్యం
- లోపాలను సవరించి అభివృద్ధి వైపు దృష్టి
- దశలవారీగా ప్రజా సమస్యల పరిష్కారం
- నగర కమిషనర్ వెంకటేశ్వరరావు
- బాధ్యతల స్వీకరణ

ప్రజలు మెచ్చేలా పౌర సేవలు..!

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 28 : నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అందించే అన్నిరకాల పౌర సేవల్లో లోపాలు లేకుండా పారదర్శకంగా, ప్రజలు మెచ్చేలా పనిచేస్తానని నగర నూతన కమిషనర్ కోడూరి వెంకటేశ్వరరావు వెల్లడించారు. నరసాపురం మునిసిపాలిటీ నుంచి ఒంగోలుకు బదిలీపై వచ్చిన ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. నగర సమస్యలపై అధ్యయనం చేసి దశలవారీగా పరిష్కరిస్తానని తెలిపారు. తాను ఎక్కడ పనిచేసినా పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టిపెట్టానని చెప్పారు. నగరం అందంగా ఉంటే నలుగురూ మెచ్చుకుంటారన్నారు. అలాగే ప్రతి ఉద్యోగి బాధ్యతతో పనిచేసేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. పనులపై వచ్చే ప్రజలను పదేపదే కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా చూస్తానన్నారు. ప్రతి పారిశుధ్య కార్మికుడు నిర్దీత పనివేళలో కచ్చితంగా డ్యూటీలో ఉండేలా శానిటరీ అధికారులకు ఆదేశాలు ఇస్తామని తెలిపారు. మురుగునీటి పారుదల వ్యవస్థ మెరుగు, చెత్త సమస్య, ఇంటింటి చెత్త సేకరణ తదితర అంశాలపై తాను ప్రతి రోజూ డివిజన్లలో పర్యటించి పర్యవేక్షిస్తానని చెప్పారు. తాగునీటి సరఫరాలో లోపాలు లేకుండా చూస్తానన్నారు. పాలకవర్గ సూచనలను పరిగణనలోకి తీసుకుని అందరి సహకారంతో ఒంగోలు నగరాన్ని మరింత అభివృద్ధి చేసేలా తాను పనిచేస్తానని తెలిపారు. అలాగే రెవెన్యూలో పన్నులు నూరుశాతం వసూలయ్యే విధంగా ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. టౌన్‌ప్లానింగ్‌లో విమర్శలు లేకుండా పారదర్శకంగా, బాధ్యతగా ప్రజలకు సేవలు అందేలా చూస్తానని వివరించారు. బాధ్యతలు స్వీకరించిన మొదటిరోజే సెక్షన్లవారీగా అధికారులు, ఉద్యోగులతో ఆయన వేర్వేరుగా సమీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు నూతన కమిషనర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతించారు.

ఒంగోలులో ఎఫ్‌ఎం రేడియో స్టేషన్..!

- ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- దేశవ్యాప్తంగా 234, రాష్ట్రంలో 22చోట్ల ఏర్పాటుకు చర్యలు



ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 28: కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో త్వరలో దేశవ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న ఎఫ్‌ఎం రేడియో స్టేషన్లలో ఒంగోలు నగరానికి స్థానం దక్కింది. బుధవారం ఇందుకు సంబంధించి ఢిల్లీ పీఐబీ ద్వారా సమాచారం వెలువడింది. దేశవ్యాప్తంగా 234 ప్రాంతాలలో, రాష్ట్రంలో 22 పట్టణాలలో నూతనంగా ఎఫ్‌ఎం స్టేషన్లు ఏర్పాటు కానున్నాయి. మాతృభాషలో స్థానిక కంటెంట్‌ని పెంచడానికి, ఉపాధి అవకాశాలను సృష్టించడానికి కొత్త ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ప్రైవేట్ ఎఫ్ఎం రేడియో ఫేజ్ ఇల్ పాలసీ కింద ఈ ప్రాజెక్టును చేపట్టనుంది. రూ.784.87 కోట్ల అంచనాతో 234 కొత్త నగరాల్లో 730 చానళ్ల కోసం 3వ బ్యాచ్ కింద ఈ-వేలం నిర్వహణ ప్రతిపాదనకు ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రాల వారీగా నగరాలు/పట్టణాల జాబితాను, ఎఫ్ఎం చానళ్ల సంఖ్యను బుధవారం పీఐబీ విడుదల చేసింది. కాగా మూడు చానల్స్‌తో ఒంగోలులో ఎఫ్ఎం స్టేషన్ ఏర్పాటు కానుంది. నగరాలు, పట్టణాలలో ప్రైవేట్ ఎఫ్ఎం రేడియో రోల్ అవుట్ కోసం అపరిమితమైన డిమాండ్ ఉంది. ఉపాధి కల్పన, స్థానిక మాండలికం, సంస్కృతిని పెంపొందించడంతోపాటు స్థానికుల్లో ప్రతిభ, నైపుణ్యాలను ప్రోత్సహించేందుకు ఈ స్టేషన్‌లను కేంద్రం ఏర్పాటు చేస్తోంది. కాగా ఒంగోలులో ఎప్పుడు ప్రారంభమవుతుందన్న విషయమై వివరాలు, విధి విధానాలు తెలియాల్సి ఉంది.



- ఖాతాలకు రూ.37.95 కోట్లు
- రూ. 4.64 లక్షలు వడ్డీ కూడా జమ
- గ్రామాల్లో అత్యవసర పనులు చేపట్టేందుకు అవకాశం
- నిధులు లేక కునారిల్లుతున్న పల్లెలకు ఊరట

పంచాయతీలకు నిధులొచ్చాయ్

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 28: నిధులు లేక కునారిల్లుతున్న గ్రామ పంచాయతీలకు ఊరట లభించింది. ఎట్టకేలకు ఆర్థిక సంఘం నిధులు జమయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీల జనరల్ ఫండ్‌తోపాటు ఆర్థికసంఘం నిధులను కూడా లాగేసుకోవడంతో గ్రామాల్లో ఎలాంటి పనులు చేసేందుకు అవకాశం లేకుండాపోయింది. నిధుల కోసం వైసీపీ ప్రభుత్వంలో సర్పంచ్‌లు రోడ్డెక్కి ఆందోళనలు చేసినా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్థానిక సంస్థల పాలకవర్గాలకు ఊరట కలిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెండింగ్‌లో ఉన్న ఆర్థికసంఘం నిధులను పంచాయతీలకు కేటాయించే విధంగా చొరవ తీసుకున్నారు. ఐదురోజుల క్రితం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులను మంజూరు చేశారు. అవి రెండు రోజులుగా జిల్లాలోని గ్రామ పంచాయతీల బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో విడత నిధులు జిల్లాలోని 729 గ్రామపంచాయతీలకు రూ.37.95 కోట్లు, వడ్డీ కింద రూ.4.64 లక్షలు పంచాయతీ అకౌంట్లలో పడిపోయాయి. ఒక్కో పంచాయతీకి సరాసరిన రూ.1.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ వచ్చాయి.

అత్యవసర పనులకు అవకాశం

ఈ ఆర్థిక సంఘం నిధులు బేసిన్ గ్రాంటు కింద రూ.15.18 కోట్లు, వడ్డీ కింద రూ.3.20 లక్షలు, టైడ్ గ్రాంట్ కింద రూ.22.77 కోట్లు, దాని వడ్డీ కింద రూ.1.44 లక్షలు కలిపి సుమారు రూ.38 కోట్ల మేర వచ్చాయి. వీటి ద్వారా గ్రామ పంచాయతీల్లో అత్యవసర పనులు చేపట్టేందుకు అవకాశం కలిగింది. ప్రభుత్వం ఇటీవల పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం గ్రామసభలను నిర్వహించింది. వాటిలో ఉపాధి పథకం అనుసంధానంతో రోడ్లు, డ్రైనేజీ, పైపులైన్ల నిర్మాణాలు, ఆర్థిక వనరులను పెంచేందుకు అవసరమయ్యే పలు రకాల పనులను అధికారులు ఎంపిక చేశారు. ప్రస్తుతం ఆర్థిక సంఘం నిధులు మంజూరుకావడంతో వాటి ద్వారా ఆయా పనులను సత్వరమే చేపట్టనున్నారు. మరోవైపు ప్రజలకు తాగునీటి సరఫరా, పారిశుధ్యం మెరుగుతోపాటు పలురకాల పనులు చేపట్టేందుకు దోహదపడనుంది. నిర్వీర్యమైన గ్రామ పంచాయతీలను పూర్వవైభవం తెచ్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చర్యలు తీసుకోవడం పట్ల పాలకవర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

తెలుగుభాషకు హారతి పడదాం!



భాష పరిరక్షణ అందరి బాధ్యత
ప్రభుత్వ కార్యక్రమాల్లో వినియోగం పెరగాలి
విద్యార్థుల్లో చైతన్యం కలిగించాలి
నేడు తెలుగుభాష దినోత్సవం

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 28: 'దేశభాషలందు తెలుగులెస్స' అని 500 సంవత్సరాల కిందటే తుళువ మాతృభాషగా కలిగిన శ్రీకృష్ణదేవరాయలు సైతం చెప్పారంటే మన తెలుగుభాష ఎంత గొప్పదో అర్థమవుతుంది. ప్రపంచంలో రెండే రెండు భాషలకు ప్రత్యేకత ఉంది. ఒకటి మన తెలుగు భాష, రెండవది ఇటలీ భాష. ప్రపంచంలో అన్ని భాషలు కూడా హల్లులతో అంతమయితే, కేవలం ఈ రెండు భాషల పదాలు మాత్రమే అచ్చులతో ముగుస్తాయి. అందుకే తెలుగును 'ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్' అని కొనియాడారు. కానీ ఎన్నో సంవత్సరాల పోరాటం తర్వాత తెలుగుకు ప్రాచీన హోదా లభించినా, అసలు తెలుగుభాష ప్రాతిపదికగా రాష్ట్రం ఏర్పడినా ఇంకా తెలుగు మృతభాషల జాబితాలోనే ఉండటం భాషాప్రియులను కలచివేసే విషయం. ప్రపంచంలో ఉన్న 6,600 భాషల్లో తెలుగు ఒకటి. ఇక ద్రావిడ భాషావర్గంలో తమిళం, కన్నడం, మళయాలం, గోండీ వంటి 85 భాషల్లోకెల్లా అత్యధిక ప్రజలు మాట్లాడే భాష తెలుగు. అయితే ఇంతటి గొప్పభాషను పరిరక్షించాలని ఇప్పటికీ అనేక సంస్థలు సభలు, సమావేశాలు, పోరాటాలు చేయటం అంటే ఆ భాష మనుగడ ప్రశ్నార్థకం కావటమే కారణం.

వ్యవహారిక భాషోద్యమ పితామహుడు 'గిడుగు'



గిడుగు వెంకటరామ్మూర్తిపంతులు

ప్రాచీన సంప్రదాయ, సంస్కృత భావజాలం నుంచి బయటపడాలని, ప్రాథమిక స్థాయినుంచి తెలుగు వెలుగులు నిండాలని, జాతికి కావలసింది పామరుల భాషేకాని పండిత పదజాలం కాదని భాషోద్యమ వేత్త, వ్యవహారిక భాషోద్యమానికి మూలపురుషుడు, అచ్చ తెలుగు చిచ్చర పిడుగు 'గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు' ఆనాడు చేసిన పోరాటం, కృషి ఫలితంగా వ్యావహారికభాషలో అందరికీ అందుబాటులోకి వచ్చి తెలుగు మాధ్యమంలో విద్యాబోధనకు బీజాలుపడ్డాయి. అంతేకాకుండా ఎందరో సాహిత్యవేత్తలు తేటతెలుగులో రచనలు చేయడం ప్రారంభించారు. అందుకే ఆయన జయంతి రోజైన ఆగస్టు 29ని 'తెలుగు భాషా దినోత్సవం'గా జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్ణయించింది. అయితే తెలుగు భాషకు ప్రాచీన భాష హోదా లభించి దశాబ్దన్నర కాలం గడుస్తున్నా ఆ భాషాభివృద్ధికి ఇవ్వాల్సిన నిధుల్లో 10 శాతం కూడా ఇంతవరకు కేంద్ర ప్రభుత్వం నుంచి అంద లేదు. అదేవిధంగా తెలుగు ప్రజల్లో కేవలం 27శాతం మంది విద్యార్థులు మాత్రమే తెలుగు రాయటం, చదవ టం తెలిసినవారున్నారనే గణాంకాలు కలవరపరుస్తున్నాయి.

అమలు కాని నిబంధనలు

ప్రభుత్వ కార్యాలయాల్లో తప్పనిసరిగా తెలుగును ఉపయోగించాలన్న ప్రభుత్వ నిబంధనలు పూర్తిగా అమలు కావటం లేదు. కార్యాలయాల్లో కంప్యూటర్లు ఉపయోగించటం, కంప్యూటర్లలో వాడేందుకు అన్ని ఆంగ్లపదాలకు సరైన తెలుగు పర్యాయపదాలను ఇప్పటివరకు రూపొందించకపోవటం దీనికి ఒక కారణం. ఈ విషయంలో గత ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిందని చెప్పొచ్చు. అయితే ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వమైనా ఈ దిశగా కృషిచేస్తే తెలుగుభాషకు కొంత మేలు జరుగుతుంది. తక్షణమే సాంస్కృతికశాఖ ఈ దిశగా కృషి చేస్తే కొంత ఫలితం ఉంటుంది. ఐదో తరగతి వరకు తప్పనిసరిగా తెలుగులోనే బోధన జరగాలని, పాఠశాల, ఇంటర్మీడియట్ స్థాయిలో తెలుగుకు ప్రాధాన్యం ఇవ్వాలనే డిమాండ్ ఎంతో కాలంగా ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఆచరణకు నోచుకోలేదు.

అధికార భాష సంఘాన్ని ఏర్పాటుచేయాలి

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుతీరింది కనుక నూతనంగా రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో అధికార భాషా సంఘాన్ని ఏర్పాటుచేసి దానికి తగినన్ని నిధులు కేటాయిస్తే తెలుగు భాష పునరుత్తేజానికి దోహదపడుతుంది. అయితే ఈ నియామకాలు పారదర్శకంగా తెలుగుభాష అభివృద్ధికి కృషి చేసే వారితో ఉండాలే తప్ప రాజకీయపరమైన సిఫార్సులతో చేస్తే మాత్రం ఎటువంటి ఉపయోగం ఉండదని భాషాభిమానుల అభిప్రాయం నాటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 2018 ఆగస్టులో భాషా బ్రహ్మోత్సవాలను నిర్వహించారు. అయితే గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇటువంటివి ఏవీ జరగలేదు. అయితే మళ్లీ ప్రస్తుతం తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో తిరిగి భాషా బ్రహ్మోత్సవాలు జరుగుతాయనే ఆశాభావాన్ని సాహితీవేత్తలు వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా తెలుగుభాష కోసం కృషిచేసిన వారికి గతంలో భాషా పురస్కారాలను అందజేయగా, వైసీపీ ప్రభుత్వం వాటిని కూడా పక్కన బెట్టింది. వీటి విషయంలో కూడా ప్రస్తుత ప్రభుత్వం ఆలోచన చేయాలని పలువురు కోరుతున్నారు.

తగినంత ప్రాధాన్యత లభించటం లేదు
-తేళ్ల అరుణ, రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు, నరసం



మన మాతృభాష తెలుగుకు తగినంత ప్రాధాన్యత లభించటం లేదనే చెప్పాలి. ఇరుగుపొరుగున ఉన్న తమిళ, కన్నడ రాష్ట్రాలలో వారి మాతృభాషాభివృద్ధికి అక్కడి ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు ఎంతో ప్రాముఖ్యతను ఇస్తారు. అయితే మన రాష్ట్రంలో మాత్రం ఆ విషయంలో చాలా లోపం కనబడుతుంది. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో తెలుగు భాషాభివృద్ధికి కొంత కృషి జరిగినా ఆ తర్వాత ఆ దిశగా ఎటువంటి చర్యలు లేవు. ఇప్పటికైన ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలుగుభాష అభివృద్ధికి అవసరమైన చర్యలు, తగినన్ని నిధులపై దృష్టి సారించాలి.

అమ్మభాషతోనే అభివృద్ధి సాధ్యం



మాతృభాష అభివృద్ధి చెందితే కళలు తద్వారా చైతన్యం పెరిగి సమాజం అభివృద్ధి చెందుతుంది. స్వాతంత్ర్య సమరం సమయంలో సైతం మన మాతృభాషలో వచ్చిన ఎన్నో గీతాలు, కవితలు, పుస్తకాలు నాటి యువతను చైతన్యపరిచాయి. ఇందుకోసం తక్షణమే సాహిత్య అకాడమీకి పాలకవర్గాన్ని ఏర్పాటు చేయటం, నిధులు కేటాయించటం, సాహిత్య సభలు నిర్వహించేవారికి, రచయితలకు తగిన ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వపరంగా అందించటం జరగాలి.
-డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, మాజీ డైరెక్టర్, సాహిత్య అకాడమీ

పాటల్లో తెలుగుపదాలు కనుమరుగవుతున్నాయి
-పి.శ్రావ్యరెడ్డి, ఉత్తమగాయని పురస్కార గ్రహీత



ఒకనాటి తెలుగు సినిమా పాటల్లో సాహిత్యం పుష్కలంగా ఉండేది. అంతేకాకుండా నాటి కవులు రాసిన పాటల ద్వారా ఎన్నో కొత్తపదాలు, వివిధ ప్రాంతాల మాండలికాలు సైతం వెలుగులోకి వచ్చాయి. అయితే ప్రస్తుతం వస్తున్న సినిమాపాటల్లో ఆంగ్లపదాలు చోటుచేసుకోవటం, సాహిత్య విలువలు తగ్గిపోవటం చాలా బాధాకరం. తెలుగు భాషాభివృద్ధికి సినిమాపాటలు సైతం దోహదం చేస్తాయి కనుక గీత రచయితలు తెలుగుభాషకు, సాహిత్య విలువలకు ప్రాధాన్యం ఇస్తే బాగుంటుంది.

సుబ్బారెడ్డి సేవలు ఆదర్శనీయం



తాటిపర్తి సుబ్బారెడ్డి (ఫైల్)

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 28: పొగాకు రైతుల సంక్షేమం కోసం కోల్ సొసైటీ అధ్యక్షుడు తాటిపర్తి సుబ్బారెడ్డి చెరగని ముద్ర వేసుకున్నారని కోల్ సొసైటీ అధికారి ఎంఎస్.కృష్ణమూర్తి పేర్కొన్నారు. బుధవారం ఒంగోలులోని కోల్ సొసైటీ కార్యాలయంలో జరిగిన సుబ్బారెడ్డి సంతాప సభలో ఆయన మాట్లాడారు. పొగాకు రైతుల ఇబ్బందులను పరిష్కరించేందుకు 1947లో తాటిపర్తి సుబ్బారెడ్డి తండ్రి చక్రారెడ్డి ది గుంటూరు జిల్లాపొగాకు ఉత్పత్తిదారుల, క్యూరర్ల సహకార మార్కెటింగ్ స్థాపించి స్థానిక భాగ్యనగర్ మొదటి లైనులో 57 సెంట్ల విలువైన స్థలాన్ని సంఘానికి ఇచ్చారన్నారు. 2013లో సంఘ అధ్యక్షులైన సుబ్బారెడ్డి తన తండ్రి ఆశయాలను మరింతగా ముందుకు తీసుకెళ్తూ రైతులకు ఎంఆర్‌పీ ధరలకే ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తూ సంఘాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తూ ముందుకు వచ్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడుగా ఉంటూ అనేక కాలనీల ఏర్పాటు చేయడంతోపాటు పేదలకు పట్టాలు ఇప్పించడం, రైతులకు స్ప్రింకర్లు, మత్స్యకారులకు బోట్లు, పడవలతో పాటు పలు పథకాలను పేదలకు ప్రభుత్వం నుంచి ఇప్పించిన మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. సేవాతత్పరుడైన సుబ్బారెడ్డి కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించేందుకు కావాల్సిన పనులను, నియమ నిబంధనలకు అనుగునంగా పాదర్శకంగా నిర్మాణాలను చేపట్టి సకాలంలో పూర్తి చేసిన వ్యకి అని కొనియాడారు. ఆయన జీవితం పలువురికి ఆదర్శనమని ఆయన పేర్కొన్నారు.

ఎస్ఎస్ఎన్ విద్యార్థుల నిరసన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

ఒంగోలు(విద్య), ఆగస్టు 28 : కోల్‌కతాలోని ఆర్‌జీకర్ మెడికల్ కళాశాల వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘనటనను నిరసిస్తూ ఒంగోలులోని ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కళాశాల డైరెక్టర్ వై.సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. స్థానిక కళాశాల నుంచి మంగమూరు రోడ్డు జంక్షన్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సమాజంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులను ఖండించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.రాజేంద్రబాబు, టి.రాజశేఖర్‌రెడ్డి, నిరోషా, ఎం.పద్మ పాల్గొన్నారు.

డిప్యూటీ డీఈవో చేయూత



విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న డిప్యూటీ డీఈవో రోజామేరీ

సంతనూతలపాడు, ఆగస్టు 27: మైనంపాడు పంచాయతీ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు డిప్యూటీ డీఈవో రోజామేరీ చేయూత నిందించారు. 20 మంది విద్యార్థులకు యూనిఫాం కుట్టుకూలీ కింద రూ.16వేల ఆర్థికసాయం బుధవారం స్వచ్ఛందంగా అందించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్స్, పండ్లు పంపిణీ చేశారు. రానున్న క్రిస్మస్‌కు కూడా నూతన వస్త్రాలు అందించనున్నట్లు ఆమె తెలిపారు. మిగిలిన విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరైతే అటువంటి వారికి యూనిఫాం కుట్టుకూలీ తానే స్వయంగా అందజేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకారెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నందిపాడు సొసైటీ ద్వారా పంటరుణాలు

మద్దిపాడు, ఆగస్టు 28: నందిపాడు సొసైటీ ద్వారా రైతులకు విరివిగా పంట రుణాలు అందిస్తున్నట్లు సొసైటీ ఎక్స్‌అఫిషియో సభ్యుడు సూది శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మద్దిపాడులోని సొసైటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు సొసైటీ ద్వారా రుణాలు పొందవచ్చన్నారు. అదేవిధంగా డిపాజిట్లు సైతం చేసుకోవచ్చని చెప్పారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.20.56 లక్షల లాభం సొసైటీకి వచ్చిందన్నారు. సీఈవో ఎన్.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సొసైటీ కార్యాలయంలో ఆధార్ కార్డు, పాన్ కార్డు భూమి వివరాలు జిరాక్స్ అందజేయాలన్నారు. రైతులకు సొసైటీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని, సొసైటీలను ప్రభుత్వం కంప్యూటరీకరణ చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

బ్యారన్ల రిజిస్ట్రేషన్ ప్రారంభం

కొండపి, ఆగస్టు 28 : పొగాకు బ్యారన్ల రిజిస్ట్రేషన్ స్థానిక వేలం కేంద్రంలో బుధవారం నుంచి ప్రారంభమైంది. తొలిరోజు తొమ్మిది బ్యారన్లను రిజిస్ట్రేషన్ చేశారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ మాట్లాడుతూ బోర్డు నూతన నిబంధనల ప్రకారం మూడు సంవత్సరాల నుంచి బ్యారన్లలను రైతులు రిజిస్టర్ చేయించుకోకపోతే ఈఏడాది చేయబోమని తెలిపారు. రైతులు అక్టోబరు 24వ తేదీ వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చన్నారు. అక్టోబరు 25 నుంచి రూ.100, నవంబరు 9 నుంచి 20వ తేదీ వరకు రూ.400 అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

వాణిజ్యపన్నులశాఖలో బదిలీలను వాయిదా వేయాలి

సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింగరావు



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 28: వాణిజ్య పన్నులశాఖలో ఉద్యోగుల బదిలీలను ప్రభుత్వం వాయిదా వేయాలని ఆశాఖ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు జాజుల నరసింగరావు కోరారు. ఒంగోలు నగరం దారావారితోటలోని వాణిజ్యపన్నులశాఖ సముదాయం భవనం వద్ద బుధవారం మధ్యాహ్నం భోజన విరామన సమయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో శాఖలో 2.0 ఆర్గనైజేషన్ పేరుతో రాజ్యాంగ వ్యతిరేకంగా రాష్ట్రపతి ఉత్తర్వులకు భిన్నంగా ఉద్యోగుల బదిలీలు జరిగాయన్నారు. వాటిని రద్దు చేస్తూ వారి సొంత యూనిట్ ఆఫ్ అపాయింట్ స్థానాలకు బదిలీచేసి మరలా సర్కిల్ వ్యవస్థను పరిపుష్టత తీసుకు రావాలని కోరారు. జీఎస్టీవోలకు వర్క్ ఫంక్షన్ ఏర్పాటు చేయాలని, రీజినల్ ఆఫీసును రద్దు చేయాలన్నారు. గత ప్రభుత్వంలో పలువురు ఉన్నతాధికారులు పన్ను ఎగవేతదారులకు సహకరించినందున ప్రభుత్వ ఖజానాకు తీరని నష్టం జరిగిందని ఆరోపించారు. గత బలవంతపు బదిలీలను సరిదిద్దేవరకు బదిలీలను వాయిదా వేయాలని ఆయన కోరారు. వాణిజ్యపన్నుల శాఖలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, ఉన్నతాధికారుల అవినీతిపై ఏసీబీ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి తోట కిరణ్‌కుమార్, డివిజన్ కార్యవర్గ సభ్యులు కురిచేటి సుధాకర్, బి.రవికుమార్, అహ్మద్‌బాషా, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి బ్రాహ్మణ సంఘాల కృతజ్ఞతలు

● అర్చకుల వేతనాల పెంపుపై హర్షం

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 28: రాష్ట్రంలో దేవాలయాలలో పనిచేసే అర్చకుల వేతనాన్ని రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయం పట్ల పలు బ్రాహ్మణ సంఘాల వారు హర్షం వ్యక్తం చేశారు. అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘ రాష్ట్ర టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ లంకా ప్రసన్న కుమార్ ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ధూపదీప నైవేద్యాలకు ఇచ్చే మొత్తం రూ.5 వేల నుంచి రూ.10వేలకు పెంచటం, వేద విద్యార్థులకు నెలకు రూ.3 వేల భృతి ఇవ్వటం వంటి నిర్ణయాలు బ్రాహ్మణులకు ఎంతో మేలు చేస్తాయన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా అర్చక సంక్షేమ సంఘం అధ్యక్షులు సోమరాజుపల్లి నాగేశ్వరరావు, ప్రధానకార్యదర్శి ఎంఏ.శేషాచార్యులు తదితరులు ముఖ్యమంత్రి నిర్ణయాలపట్ల హర్షం ప్రకటించి ఆయనకు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా బ్రాహ్మణ సాధికారిక కమిటీ కోఆర్డినేటర్ టీవీశ్రీరామమూర్తి మాట్లాడుతూ ప్రతి దేవాలయం పాలకమండలిలో ఒక బ్రాహ్మణుడిని సభ్యునిగా నియమించటం, హిందూ దేవాలయాల ఆస్తుల పరిరక్షణ కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయడం వంటి పలు నిర్ణయాల పట్ల ముఖ్యమంత్రికి, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి నిర్ణయాల పట్ల హర్షం వ్యక్తం చేసిన వారిలో పొన్నలూరి శ్రీనివాస ఫణి, ఎస్ఏటీ రాజేష్, గంజాం రంగనాథ్, వ్యామజాల ప్రసన్నకుమార్, కె.మారుతి, యు.వంశీ, ఎస్.సుజాత, కుసుమకుమారి, వనజ తదితరులు పాల్గొన్నారు.

నాయిబ్రాహ్మణులకు కనీస వేతనం రూ.25వేలు..

ఒంగోలు(కలెక్టరేట్): రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల్లో పనిచేసే నాయిబ్రాహ్మణులకు రూ.25వేలు కనీసవేతనంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడం పట్ల నాయిబ్రాహ్మణ టీడీపీ రాష్ట్ర సాధికార సమితి సభ్యులు పిల్లుట్ల సుధాకర్ బాబు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ ప్రకటించడం, నాయిబ్రాహ్మణులకు 200 యూనిట్ల ఉచితవిద్యుత్ ఇవ్వడం, ఆదరణ పథకం, బీసీ రక్షణ చట్టం, దేవాలయ పాలక మండలాల్లో నాయిబ్రాహ్మణులకు స్థానం కల్పించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నేడు, రేపు ఒంగోలులో రాష్ట్రస్థాయి సమావేశాలు

వ్యవసాయ కార్మిక సంఘం ప్రధానకార్యదర్శి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 28 : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి విస్తృత స్థాయి సమావేశాలు గురు, శుక్రవారాల్లో ఒంగోలులోని కాపు కళ్యాణ మండపంలో జరుగుతాయని సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.వెంకటేశ్వర్లు వెల్లడించారు. స్థానిక సుందరయ్యభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ రాష్ట్ర మహాసభల్లో ఉద్యమాలపై సమీక్ష చేయడంతో పాటు భవిష్యత్ పోరాటాల కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 200 మందికి పైగా ప్రతినిధులు హాజరవుతారని, జాతీయ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎ.విజయరాఘవన్, బి.వెంకట్ ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని ఆయన తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘాన్ని 1934లో అమర జీవి పుచ్చలపల్లి సుందరయ్య స్వగ్రామమైన ఆలగానిపాడులో స్థాపించారన్నారు. దున్నేవారికి భూమి దక్కాలని, కనీస వేతన చట్టం, ఆహార భద్రత, సామాజికన్యాయం తదితర అంశాలపై సంఘం అనేక ఉద్యమాలు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులన్ని కార్పొరేట్లకు తాకట్టుపెట్టే విధానాలను ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయని ఆరోపించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం పలు అంశాలపై చరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, నెరుసుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం : సీపీఎం



నివాళులర్పిస్తున్న నాయకులు

ఒగేలు(కలెక్టరేట్), ఆగస్టు 28: ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటాలే అమరవీరులకు ఇచ్చే నిజమైన నివాళులని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వై.సిద్ధయ్య అన్నారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక సుందరయ్యభవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా బషీర్‌బాగ్‌లో అప్పటి ప్రభుత్వం ఉద్యమకారులపై పాశవికంగా కాల్పులు జరిపి ముగ్గురిని బలికొందన్నారు. ఆ పోరాటం తర్వాత ప్రపంచ బ్యాంకు సంస్కరణల వేగం తగ్గిందని ఆయన పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శి సయ్యద్‌హనీఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం రకరకాల పేరుతో విద్యుత్ చార్జీలను పెంచిందని ఆరోపించారు. విద్యుత్ బిల్లులు కట్టలేక ప్రజలు అల్లాడిపోతున్నారని, సీఎం చంద్రబాబు విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో జాలా అంజయ్య, వి.వెంకటేశ్వర్లు, షేక్ మాబు, కంకణాల ఆంజనేయులు, జి.రమేష్, కాలం సుబ్బారావు, బంకా సుబ్బారావు, కంకణాల రమాదేవి, వి.బాలకోటయ్య, తంబి శ్రీనివాసులు, ఎస్‌డీ.హుస్సేన్, టి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ శ్రీకాంత్



ఎస్ఐ శ్రీకాంత్

నాగులుప్పలపాడు ఆగస్టు 26 : నాగులుప్పలపాడు ఎస్ఐగా బి.శ్రీకాంత్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీలలో ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ బ్రహ్మనాయుడును వీఆర్‌కు బదిలీ చేశారు. ఇక కురిచేడులో పనిచేస్తున్న శ్రీకాంత్‌ను ఇక్కడకు బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా విధుల్లో చేరిన ఎస్ఐ శ్రీకాంత్‌ను సిబ్బంది బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి : మాచవరం గ్రామంలోని పేకాట శిబిరంపై ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. రూ.1800 నగదు స్వాధీనం చేసుకొని ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అవీ..ఇవీ..

ఇంటర్ విద్యార్థులకు నేటి నుంచి యూనిట్ టెస్ట్-2

● ఆర్ఐవో సైమన్‌విక్టర్

ఒంగోలు(విద్య), ఆగస్టు 28: జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ఇతర ప్రభుత్వ రంగ పాఠశాలల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు గురువారం నుంచి యూనిట్ టెస్ట్-2 పరీక్షలు జరుగుతాయని ఆర్ఐవో సైమన్‌విక్టర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు సంబంధించి ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు మాత్రమే బోర్డు నుంచి ప్రశ్నపత్రాలను సరఫరా చేస్తారు. హైస్కూలు ప్లస్, కేజీబీవీలు, ఏపీ మోడల్ స్కూళ్లలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు వారికి బోధిస్తున్న అధ్యాపకులే ప్రశ్నపత్రాలు తయారు చేసి పరీక్షలు నిర్వహిస్తారు. ఈ విద్యాసంస్థలు పాఠశాలవిద్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నందున ఈ విద్యార్థులకు ఇంటర్ బోర్డు ప్రశ్నపత్రాలను సరఫరా చేయదని తెలిపారు. అయితే ఈ విద్యార్థులకు నిర్వహించిన యూనిట్ టెస్ట్ జవాబుపత్రాలు వెంటనే మూల్యాంకనం చేసి మార్కులను నిర్ధిష్ట ప్రొఫార్మాలో ఆర్ఐవో కార్యాలయానికి పంపించాలని ఆయన కోరారు.

డివిజన్ స్థాయిలో టీచర్లకు సర్దుబాటు కౌన్సెలింగ్

ఒంగోలు(విద్య), ఆగస్టు 28 : ఒంగోలు డివిజన్ స్థాయిలో ఉపాధ్యాయుల పనిసర్దుబాటు కౌన్సెలింగ్ బుధవారం సాయంత్రం స్థానిక పాత రిమ్స్‌లోని ఉపవిద్యాధికారి కార్యాలయంలో జరిగింది. ఉపవిద్యాధికారి అనితా రోజ్‌రాణి కౌన్సెలింగ్ నిర్వహించారు. డివిజన్ పరిధిలో స్కూలు అసిస్టెంట్ తెలుగు ఒకటి, హిందీ ఆరు, ఇంగ్లీషు 7, ఫిజికల్ సైన్స్ ఒకటి, బయాలజికల్ సైన్స్ ఒకటి, సోషల్ 4 కలిపి మొత్తం 22 పోస్టులు ఖాళీ ఉన్నాయి. డివిజన్ పరిధిలోని అన్ని మడలాల నుంచి 22 మంది స్కూలు అసిస్టెంట్లు మిగులుగా తేలారు. వీరికి సబ్జెక్టు వారీగా కౌన్సెలింగ్ నిర్వహించారు. స్కూలు అసిస్టెంట్ ఇంగ్లీషు పోస్టుల భర్తీపై అభ్యంతరం రావడంతో ఆ సబ్జెక్టుపై విచారణ కోసం కౌన్సెలింగ్ వాయిదా వేశారు. హిందీ ఆరు ఖాళీలు ఉండగా మూడు పోస్టులు భర్తీ అయ్యాయి. మిగిలిన మూడు పోస్టులకు అర్హులు లభించకపోవడంతో మిగిలిపోయాయి. తెలుగు, పీఎస్, బీఎస్, ఎస్ఎస్ పోస్టులు భర్తీ అయ్యాయి. బయాలాజికల్ సైన్స్ స్కూలు అసిస్టెంట్లు ఇద్దరు మిగులుగా తేలడంతో మూడు పోస్టులను అర్హులైన ఎస్‌జీటీలతో భర్తీ చేశారు.

రామకృష్ణయ్యకు ఘన నివాళి

ఒంగోలు(విద్య), ఆగస్టు 28: ఉపాధ్యాయ ఉద్యమ రథసారథి సింగరాజు రామకృష్ణయ్య 22వ వర్ధంతి సందర్భంగా పలువురు ఏపీటీఎఫ్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఒంగోలులోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సింగరాజు రామకృష్ణయ్య వర్ధంతి కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమాన్ని నిర్మించి దేశంలోనే ఉపాధ్యాయులకు, ఉపాధ్యాయ సంఘాలకు గుర్తింపు తెచ్చిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో ఐ.విజయసారథి, బి.రఘుబాబు, ఎంవీ.కృష్ణయ్య, పి.సుబ్బారావు, డి.శ్రీనివాసులు, ఎం.యోహాన్‌రెడ్డి, శేషారావు, హనుమంతరావు, తిరుమల, అనిత పాల్గొన్నారు.

పేస్‌లో అతిథి ఉపన్యాసం

ఒంగోలు(విద్య), ఆగస్టు 28 : ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో పారిశ్రామిక భద్రత, కెరీర్ గైడెన్స్‌పై బుధవారం అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థి, విజయవాడ రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు సీనియర్ ఇంజనీర్ ఎస్.నరసింహారావు మాట్లాడుతూ పరిశ్రమల్లో పాటించాల్సిన భద్రతా చర్యలు, జాగ్రత్తలు, ఉద్యోగ అవకాశాలపై వివరించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ నైపుణ్యాలు కలిగిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు అపారమన్నారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, ట్రిపుల్ ఐటీ విభాగాదిపతి బి.నాగరాజు, కో ఆర్డినేటర్ కేవీ.నారాయణ, కో కన్వీనర్ బివెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సాయినాథ్‌పై విచారణ పూర్తి

ఒంగోలు(విద్య), ఆగస్టు 28 : పలు అభియోగాలు ఎదుర్కొంటున్న ఒంగోలు డివిజనల్ సహకారాధికారిగా పనిచేసి బదిలీ అయిన తోట సాయినాథ్‌పై విచారణ బుధవారం పూర్తయింది. జిల్లా సహకారాధికారి(డీసీవో) బి.శ్రీనివాసరెడ్డి ఒంగోలులోని తన కార్యాలయంలో సాయినాథ్‌ను విచారించారు. ఈ అభియోగాలపై విచారించేందుకు డీసీవో, దివ్యాంగుల సంక్షేమశాఖ ఏడీ అర్చనలు సాయినాథ్‌కు, ఇన్‌స్పెక్టర్ అశోక్‌కు నోటీసులు ఇచ్చారు. అయితే సాయినాథ్ విచారణకు హాజరుకాగా అశోక్ సెలవులో ఉండటంతో హాజరు కాలేదు. అలాగే ఏడీ అర్చన బాపట్ల వెళ్లడంతో డీసీవో ఒక్కరే విచారణ చేశారు. విచారణకు హాజరయ్యేందుకు అశోక్‌కు పది రోజులు వ్యవధి కోరడంతో వచ్చేనెల 9న హాజరుకావాలని ఆదేశించారు. త్వరలో విచారణ నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు డీసీవో తెలిపారు.

టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నాగులుప్పలపాడు ఆగస్టు 28: అమ్మనబ్రోలు గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందీ, సోషల్ సబ్జక్టులు బోధించే ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు సెల్ నంబరులో 87126 25043 సంప్రదించాలని ఆమె కోరారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సోమశేఖర్

కొండపి, ఆగస్టు 28 : ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సీఐ సోమశేఖర్ సూచించారు. ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ఆటోలను ఆయన సిబ్బందితో బుధవారం గుర్తించారు. వాటిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఈసందర్భంగా డ్రైవర్‌లకు సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. మద్యం తాగి ఆటోలు నడిపినా, రోడ్లపై అడ్డంగా నిలిపినా కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. నిర్దేశిత ప్రదేశాల్లోనే ఆటోలను నిలపాలని సూచించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

కొండపి, ఆగస్టు 28 : కొండపిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ పసుపులేటి మురళి బుధవారం పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సరుకులు, వంటశాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన నిర్వహణ పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

189 పొగాకు బేళ్ల తిరస్కరణ

కొండపి, ఆగస్టు 28 : కొండపి పొగాకు వేలం కేంద్రంలో లోగ్రేడ్ రకం ధరలు గణనీయంగా తగ్గాయి. కిలోకు రూ.105 నుంచి రూ.212 లభిస్తోంది. తిరస్కరణ బేళ్ల సంఖ్య కూడా పెరిగింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం జువ్విగుంట, అయ్యవారిపాలెం, తంగెళ్ల, జాళ్లపాలెం, పీరాపురం గ్రామాల రైతులకు చెందిన బేళ్లను అధికారులు వేలానికి అనుమతించారు. వాటిలో 977 బేళ్లను మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేశారు. 189 నోబిడ్ అయ్యాయి.

కుస్తీ పోటీల్లో నారాయణ విద్యార్థుల ప్రతిభ



పతకాలు పొందిన విద్యార్థులు

ఒంగోలు(విద్య), ఆగస్టు 28: తిరుపతి సమీపంలోని రేణిగుంటలో జరిగిన అంతర్రాష్ట్ర కుస్తీ పోటీల్లో ఒంగోలు నగరం అంజయ్య రోడ్డులోని నారాయణ ఈ టెక్నో ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. విజేతలుగా నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఏజీఎం పెద్దిరెడ్డి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, పీఈటీ ఆదినారాయణ, జాషువ, ఏవో రామోజీరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి కూలీకి పని కల్పించాలి

టంగుటూరు, ఆగస్టు 28 : పని అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలని ఏపీవో సుభాషిణి సూచించారు. ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో టంగుటూరులో బుధవారం మాట్లాడుతూ ఎన్నికల అనంతరం పనుల్లో కొంత జాప్యం జరిగిందన్నారు. ఇకపై వేగవంతం చేయాలని కోరారు. గ్రామాల్లో గుర్తించిన పనులనే చేపట్టాలన్నారు. కూలీలకు గిట్టుబాటు కూలి లభించేలా చూడాలని చెప్పారు.

దొంగల ముఠా..గంజాయితో దొరికింది..!

- నలుగురు దొంగలు అరెస్టు
- 20 కిలోలు గంజాయి స్వాధీనం
- రూ.2.80 లక్షల విలువైన సొత్తు సీజ్



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ నాగరాజు (ఇన్‌సెట్లో) పట్టుకున్న గంజాయి ప్యాకెట్లు

ఒంగోలు(క్రైం), ఆగస్టు 28: దొంగతనాలే వృత్తిగా ఎంచుకొని నిత్యం చోరీలకు పాల్పడుతున్న ఓ ముఠా ఒంగోలులో గంజాయి విక్రయిస్తూ పట్టుబడింది. బుధవారం స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐ వై.నాగరాజు ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. తాళ్ళూరు మండలం శివరామపురంనకు చెందిన రావిపాటి జగదీష్, పొదిలి పట్టణం ఓబులశెట్టివారివీధికి చెందిన పొదిలి నరసింహారావు, బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం కుందూరుకు చెందిన గోరంట్ల ఏడుకొండలు, బాపట్లలోని దేవుడుమాన్యంలో నివాసం ఉండే మేడికొండ రంగాలను బుధవారం ఉదయం అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. స్థానిక సీతారామపురం కొండమీద దేవాలయం వద్ద ఈ నలుగురు దొంగలు గంజాయి ప్యాకెట్లను చిన్నచిన్న పొట్లాలుగా కడుతుండగా పోలీసులు సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. అనంతరం తహసీల్దార్ వాసు సమక్షంలో విచారించారు. అయితే ఈ నలుగురు వ్యక్తులు చోరీలు చేయడంలో అందె వేసిన వారని, వారు జైలు నుంచి విడుదల అయ్యి విజయవాడ రైల్వేస్టేషన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి ఒంగోలులో విక్రయించేందుకు వచ్చినట్లు అంగీకరించారని సీఐ తెలిపారు. వారి వద్ద 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అయితే నిందితుల్లో రావిపాటి జగదీష్ గత నెల 8న ఒంగోలు నగరం ఏనుగుచెట్టు వద్ద ఇల్లు అద్దెకు కావాలని ఓ ఇంట్లోకి వెళ్ళి పటాపంజుల సుగుణమ్మ అనే వృద్ధురాలిపై బలమైన ఆయుధంతో దాడి చేశాడు. ఆమె వద్ద ఉన్న 9 సవర్ల బంగారపు ఆభరణాలు అపహరించాడని విచారణలో వెల్లడించినట్లు చెప్పారు. దీంతో 9 సవర్ల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని, దాని విలువ రూ.1.80 లక్షలు ఉంటుందన్నారు. అదేవిధంగా గంజాయి విలువ లక్షరూపాయలు ఉంటుందని, మొత్తం సొత్తు విలువ రూ.2.80 లక్షలు ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే పొదిలి నరసింహారావు రెండు తెలుగు రాష్ట్రాలలో 92దొంగతనాలలో నిందితుడని సీఐ నాగరాజు వెల్లడించారు. గోరంట్ల ఏడుకొండలుపై ఆరు కేసులు ఉన్నాయిని తెలిపారు. మేడికొండ రంగాపై రెండు తెలుగు రాష్ట్రాలలో 16 కేసులు ఉన్నట్లు ఆయన వివరించారు.

ఎస్పీ అభినందనలు

నిందితులను పట్టుకున్న ప్రత్యేక పోలీసు బృందానిన ఎస్పీ దామోదర్ అభినందించారని సీఐ నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్సై టి.కిషోర్‌బాబు, ఏఎస్సై సురేష్, హెడ్ కానిస్టేబుళ్ళు ఎం.సాయి, జి.విజయ్, కానిస్టేబుళ్లు ఎం.అనిల్ పాల్గొన్నారు.

మందకొడిగా పంటల నమోదు

మద్దిపాడు, ఆగస్టు 28: ఖరీఫ్ పంటల నమోదు ప్రక్రియ మద్దిపాడు మండలంలో మందకొడిగా సాగుతోంది. నెలరోజులైనా పంట నమోదు కార్యక్రమం 60శాతం మాత్రమే పూర్తయింది. మరో 20 రోజుల్లో మిగతా పూర్తి చేయాల్సి ఉంది. విపత్కర పరిస్థితిలో రైతులకు అండగా నిలిచే ఈ ప్రక్రియ ఆశించినంతగా సాగటం లేదు. రైతులు తొలుత రైతు సేవ కేంద్రాల్లో పంట వివరాలు వ్యవసాయ సిబ్బందికి తెలియజేసి నమోదు చేయించాలి. సాగు చేసిన పంట రకం, విస్తీర్ణం, సర్వే నెంబరు, పాస్ పుస్తకం, ఆధార్ నెంబరు, ఫోన్ నెంబరు ఇవ్వాలి. రైతు సేవా కేంద్రం సిబ్బంది పొలాలకెళ్లి ఏ రైతులు ఏ పంట సాగు చేశారో ఫొటోలు ఇవ్వాలి. అనంతరం ఈ-పంటలో నమోదు చేయాలి. ఈ విధంగా నమోదు చేసుకుంటే వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం ఇచ్చే పథకాలు వర్తిస్తాయి. ఉచిత పంటల బీమా, పెట్టుబడి రాయితీ, ఉత్పత్తుల విక్రయం సవ్యంగా జరుగుతాయి. అయితే సర్వర్ పనిచేయకపో వటంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. సెప్టెంబరు 15వ తేదీ నాటికి నూరు శాతం నమోదు చేస్తామని మండల వ్యవసాయశాఖ అధికారి రమేష్‌బాబు బుధవారం తెలిపారు.

స్కూళ్ల అభివృద్ధికి ఎస్‌ఎంసీలు పాటుపడాలి



మాట్లాడుతున్న ఎంఈవో వెంకారెడ్డి

సంతనూతలపాడు, ఆగస్టు 27: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎస్‌ఎంసీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు)లు పాటు పడాలని ఎంఈవో వెంకారెడ్డి తెలిపారు. సంతనూతలపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎస్ ఎంసీ చైర్మన్‌లు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, హెచ్‌ఎంల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మధ్యాహ్నభోజనాన్ని చైర్మన్లు పరిశీలించాలని, ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందిస్తున్నారో లేదో చూడాలని చెప్పారు. అదేవిధంగా ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లు సోమ, గురువారాల్లోను, ఎస్‌ఎంసీ చైర్మన్లు టాయిలెట్ల ఫొటోలు తీసి ఐఎంఎంఎస్ యాప్‌లో పొందుపరచాలని తెలిపారు. స్కూళ్ల అభివృద్ధికి దాతల సహకారం కూడా తీసుకోవాలన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లుకు లోనుకాకుండా పాఠశాలలకు సక్రమంగా హాజరయ్యేలా కమిటీలు చూడాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్‌వో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

చీమకుర్తి, ఆగస్టు 28 : సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం చీమకుర్తి పట్టణంలో ఇందుకోసం వర్క్‌షాపును నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీనియర్ నాయకుడు గుండా శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ అధిష్టానం పిలుపుమేరకు సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి జాతీయ సభ్యత్వ నమోదు ప్రారంభమవుతుందన్నారు. చీమకుర్తిలో సెప్టెంబరు 4వ తేదీ నుంచి ప్రారంభించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డు శంకర్రావు, బొడ్డపాటి వెంకటేశ్వర్లు, పాత్రుని నాగార్జున, శ్రీనివాస్, కోర నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చీకట్లోనే రాకపోకలు..!



బ్రిడ్జిపై నెలకొన్న అంధకారం, వెలగని లైట్లు

ఒంగోలు నగరం కొప్పోలురోడ్డులోని బ్రిడ్జిపై గత వారం రోజుల నుంచి చీకటిమయంగా మారింది. ఈ మార్గంలో లైట్లు వెలగకపోవటంతో అంధకారం నెలకొంది. దీనివల్ల రాత్రుళ్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. - ఒంగోలు/ఆంధ్రజ్యోతి

నేతల చుట్టూ సచివాలయ ఉద్యోగుల ప్రదక్షిణలు

సిఫార్సు లేఖల కోసం పోటీ

ప్రతి ఉద్యోగికి స్థానచలనం ఉండాలంటున్న ఎమ్మెల్యే

మార్కాపురం, ఆగస్టు 28: సచివాలయ ఉద్యోగుల బదిలీల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. పది రోజుల నుంచి సచివాలయ ఉద్యోగుల తాకిడితో కూటమి నాయకులు సతమతమవుతున్నారు. గ్రామస్థాయి, వార్డుస్థాయి నాయకుల వెంటబడుతున్నారు. ఆయా గ్రామాలు, వార్డులకు చెందిన వారైతే ఫర్వాలేదు ఇతర ప్రాంతాలకు చెందిన వాళ్లు కూడా తమకు పోస్టింగులు ఇప్పించాలని కోరుతున్నారు. వారి అభ్యర్థనను కాదనలేక రెండు రోజుల క్రితం వరకు ఉద్యోగులను ఎమ్మెల్యే నారాయణరెడ్డి వద్దకు వెంటబెట్టుకుని వెళ్లారు. నియోజకవర్గంలో సుమారు వందల సంఖ్యలో సచివాలయ ఉద్యోగులు ఉండటంతో వారిని ఏ విధంగా బదిలీ చేయాలో అర్థంకాక నాయకులు తలలు పట్టుకుంటున్నారు. మొదట్లో పనిచేసిన మండలం నుంచి ఇతర మండలాలకు వెళ్లాలని అందుకనుగుణంగా సిఫార్సు లేఖలు ఇచ్చారు. కొందరు పార్టీ నాయకులు అలా చేస్తే మనకు సంబంధించిన వాళ్లు ఇబ్బందులకు గురవుతారని అభ్యంతరం చెప్పారు. దీంతో కూటమి నాయకులు, అధికారులతో చర్చించిన అనంతరం మండల పరిధిలోనే బదిలీలు చేసినా ఒక్క ఉద్యోగి కూడా వారు పనిచేసిన చోట ఉండకూడదని ఎమ్మెల్యే నారాయణరెడ్డి వారికి షరతు విధించినట్లు తెలిసింది.

వైసీపీ నాయకులతో అంటకాగుతున్నారనే కఠిన నిర్ణయం

సచివాలయ వ్యవస్థను వైసీపీ ప్రభుత్వ తీసుకొచ్చింది. ఒక్కో సచివాలయంలో సుమారు 10 మందికిపైగానే ఉద్యోగులను నియమించింది. గత సార్వత్రిక ఎన్నికల వరకు వారంతా వైసీపీ నాయకులతో కలిసి పనిచేశారు. అంతేకాక వారికి ఉద్యోగాలు వచ్చింది వైసీపీ ప్రభుత్వంలోనే కావడంతో కొంతమేర ఆ పార్టీపై సానుకూలత ఉంది. సార్వత్రిక ఎన్నికల్లో కూడా మెజార్టీ సచివాలయ ఉద్యోగులు వైసీపీ మద్దతు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇప్పటికీ సచివాలయ ఉద్యోగులు వైసీపీ నాయకులకే ప్రాధాన్యత ఇస్తూ పనులు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని ఫిర్యాదులు ఇప్పటికే ఎమ్మెల్యే నారాయణరెడ్డికి అందాయి. ఈ నేపథ్యంలోనే సచివాలయ ఉద్యోగులను ఒక్కరిని కూడా వారు పనిచేసిన చోట కాకుండా ఇతరచోటికి పంపాలని అధికారులకు సూచించినట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ, ఉద్యాన, సెరీ కల్చర్, ఏఎన్‌ఎం తదితర పోస్టుల బదిలీలను ప్రస్తుతం చేయవద్దని ఆదేశించింది. ఈ నేపథ్యంలో మిగిలిన విభాగాలకు చెందిన వారిని త్వరలోనే బదిలీ చేసే అవకాశం ఉంది.

కౌన్సిలర్లు ససేమిరా.. కౌన్సిల్ వాయిదా

చైర్మన్ రాజీనామా చేయాలని పట్టుబడుతున్న సభ్యులు

చక్రం తిప్పుతున్న వైసీపీ ముఖ్యనేత



మార్కాపురం, ఆగస్టు 28: మార్కాపురం మున్సిపల్ చైర్మన్ పీఠం వ్యవహారంలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. వైసీపీ అధికారంలో ఉన్నన్నాళ్లు మిన్నకున్న కౌన్సిలర్లు నేడు చైర్మన్‌కు ఎదురుతిరుగుతున్నారు. అప్పట్లో తమకు కనీస మర్యాద కూడా ఇవ్వలేదనేది కౌన్సిలర్ల ఆవేదన. ఒప్పందం మేరకు రెండున్నర సంవత్సరాల తర్వాత రాజీనామా చేయాల్సివున్నా కుర్చీని పట్టుకువేలాడుతుండటాన్ని వార్డు కౌన్సిలర్లు సహించలేకపోతున్నారు. గత నెలలో సమావేశానికి మూకుమ్మడిగా డుమ్మా కొట్టారు. ఈ క్రమంలో ఈ నెల 28న కౌన్సిల్ సమావేశం జరపుదామని అజెండాను కౌన్సిలర్లందరికి చైర్మన్ పంపారు. తప్పకుండా హాజరుకావాలని వ్యక్తిగతంగా కోరారు. ఈ విషయమై బుధవారం మధ్యాహ్నం వరకు ప్రయత్నాలు జరిగాయి. అందరూ ససేమిరా అనడంతో సాయంత్రం 4.00 గంటలకు జరగాల్సిన సమావేశాన్ని ఈ నెల 30వ తేదీకి వాయిదా వేశారు. చైర్మన్, కౌన్సిలర్ల మధ్య జరుగుతున్న వ్యవహారం పట్టణంలో చర్చనీయాంశమైంది.

సమావేశానికి డుమ్మా కొడతాం..

జూలై నెలలో జరిగిన సమావేశానికి మున్సిపాలిటీలోని మొత్తం 35 మంది కౌన్సిలర్లకుగాను వైసీపీ కౌన్సిలర్లు 27 మంది గైర్హాజరయ్యారు. టీడీపీకి 5 మంది కౌన్సిలర్లు ఉన్నా గత నెలలో ఒక్కరు మాత్రమే హాజరయ్యారు. దీంతో పాలుపోని చైర్మన్ చిర్లంచర్ల కృష్ణ పలువురు కౌన్సిలర్లతో మాట్లాడారు. మీరు చేసుకున్న ఒప్పందం మేరకు రెండున్నర సంవత్సరాలకు రాజీనామా చేయాలి. సార్వత్రిక ఎన్నికల అనంతరం తప్పుకుంటానని పార్టీ పెద్దల దగ్గర చెప్పావు. అయినా రాజీనామా చేయలేదు కాబట్టే మేము సమావేశానికి రామని తెగేసి చెప్పారు. కొందరు కౌన్సిలర్లు కొంతమేర దిగివచ్చినా మిగిలిన వాళ్లు వారిపై ఒత్తిడి తెచ్చారు. ఈ క్రమంలో ఈ నెలకు సంబంధించి మున్సిపల్ సాధారణ సమావేశం ఈ నెల 28న నిర్వహించేందుకు మళ్లీ చైర్మన్ కృష్ణ ప్రయత్నించారు. అయినా ఫలించలేదు.

గుర్రుగా ఉన్న వైసీపీ ముఖ్యనేత

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీకి సంబంధించి అన్ని వ్యవహారాలను ముఖ్య ప్రజాప్రతినిధి సోదరుడు పర్యవేక్షించారు. చైర్మన్ పీఠాన్ని ఆశించిన ఇద్దరికీ చెరో రెండున్నర సంవత్సరాల చొప్పున ఒప్పందం అప్పట్లోనే చేశారు. అంతేకాక ప్రస్తుత చైర్మన్ కృష్ణకు పీఠం ఆశించిన 4వ వార్డు కౌన్సిలరు కనకదుర్గ నగదును కూడా సమకూర్చారు. పీఠం బదిలీ సమయంలో ఆ నగదును ఇచ్చే విధంగా ఒప్పంద పత్రాలు కూడా రాసుకున్నారు. సమయం దాటిపోయినా ప్రస్తుత చైర్మన్ తప్పుకోకపోవడంతో వైసీపీ ముఖ్యనేత సోదరుడు అతనిపై ఆగ్రహంతో ఉన్నాడు. ఈ విషయం ఇలావుంటే తానేకాక ఇద్దరు వైస్ చైర్మన్లు కూడా రాజీనామా చేయాలని ఒకానొక సమయంలో చైర్మన్ మెలిక పెట్టారు. పలుమార్లు ఈ విషయంపై చర్చలు కూడా జరిగాయి. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో వైసీపీ తరఫున మార్కాపురం నుంచి పోటీ చేసిన అన్నా రాంబాబు మాత్రం ఈ విషయంలో జోక్యం చేసుకోవడంలేదు. ఆ పదవి పంచాయతీ తనకు సంబంధంలేదని అప్పటి ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి వద్దే తేల్చుకోండని చైర్మన్, కౌన్సిలర్లకు సూచించారు. ఇలా వ్యవహారాన్ని అన్నిచోట్లకు తిప్పి పార్టీ పరువును బజారు కీడుస్తున్నారని చైర్మన్ కృష్ణపై మాజీ ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి గుర్రుగా ఉన్నారు. ఆయన ఆదేశాలతోనే ప్రస్తుతం కౌన్సిలర్లు మున్సిపల్ సమావేశాలకు డుమ్మా కొడుతున్నారని రాజకీయ వర్గాలు అంటున్నాయి.

పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.358

సంతనూతలపాడు, ఆగస్టు 28: పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు బోర్డు వేలం కేంద్రంలో బుధవారం పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.358 పలికింది. కూనంనేనివారిపాలెం నుంచి 1,372 పొగాకు బేళ్లు రాగా 1,089 బేళ్లు అమ్ముడయ్యాయి. 283 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు. కనిష్ఠ ధర రూ.204, సరాసరి ధర రూ.320.30 వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

మద్దిపాడు, ఆగస్టు 28 : మద్దిపాడు మండలం వెల్లంపల్లిలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళితే.. గుండ్లాపల్లిలోని ఘడియపూడికాలనీకి చెందిన బోడిపోగు బర్నబాస్ వివాహ వేడుకలకు బంధువులు వచ్చారు. వారిలో కొందరు వెల్లంపల్లికి ద్విచక్రవాహనంపై వచ్చి తిరిగి వెళుతుండగా లారీ ఢీకొంది. ఆ ప్రమాదంలో ఏసుదాసు, మరియదాసు, చరణ్, క్రాంతిలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ శివరామయ్య సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పామూరు దేవస్థాన మాన్యం భూమి పరిశీలన



భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ సయ్యద్‌హుసేన్

పామూరు, ఆగస్టు 28 : పామూరు మదనవేణుగోపాలస్వామి దేవస్థానానికి సంబంధించిన మాన్యం భూమి రికార్డులను నెల్లూరు జిల్లా వరికుంటపాడు తహసీల్దార్ సయ్యద్ హుసేన్ బుధవారం పరిశీలించారు. వరికుంటపాడు మండలం, వేంపాడు గ్రామ రెవెన్యూ ఇలాకలో సర్వేనెంబర్ 78/1 లో 6.06 ఎకరాల మాన్యం భూమి ఉందని, దీనిపై ప్రైవేట్ వ్యక్తులకు, దేవదాయ శాఖ అధికారులకు వివాదం నడుస్తోంది. వివాదం తేలే వరకు భూమిలోకి ఇరువర్గాలు వెళ్లకుండాస్టేటస్‌కో పాటించాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ప్రైవేట్ వ్యక్తులు కోర్టు తీర్పును ఉల్లంఘిస్తూ భూమిలోకి యంత్రాలతో ప్రవేశించి హెచ్చరిక బోర్డును తొలగించి చదును చేసి ఫెన్సింగ్ రాళ్లతో హద్దులు ఏర్పాటు చేశారు. ఈ విషయం వైరల్ కావడంతో తహసీల్దార్ ఆ భూమి తాలూకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద ఉన్న పత్రాలను పరిశీలించారు.

అనుమానాస్పద స్థితిలో ఇంటర్ విద్యార్థిని మృతి

కంభం (అర్థవీడు), ఆగస్టు 28 : అర్థవీడు మండలం రంగాపురం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. అర్థవీడు మండలం రంగాపురం గ్రామానికి చెందిన ఎం.లక్ష్మీ(17) రాచర్ల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆ బాలిక వద్ద 5 రోజుల క్రితం సెల్‌ఫోన్ ఉండటంతో ప్రిన్సిపాల్ ఇనుప స్కేల్‌తో కొట్టడంతోపాటు దూషించి ఇంటికి పంపారు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక ఆత్మహత్య చేసుకున్నట్లు బుధవారం సోషల్ మీడియాలో వైరలైంది. ఈ విషయం బయటకు రాకుండా ప్రిన్సిపాల్ సోదరుడు కనిగిరికి చెందిన ఓ వైసీపీ నాయకుడితో కలిసి బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడి సెటిల్‌మెంట్ చేసుకున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఆ బాలిక మరణించిన విషయం తెలిసినా స్కూలు నుంచి ఎవరూ వెళ్లకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈవిషయమై ప్రిన్సిపాల్ మాలకొండమ్మను వివరణ కోరేందుకు ఆంధ్రజ్యోతి ప్రయత్నించినా అందుబాటులోకి రాలేదు.

ఎన్‌ఆర్‌ఐ బుచ్చిబాబుకు అశ్రునివాళి



అంతిమయాత్రలో కుటుంబసభ్యులు, బంధువులు

ముండ్లమూరు, ఆగస్టు 28 : ముండ్లమూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు దద్దాల కోటేశ్వరరావు కుమారుడు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దద్దాల బుచ్చిబాబు ఈనెల 18వ తేదీ అమెరికాలో కుటుంబ సభ్యులతో కలసి ఈతకు వెళ్లి మృతి చెందారు. బుచ్చిబాబు మృతదేహం ముండ్లమూరుకు బుధవారం తెల్లవారు జామున చేరింది. దీంతో ఒక్కసారిగా కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆతనికి భార్య, ఐదేళ్ల కుమారుడు ఉన్నారు. ఉదయం 9 గంటల సమయంలో అంతిమయాత్ర నిర్వహించారు. మృత దేహానికి దర్శి టీడీపీ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి నివాళులర్పించి బుచ్చిబాబు సతీమణి కిరణ్మయిని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, గుంటుపల్లి రంగనాయకులు, మాజీ సర్పంచ్‌లు బేతపూడి బ్రహ్మేశ్వరరావు, మేదరమెట్ల వెంకటరావు, వీరపనేని నాగేశ్వరరావు, మేదరమెట్ల వెంకటేశ్వర్లు ఉన్నారు.

పోలీస్‌స్టేషన్లలో పనిచేయని ల్యాండ్‌ఫోన్లు

బకాయిల కారణంగా సర్వీసులు కట్ చేసిన బీఎస్ఎన్ఎల్

ఇబ్బంది పడుతున్న ప్రజలు

చీరాల, ఆగస్టు 28 : చీరాల డివిజన్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో ల్యాండ్ ఫోన్లు పనిచేయడంలేదు. టెలికాం డిపార్ట్‌మెంట్‌కు బకాయిలు చెల్లించకపోవడంతో ఫోన్ సర్వీస్‌లకు బీఎస్ఎన్ఎల్ నిలిపివేసినట్లు చెప్తున్నారు. దీంతో అవగాహన ఉన్నవారు 100కు డయల్‌చేసి తమ ఫిర్యాదులు చెప్తున్నారు. అత్యవసర పరిస్థితులయితే 100కు కాల్ చేసిన వారి వివరాలు, సంఘటన, ప్రదేశంతో సంబంధిత పోలీస్ స్టేషన్లుకు సమాచారం పంపుతున్నారు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బంది స్పందిస్తున్నారు. అంత వరకు బాగానే ఉంది. అయితే అసాంఘిక శక్తుల ఆగడాలు, గ్రామాల్లో జరిగే ఘర్షణలు, మత్తు పదార్థాలు సేవించిన నేపథ్యంలో జరిగే ఘర్షణలు తదితరాలకు సంబంధించి ముందస్తుగా పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసి ప్రాథమిక సమాచారం అందించేందుకు ప్రజలు పోలీస్ స్టేషన్‌కు ఉండే ల్యాండ్ లైన్ ఫోన్ నెంబర్లుకు ఎక్కువగా అలవాటుపడి ఉంటారు. అయితే గత కొంత కాలంగా పోలీస్ స్టేషన్ ల్యాండ్ లైన్లకు ఫోన్ చేస్తుంటే కవలడం లేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొందరు అసాంఘిక శక్తుల సమాచారం అందించేందుకు సెల్‌ఫోన్ కన్నా ల్యాండ్ లైన్ అయితే తమకు ఇబ్బంది లేకుండా ఉంటుందని భావిస్తున్నారు. సెల్ ఫోన్ ద్వారా ఆ స్టేషన్ హౌస్ ఆఫీసర్, రైటర్, కానిస్టేబుల్, హోమ్‌గార్డ్, స్పెషల్ బ్రాంచ్, ఇంటిలిజెన్స్ తదితర విభాగాల వారికి ఏదన్నా సమాచారం అందిస్తే తమ నెంబరు వారి సెల్‌ఫోన్లలో డిస్‌ప్లే అవుతుందని, దీంతో తమకేదన్నా ఇబ్బందులు ఎదురవుతుయని సందేహించి సమాచారం తెలిపేందుకు వెనకడుగు వేసే అవకాశం కూడా ఉంది. అది ఏ పోలీస్ స్టేషన్ అయినా ల్యాండ్ లైన్ నెంబరు ఎప్పుడు ఒకటే ఉంటుంది. అయితే డిపార్ట్‌మెంట్‌లో ఎస్సై, ఆపై స్థాయి అధికారుల నెంబర్లు ఎవరు బదిలీపై వచ్చినా ముందు పనిచేసిన అధికారి నంబరే వారికి ఉంటుంది. కాబట్టి పెద్ద సమస్యలేదు. అయితే అందరూ ఎస్సై, ఆ పై స్థాయి అధికారులకు ఫోన్ చేసేంత అవగాహన ఉండదు.

అందరూ అలా చేసినా వారికి ఉండే పనివత్తిడితో ఆ ఫోన్‌కాల్స్‌కు కొన్ని సందర్భాల్లో సమాధానం చెప్పే పరిస్థితి ఉండదు. ఇక కింద సిబ్బంది మారినపుడు వారి కొత్త నెంబర్లు సాధారణ పౌరులకు తెలిసే అవకాశం ఉండదు. అదే పక్కాగా ల్యాండ్ ఫోన్లు పనిచేస్తుంటే ఎప్పుడు ఒకే నెంబరు ఉంటుంది కాబట్టి తమ సమస్యలు తెలిపేందుకైనా, లేదా సమాచారం తెలిపేందుకైనా అనుకూలంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

యువకుడి ఆత్మహత్య

దర్శి, ఆగస్టు 28 : దర్శి పట్టణంలో యువకుడు బుధవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. పొదిలి మండలం ఈగలపాడు గ్రామానికి చెందిన వెన్నపూస కాశిరెడ్డి (20) పట్టణ సమీపంలోని తూర్పుగంగవరం రోడ్డులో టీ దుకాణంలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాశిరెడ్డితోపాటు ఫిరోజ్ అనే యువకుడితో కలిసి రూంలోఉంటున్నారు. కాశిరెడ్డికి బుధవారం సెలవు కావడంతో రూంలో ఉన్నాడు. ఫిరోజ్ తన పని ముగించుకొని సాయంత్రం రూంకు వచ్చే సరికి కాశిరెడ్డి ఉరివేసుకొని మృతిచెంది ఉన్నాడు. ప్రేమ విఫలమై దుర్మరణానికి పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఎస్ఐ ఎం.మురళి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్‌షాపుపై 6 ఏ కేసు

పామూరు, ఆగస్టు 28 : మండలంలోని తూర్పుకట్టకిందపల్లి రేషన్ షాపుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. డీలర్ నీరుకట్టు పద్మావతి చేత షాపు తాళాలు తీయించి రికార్డులను, రేషన్ సరుకులను పరిశీలించారు. రికార్డుల్లో ఉండాల్సిన 5 కింటాళ్ల 77 కేజీల బియ్యం, 69 ప్యాకెట్ల చక్కెర తక్కువగా ఉండటంతో డీలర్‌పై కేసు నమోదు చేసి షాపును సీజ్ చేశారు. ఈ దాడుల్లో ఏఎస్‌వో జె. రవి, వీఆర్వో షేక్ ఖాజారఫి పాల్గొన్నారు.

గుండెపోటుతో బ్యాంకు మేనేజర్ మృతి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 28: మార్కాపురం పట్టణంలోని ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్న తూంపాటి శ్రీనివాస్(56) గుండెపోటుతో మృతి చెందాడు. బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తున్న ఆయన తన విధుల్లో భాగంగా మంగళవారం విధులకు బ్యాంకుకు వచ్చారు. ఈ నేపథ్యంలో సాయంత్రం 5గంటల సమయంలో తన సీటులోనే కుప్పకూలారు. దీంతో బ్యాంకు సిబ్బంది వైద్యశాలకు తరలించారు. అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శ్రీనివాస్‌కు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బుధవారం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

పంగులూరు, ఆగస్టు 28 : రేణంగివరం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జంద్రాజుపల్లి మరియదాసు (38) మృతి చెందాడు. ఎస్ఐ వినోద్‌బాబు అందించిన సమాచారం మేరకు బల్లికురవ మండలం కొణిదెన గ్రామానికి చెందిన జంద్రాజుపల్లి మరియదాసు, నవీన్ బైకుపై ఒంగోలు వైపు నుంచి మార్టూరు వైపు వెళుతుండగా రేణంగివరం ఫ్లైఓవర్‌పై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మరియదాసుకు రెండు కాళ్లు విరిగి తీవ్రగాయాలు కాగా నవీన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్ఐ వినోద్ వారిని 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరియదాసు మృతి చెందగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

మండలంలోని జాగర్లమూడివారిపాలెం వద్ద మంగళవారం రాత్రి కారు ఢీకొని మోటార్‌సైక్లిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. ఇంకొల్లు మండలం నక్కలపాలెంకు చెందిన మద్దిరాల సురేష్ గుళ్లాపల్లి గ్రోత్ సెంటర్లో విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై వెళుతున్న సురేష్‌ను వెనుక వైపు నుంచి కారు ఢీకొట్టింది. దీంతో గాయపడిన సురేష్‌ను 108లో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ వినోద్‌బాబు కేసు నమోదు చేశారు.


మహిళలతో మాట్లాడుతున్న ఎన్ఆర్ఎల్ఎం టీమ్ సభ్యులు

మహిళాభివృద్ధి కోసం రుణాలు

తర్లుపాడు, ఆగస్టు 28: మహిళలు చిరు వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు మార్కాపురం క్లస్టర్ లీగల్ కోఆర్డినేటర్ కె.నాగభూషణం అన్నారు. మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలో చిరు వ్యాపారాలు చేసుకునేందుకు రుణాలు మంజూరు చేశారు. గతంలో రుణాలు తీసుకొని వ్యాపారాలు చేసుకుంటున్న మహిళలతో ఎన్ఆర్ఎల్ఎం టీమ్ సభ్యులు మాట్లాడారు. వ్యాపారం ఎలా జరుగుతుంది, ఆదాయం ఎంతమేర వస్తుందని వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం చిరు వ్యాపారాలు చేసుకోవడం వలన ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నామని, రుణాలు కూడా సక్రమంగా చెల్లిస్తున్నామని తెలిపారు. మండలంలో మహిళలు చిరు వ్యాపారాలు చేసుకునేందుకు ముందుకు వస్తే వారికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తామని వెలుగు ఏపీఎం డి.పిచ్చయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఎల్ఎం సభ్యులు జగదీష్, వెంకట్, కొనకనమిట్ల ఏపీఎం గోపాలకృష్ణారెడ్డి, గ్రామ సంఘ అధ్యక్షురాలు కరిస్మా, వీవోఏలు ఉమామహేశ్వరి, చంద్రకళ, లబ్ధిదారులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులు

వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల నిరసన

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 28: స్థానిక వాణిజ్య శాఖ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో ఉద్యోగులు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాజ్యాంగ వ్యతిరేకంగా, రాష్ట్రపతి ఉత్తర్వులకు భిన్నంగా జరిగిన ఉద్యోగుల బదిలీలను రద్దు చేయాలన్నారు. ఆ సిబ్బందిని వారి సొంత యూనిట్‌లకు బదిలీ చేయాలని,గత ఐదేళ్లలో వాణిజ్య పన్నుల శాఖలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు జరిపించాలని నినదించారు. ఉన్నతాధికారుల అవినీతిపై ఏసీబీ దర్యాప్తు చేపట్టాలన్నారు. అలాగే ప్రాంతీయ కార్యాలయాలను రద్దు చేయాలని, ఉద్యోగుల బదిలీలపై శాశ్వత విధానం రూపొందించాలని కోరారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు


ఉట్టి మండపంలో శ్రీకృష్ణుని అలంకారంలో రుక్మిణి, సత్యభామ సమేత చెన్నకేశవుడు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 28: శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నకేశవస్వామి శ్రీకృష్ణుని అవతారంలో రుక్మిణీసత్యభామ సమేతంగా ఆలయం నుంచి మంగళ వాయిద్యాల మధ్య బయలుదేరి ఎదురుగా ఉన్న ఉట్టి మండపంలో వేంచేశారు. ఆలయ ప్రధానార్చకులు శ్రీపతి అప్పనాచార్యులు చెన్నకేశవస్వామి, శ్రీదేవి భూదేవి సమేత ఉత్సవ మూర్తులను శ్రీకృష్ణుడు, రుక్మిణి సత్యభామలుగా అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం ఉట్టి మండపం వద్ద ఉట్టికొట్టే కార్యక్రమం చెన్నరాయునిపల్లె యాదవులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఉల్లాసం, ఉత్సాహ భరిత వాతావరణంలో జరిగిన కృష్ణాష్టమి వేడుకలను భక్తులు అధికసంఖ్యలో హాజరై జరుపుకున్నారు.


కంభం చెరువుకట్టకు వెళ్లే రోడ్డు కనిపించకుండా పెరిగిన పొదలు

చిల్లచెట్లను తొలగించాలి

కంభం, ఆగస్టు 28 :ఆసియా ఖండంలోనే అతిపెద్ద చెరువు కంభం చెరువును తిలకించేందుకు నిత్యం వందలాది మంది పర్యాటకులు వివిధ వాహనాల్లో వచ్చి వెళుతుంటారు. కంభం పట్టణం నుంచి 2కిలోమీటర్ల దూరం ఉండే తారు రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లు, పిచ్చిమొక్కలు పెరగడంతో రెండు వాహనాలు ఎదురెదురుగా వచ్చినపుడు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు కొమ్మల నుంచి దూరంగా రోడ్డు మధ్యలోకి వస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ కొమ్మలు రోడ్డు మార్జిన్లు దాటి ముందుకు వచ్చి వాహనదారులకు ఇబ్బందిగా మారాయి. చెరువుకట్ట పైకి వెళ్లడమే కాకుండా పొలాలకు రైతులు, కూలీలు వెళుతుంటారు. రెండు రోజుల క్రితం జరిగిన తేరాతేజీ పండుగకు చాలామంది ముస్లింలు రాగా ఈ చిల్లచెట్లతో ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా స్పందించి ఇరిగేషన్ అధికారులు, పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చిల్లచెట్లను తొలగించాలని కోరుతున్నారు.



మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం అధికారి శైలజ

రైతులకు శిక్షణ

కొనకనమిట్ల, ఆగస్టు 28 : మండలంలోని మునగపాడు, పెదారికట్ల గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాల్లో బుధవారం రైతులకు జిల్లా వనరుల కేంద్రం అధికారి శైలజ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమాలు జరిగాయి. రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. పరీక్షలను అనుసరించి ఎరువులను ఏమోతాదులో వాడాలో వివరించారు. ప్రకృతి వ్యవసాయం గురించి సిబ్బందికి, రైతులకు వివరించారు. అదేవిదంగా ప్రకృతి వ్యవసాయంలో పండించే పంటలకు వాడే జీవామృతాల గురించి వివరించారు. వయవ్యవసాయాధికారి ప్రసన్నరంగలక్ష్మి వ్యవసాయశాఖ ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాలను రైతులకు తెలియజేశారు. ఈకార్యక్రమంలో మునగపాడు, పెదారికట్ల వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

కౌన్సిలర్లు ససేమిరా.. కౌన్సిల్ వాయిదా

చైర్మన్ రాజీనామా చేయాలని పట్టుబడుతున్న సభ్యులు

చక్రం తిప్పుతున్న వైసీపీ ముఖ్యనేత



మార్కాపురం పురపాలకసంఘ కార్యాలయం

మార్కాపురం, ఆగస్టు 28: మున్సిపల్ చైర్మన్ పీఠం వ్యవహారంలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. వైసీపీ అధికారంలో ఉన్నన్నాళ్లు మిన్నకున్న కౌన్సిలర్లు నేడు చైర్మన్‌కు ఎదురుతిరుగుతున్నారు. అప్పట్లో తమకు కనీస మర్యాద కూడా ఇవ్వలేదనేది కౌన్సిలర్ల ఆవేదన. ఒప్పందం మేరకు రెండున్నర సంవత్సరాల తర్వాత రాజీనామా చేయాల్సివున్నా కుర్చీని పట్టుకువేలాడుతుండటాన్ని వార్డు కౌన్సిలర్లు సహించలేకపోతున్నారు. గత నెలలో సమావేశానికి మూకుమ్మడిగా డుమ్మా కొట్టారు. ఈ క్రమంలో ఈ నెల 28న కౌన్సిల్ సమావేశం జరపుదామని అజెండాను కౌన్సిలర్లందరికి చైర్మన్ పంపారు. తప్పకుండా హాజరుకావాలని వ్యక్తిగతంగా కోరారు. ఈ విషయమై బుధవారం మధ్యాహ్నం వరకు ప్రయత్నాలు జరిగాయి. అందరూ ససేమిరా అనడంతో సాయంత్రం 4.00 గంటలకు జరగాల్సిన సమావేశాన్ని ఈ నెల 30వ తేదీకి వాయిదా వేశారు. చైర్మన్, కౌన్సిలర్ల మధ్య జరుగుతున్న వ్యవహారం పట్టణంలో చర్చనీయాంశమైంది.

సమావేశానికి డుమ్మా

కొడతామంటున్న కౌన్సిలర్లు

జూలై నెలలో జరిగిన సమావేశానికి మున్సిపాలిటీలోని మొత్తం 35 మంది కౌన్సిలర్లకుగాను వైసీపీ కౌన్సిలర్లు 27 మంది గైర్హాజరయ్యారు. టీడీపీకి 5 మంది కౌన్సిలర్లు ఉన్నా గత నెలలో ఒక్కరు మాత్రమే హాజరయ్యారు. దీంతో పాలుపోని చైర్మన్ చిర్లంచర్ల కృష్ణ పలువురు కౌన్సిలర్లతో మాట్లాడారు. మీరు చేసుకున్న ఒప్పందం మేరకు రెండున్నర సంవత్సరాలకు రాజీనామా చేయాలి. సార్వత్రిక ఎన్నికల అనంతరం తప్పుకుంటానని పార్టీ పెద్దల దగ్గర చెప్పావు. అయినా రాజీనామా చేయలేదు కాబట్టే మేము సమావేశానికి రామని తెగేసి చెప్పారు. కొందరు కౌన్సిలర్లు కొంతమేర దిగివచ్చినా మిగిలిన వాళ్లు వారిపై ఒత్తిడి తెచ్చారు. ఈ క్రమంలో ఈ నెలకు సంబంధించి మున్సిపల్ సాధారణ సమావేశం ఈ నెల 28న నిర్వహించేందుకు మళ్లీ చైర్మన్ కృష్ణ ప్రయత్నించారు. అయినా ఫలించలేదు.

గుర్రుగా ఉన్న వైసీపీ ముఖ్యనేత

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీకి సంబంధించి అన్ని వ్యవహారాలను ముఖ్య ప్రజాప్రతినిధి సోదరుడు పర్యవేక్షించారు. చైర్మన్ పీఠాన్ని ఆశించిన ఇద్దరికీ చెరో రెండున్నర సంవత్సరాల చొప్పున ఒప్పందం అప్పట్లోనే చేశారు. అంతేకాక ప్రస్తుత చైర్మన్ కృష్ణకు పీఠం ఆశించిన 4వ వార్డు కౌన్సిలరు కనకదుర్గ నగదును కూడా సమకూర్చారు. పీఠం బదిలీ సమయంలో ఆ నగదును ఇచ్చే విధంగా ఒప్పంద పత్రాలు కూడా రాసుకున్నారు. సమయం దాటిపోయినా ప్రస్తుత చైర్మన్ తప్పుకోకపోవడంతో వైసీపీ ముఖ్యనేత సోదరుడు అతనిపై ఆగ్రహంతో ఉన్నాడు. ఈ విషయం ఇలావుంటే తానేకాక ఇద్దరు వైస్‌చైర్మన్లు కూడా రాజీనామా చేయాలని ఒకానొక సమయంలో చైర్మన్ మెలిక పెట్టారు. పలుమార్లు ఈ విషయంపై చర్చలు కూడా జరిగాయి. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో వైసీపీ తరఫున మార్కాపురం నుంచి పోటీ చేసిన అన్నా రాంబాబు మాత్రం ఈ విషయంలో జోక్యం చేసుకోవడంలేదు. ఆ పదవి పంచాయతీ తనకు సంబంధంలేదని అప్పటి ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి వద్దే తేల్చుకోండని చైర్మన్, కౌన్సిలర్లకు సూచించారు. ఇలా వ్యవహారాన్ని అన్నిచోట్లకు తిప్పి పార్టీ పరువును బజారుకీడుస్తున్నారని చైర్మన్ కృష్ణపై మాజీ ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి గుర్రుగా ఉన్నారు. ఆయన ఆదేశాలతోనే ప్రస్తుతం కౌన్సిలర్లు మున్సిపల్ సమావేశాలకు డుమ్మా కొడుతున్నారని రాజకీయ వర్గాలు అంటున్నాయి.

నేతల చుట్టూ సచివాలయ ఉద్యోగుల ప్రదక్షిణలు

సిఫార్సు లేఖల కోసం పోటీ

ప్రతి ఉద్యోగికి స్థానచలనం ఉండాలంటున్న ఎమ్మెల్యే

మార్కాపురం, ఆగస్టు 28: సచివాలయ ఉద్యోగుల బదిలీల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. పది రోజుల నుంచి సచివాలయ ఉద్యోగుల తాకిడితో కూటమి నాయకులు సతమతమవుతున్నారు. గ్రామస్థాయి, వార్డుస్థాయి నాయకుల వెంటబడుతున్నారు. ఆయా గ్రామాలు, వార్డులకు చెందిన వారైతే ఫర్వాలేదు ఇతర ప్రాంతాలకు చెందిన వాళ్లు కూడా తమకు పోస్టింగులు ఇప్పించాలని కోరుతున్నారు. వారి అభ్యర్థనను కాదనలేక రెండు రోజుల క్రితం వరకు ఉద్యోగులను ఎమ్మెల్యే నారాయణరెడ్డి వద్దకు వెంటబెట్టుకుని వెళ్లారు. నియోజకవర్గంలో సుమారు వందల సంఖ్యలో సచివాలయ ఉద్యోగులు ఉండటంతో వారిని ఏ విధంగా బదిలీ చేయాలో అర్థంకాక నాయకులు తలలు పట్టుకుంటున్నారు. మొదట్లో పనిచేసిన మండలం నుంచి ఇతర మండలాలకు వెళ్లాలని అందుకనుగుణంగా సిఫార్సు లేఖలు ఇచ్చారు. కొందరు పార్టీ నాయకులు అలా చేస్తే మనకు సంబంధించిన వాళ్లు ఇబ్బందులకు గురవుతారని అభ్యంతరం చెప్పారు. దీంతో కూటమి నాయకులు, అధికారులతో చర్చించిన అనంతరం మండల పరిధిలోనే బదిలీలు చేసినా ఒక్క ఉద్యోగి కూడా వారు పనిచేసిన చోట ఉండకూడదని ఎమ్మెల్యే నారాయణరెడ్డి వారికి షరతు విధించినట్లు తెలిసింది.

వైసీపీ నాయకులతో అంటకాగుతున్నారనే కఠిన నిర్ణయం

సచివాలయ వ్యవస్థను వైసీపీ ప్రభుత్వ తీసుకొచ్చింది. ఒక్కో సచివాలయంలో సుమారు 10 మందికిపైగానే ఉద్యోగులను నియమించింది. గత సార్వత్రిక ఎన్నికల వరకు వారంతా వైసీపీ నాయకులతో కలిసి పనిచేశారు. అంతేకాక వారికి ఉద్యోగాలు వచ్చింది వైసీపీ ప్రభుత్వంలోనే కావడంతో కొంతమేర ఆ పార్టీపై సానుకూలత ఉంది. సార్వత్రిక ఎన్నికల్లో కూడా మెజార్టీ సచివాలయ ఉద్యోగులు వైసీపీ మద్దతు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇప్పటికీ సచివాలయ ఉద్యోగులు వైసీపీ నాయకులకే ప్రాధాన్యత ఇస్తూ పనులు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని ఫిర్యాదులు ఇప్పటికే ఎమ్మెల్యే నారాయణరెడ్డికి అందాయి. ఈ నేపథ్యంలోనే సచివాలయ ఉద్యోగులను ఒక్కరిని కూడా వారు పనిచేసిన చోట కాకుండా ఇతరచోటికి పంపాలని అధికారులకు సూచించినట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ, ఉద్యాన, సెరీ కల్చర్, ఏఎన్ఎం తదితర పోస్టుల బదిలీలను ప్రస్తుతం చేయవద్దని ఆదేశించింది. ఈ నేపథ్యంలో మిగిలిన విభాగాలకు చెందిన వారిని త్వరలోనే బదిలీ చేసే అవకాశం ఉంది.

పంటలను ఈక్రాప్ చేయించుకోవాలి


రైతులు సాగుచేసిన పంటను ఈక్రాప్ చేయిస్తున్న తహసీల్దార్, ఏడీఏ, ఏవో

మార్కాపురం రూరల్, ఆగస్టు 28: రైతులు సాగుచేసిన ప్రతి పంటను తప్పనిసరిగా ఈ-క్రాప్ చేయించుకోవాలని తహసీల్దార్ చిరంజీవి సూచించారు. మండలంలోని కోలభీమునిపాడు, రామచంద్రాపురం, బిరుదులనరవ గ్రామాలో రైతులు సాగు చేస్తున్న పంటలను వ్యవసాయశాఖ ఏడీఏ బాలాజీ నాయక్, లక్ష్మీనారాయణతో కలిసి తహసీల్దార్ బుధవారం పరిశీలించారు. ఆయా గ్రామాలలోని రైతులతో వారు సాగు చేసిన పంటలను రైతు సేవ కేంద్రాల సిబ్బందితో కలిసి ఈ-క్రాప్ నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవ కేంద్రాల సిబ్బంది సంధ్య, ఖైరున్‌బీ, శివశంకర్ నాయక్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పంట నమోదు

ఎర్రగొండపాలెం : మండలంలో పంటలు సాగు చేసిన ప్రతిరైతు పొలం వద్దకు గ్రామాల్లో ఉండే వీఏఏ,వీహెచ్ఏ, వీఆర్వోలు వెళ్లి ఈ పంట యాప్ ద్వారా పంటలు నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారి శేషారెడ్డి అన్నారు. మండలంలోని మొగుళ్ళపల్లి, వీరభద్రాపురం, వాదంపల్లి గ్రామాల్లో బుధవారం పంటల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈ వో మాల్యాద్రిరెడ్డి, వీఏఏలు వివేక్, జాషువా, రమేష్, సర్వేయరు రాజు నాయక్, రైతులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న కంభం వ్యవసాయాధికారిణి స్వరూప

బేస్తవారపేటలో

బేస్తవారపేట : రైతులు సాగు చేసిన పంటలను తప్పని సరిగా నమోదు చేయించుకోవాలని ఉద్యానశాఖాధికారి డి.శ్వేత అన్నారు. బుధవారం మండలంలోని ఒందుట్ల గ్రామంలో నిర్వహించిన పంట నమోదు కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి బత్తాయి,మామిడి పంటలను నమోదు చేయించారు.కౌలు రైతులు కార్డులు కలిగిన వారు కూడా వారి పేర్ల మీద నమోదు చేయించుకోవాలని సూచించారు. పండ్ల తోటలకు అనేక రకాల సబ్సిడీలు ప్రభుత్వం అందజేస్తుందని, వాటిని రైతులు ఉపయోగించుకోవాలని సూచించారు.

పంట నమోదు తప్పనిసరి

కంభం : మండలంలోని నర్సిరెడ్డిపల్లి, పెద్దనల్లకాల్వ, పోరుమామిళ్ళపల్లి, చిన్న కంభం గ్రామాలలో వ్యవసాయాధికారిణి స్వరూప పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రధానంగా నువ్వులు, కొర్ర పంట కోతదశలో ఉన్నందున రైతులందరూ రెండు రోజుల్లోగా పంట నమోదు వివరాలను వ్యవసాయ గ్రామసహాయకులకు అందచేయాలని తెలిపారు. నర్సిరెడ్డిపల్లెలో పత్తి 20 ఎకరాలు, పొగాకు 15 , వరి 25 , కంది 25 , కొర్ర 165 , సజ్జ 45 , పెసర 20 ఎకరాల్లో సాగు చేసినట్లు తెలిపారు. సెప్టెంబరు 15లోగా ఈపంట నమోదు చేసుకోవాలని తెలిపారు.


ఒందుట్లలో పంట నమోదు చేస్తున్న ఉద్యానశాఖాధికారి

సైబర్ నేరాలపై అవగాహన కలిగిఉండాలి


ప్రజలకు అవగాహన కలిగిస్తున్న పోలీసులు

కంభం, ఆగస్టు 28 : సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు, యువత అవగాహన కలిగి ఉండాలని కంభం మండల ఎస్సై నరసింహారావు తెలిపారు. బుధవారం యర్రబాలెం, లింగాపురం గ్రామప్రజలతో మాట్లాడుతూ బ్యాంక్ వివరాలు అపరిచిత వ్యక్తులతో పంచుకోవద్దని సూచించారు. ఫోన్‌లో ఓటీపీ వచ్చిందని ఎవరు అడిగినా చెప్పవద్దన్నారు. కేవైసీ అప్‌డేట్ చేయాలని వచ్చే మెసేజ్‌లకు గాని, వాయిస్‌లకు గాను బదులు చెప్పవద్దన్నారు. ఈకార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గోవులకు దాణా అందజేత

గిద్దలూరు, ఆగస్టు 28 : గిద్దలూరు మార్కెట్‌యార్డు ఆవరణలో ఉన్న 90 ఆవులకు వాసవి వాకర్స్ బ్యాచ్ ఆధ్వర్యంలో దాణా సమకూర్చారు. తవుడు బస్తాలతోపాటు గోసంరక్షణకు అవసరమైన ఇతర ఖర్చుల కోసం మొత్తం 11వేల రూపాయలను అందజేశారు. ఈకార్యక్రమంలో వాకర్స్ బ్యాచ్ అధ్యక్షులు బాదం సుధాకర్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కందగట్ల రమణ, గర్రె పుల్లయ్య, కొప్పరపు సుధాకర్, సూరె నాగేశ్వరరావు, ఆరవీటి చంద్రశేఖర్, పోస్టుమాస్టర్ గాదంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛన్ పథకాన్ని పునరుద్ధరించాలి

గిద్దలూరు, ఆగస్టు 28 : ఉద్యోగులను మోసగించడానికే కేంద్ర ప్రభుత్వం యునైటెడ్ పింఛన్ స్కీంను ప్రవేశపెట్టిందని ఏపీటీఎఫ్ నాయకులు ఒక ప్రకటనలో విమర్శించారు. పాత పింఛన్ స్కీంను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.తాము పాత పింఛన్ స్కీం తప్ప మరే ఇతర స్కీంను ఒప్పుకోమని తేల్చిచెప్పారు. వైఖరి మార్చుకోకపోతే దేశవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతామని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వై.శ్రీనివాసులు, జిల్లా అదనపు కార్యదర్శి కబీర్, గిద్దలూరు, కొమరోలు మండలాల ఏపీటీఎఫ్ అధ్యక్షులు దేవసహాయం, పిచ్చయ్య ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.

సభ్యత్వ నమోదు చేపట్టాలి

గిద్దలూరు, ఆగస్టు 28 : సెప్టెంబరు 2వ తేదీ నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టాలని ఆపార్టీ నాయకులు నిర్ణయించారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆపార్టీ పట్టణశాఖ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు బీవీ రామాంజనేయులు, బీజేవైఎం అధ్యక్షులు ఆలపాటి సాయిచరణ్, నాయకులు చక్రం, మారుతీ ప్రసాద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దోర్నాలలో..

పెద్ద దోర్నాల : 2వ తేదీ నుంచి సభ్యత్వ నమోదు చేపట్టాలని బీజేపీ మండల అధ్యక్షులు గండి వీరారెడ్డి అన్నారు.స్థానిక శివ సదన్‌లో మండల కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. స్టేట్ కౌన్సిల్ సభ్యులు మల్లారెడ్డి, మైనార్టీ మోర్చా కౌన్సిల్ సభ్యులు సయ్యద్ బాష, కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు అల్లారెడ్డి, రామలక్ష్మీరెడ్డి గాలెయ్య, అంకన్న పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థికి సన్మానం

గిద్దలూరు, ఆగస్టు 28 : రాచర్ల మండలం జేపీ చెరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన బొర్రా సంతోష్ అనే విద్యార్థిని చిన్ని సేవా సంస్థ సన్మానించింది. అధ్యక్షులు శ్రీకాంత్, హెచ్ఎం భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తహసీల్దార్ భాగ్యలక్ష్మి బాధ్యతల స్వీకరణ


తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న టీడీపీ నాయకులు

కొమరోలు, ఆగస్టు28: కొమరోలు నూతన తహసీల్దార్‌గా డి. భాగ్యలక్ష్మి బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆమె మార్కాపురం ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ ప్రమోషన్‌పై కొమరోలు కు వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్న మల్లికార్జున నాయుడు ఇక్కడే డిప్యూటీ తహసీల్దార్‌గా కొనసాగనున్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన భాగ్యలక్ష్మిని స్థానిక టీడీపీ మండల నాయకులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు ముత్తముల సంజీవరెడ్డి, నాయకులు చలిచీమల శ్రీనివాసచౌదరి, తిరుమలరెడ్డి, విజయకుమార్‌రెడ్డి, సుభానీలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి


అవగాహన సదస్సులో ఏపీఎం పోలయ్య

పెద్ద దోర్నాల, ఆగస్టు 28: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఏపీఎం పోలయ్య అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో రైతులకు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు, రహదారుల వెంట, రైతుల పొలాల గట్లపై పండ్ల మొక్కలు నాటడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించుకోవడంతో పాటు ఫలసాయం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో జవహర్ లాల్ నాయక్, టీడీపీ నాయకులు దొడ్డా శేషాద్రి, చంటి, షేక్ మంజూర్ బాష, ఏర్వ మల్లికార్జునరెడ్డి, బట్టు సుధాకర్‌రెడ్డి, వెంగళరెడ్డి, తాతిరెడ్డి, కె. దానం, ఆర్. కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో బ్యాంకు మేనేజర్ మృతి


శ్రీనివాస్ (ఫైల్)

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 28: పట్టణంలోని ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్న తూంపాటి శ్రీనివాస్(56) గుండెపోటుతో మృతి చెందాడు. బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తున్న ఆయన తన విధుల్లో భాగంగా మంగళవారం విధులకు బ్యాంకుకు వచ్చారు. ఈ నేపథ్యంలో సాయంత్రం 5గంటల సమయంలో తన సీటులోనే కుప్పకూలారు. ఈమేరకు సీసీ టీవీల్లో కూడా రికార్డయింది. మేనేజర్ సీటులోనే పడిపోయిన విషయం గమనించి బ్యాంకు సిబ్బంది వైద్యశాలకు తరలించారు. అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శ్రీనివాస్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బుధవారం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు బ్యాంకు ఉద్యోగులు శ్రీనివాస్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

హక్కుల కోసం నిరంతర పోరాటం

ఎర్రగొండపాలెం, ఆగస్టు 28 : హక్కుల సాధన కోసం వికలాంగులు నిరంతరం పోరాటం కొనసాగించాలని వికలాంగుల హక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షులు గుమ్మా రాజయ్య పిలుపు నిచ్చారు. ఎర్రగొండపాలెంలో బుధవారం వీహెచ్‌పీఎస్ 18 వ ఆవిర్భావ వేడుకల సందర్భంగా జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. వికలాంగులందరూ ఐకమత్యంతో పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి నియోజకవర్గ అధ్యక్షులు పి. పెద్ద పాలంకయ్య అధ్యక్షత వహించగా కార్యదర్శి కె. కోటేశ్వరరావు, మండల కమిటీ అధ్యక్షులు కొత్తపల్లి కిషోర్, వీహెచ్‌పీఎస్ నాయకులు ఆవుల శ్రీను, నాసర్‌వలి, హుస్సేన్, నాసర్‌వలిమస్తాన్ బాబు పాల్గొన్నారు.

సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలి

● ట్రాన్స్‌కో సీఎండీ రవిపాటిల్ శెట్టి


సిబ్బందికి సూచనలిస్తున్న సీఎండీ రవిపాటిల్‌శెట్టి

పెద్దారవీడు, ఆగస్టు 28: సౌర విద్యుత్‌పై ప్రజల్లో అవగాహన పెంచి వినియోగించేలా చర్యలు చేపట్టాలని ట్రాన్స్‌కో సీఎండీ రవిపాటిల్ శెట్టి అన్నారు. పెద్దారవీడు మండలంలోని సానికవరం సబ్‌స్టేషన్‌ను బుధవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. సబ్ స్టేషన్‌లో విద్యుత్ సరఫరాకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. లైన్‌మెన్లు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సౌర విద్యుత్ వినియోగాన్ని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సత్యనారాయణ, ఈఈ నాగేశ్వరరావు, ఏఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐని సన్మానించిన టీడీపీ నాయకులు


ఎస్ఐను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

బేస్తవారపేట,ఆగస్టు28: మండల ఎస్ఐగా రవీంద్రారెడ్డిని టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. బాపట్ల జిల్లా నుంచి నూతనంగా బదిలీపై వచ్చిన ఎస్ఐని మండల టీడీపీ నాయకులు కలిసి సన్మానించి మండల పరిస్థితులు వివరించారు. ఈకార్యక్రమంలో నాయకులు బీసు అరుణ్ కుమార్, యాలం వెంకటేశ్వర్లు, మూస్పూరి రాము, సి.హెచ్.సుబ్రమణ్యం, ఆకుల కొండలు తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటాలు అందజేత


ఆర్టీసీ డీఎంకు చిత్రపటాలు అందజేస్తున్న జనసేన ప్రతినిధులు

గిద్దలూరు, ఆగస్టు 28 : గిద్దలూరు ఆర్టీసీ డిపో మేనేజర్ చంద్రశేఖర్‌కు జనసేన పార్టీ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చిత్రపటాలను అందజేశారు.

2న రక్తదాన శిబిరం

గిద్దలూరు, ఆగస్టు 28 : రాచర్లలోని స్పందన పాఠశాల ఆవరణలో సెప్టెంబరు 2వ తేదీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు రాచర్ల మండల జనసేన పార్టీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని జనసైనికులందరూ ఈకార్యక్రమానికి హాజరు కావాలని, రక్తదాతలు హాజరై మరొకరికి ప్రాణం పోయాలని విజ్ఞప్తి చేశారు.

సేవారత్న అవార్డు

అమ్మ ఫౌండేషన్ కోశాధికారి సుధాకర్‌యాదవ్‌కు మదర్ థెరిస్సా సేవారత్న జాతీయ అవార్డు లభించింది. విజయవాడలోని మదర్ సర్వీస్ సొసైటీ సేవా సంస్థ కార్యక్రమంలో సేవారత్న అవార్డును బహూకరించారు.

మున్సిపల్ సమావేశం వాయిదా

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 28: మార్కాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఈనెల 30వ తేదీకి వాయిదా పడినట్లు కమిషనర్ కిరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం జరగవల్సిన కౌన్సిల్ సమావేశం అనివార్యకారణలతో వాయిదా పడిందని, ఈనెల 30న సాయంత్రం 4గంటలకు కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

ఇస్కాన్ సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి ఆగస్టు 28 : ఇస్కాన్ సభ్యులు ప్రజలకు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థులకు మానవతాసంస్థ, ఇస్కాన్ ఇంటర్నేషనల్ మెంబర్ గుత్తి శ్రీధర్ ద్వారా రీడింగ్ చైర్స్, ప్యాడ్స్, వాటర్ కూలింగ్ సిస్టంను బుధవారం ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన వసతులను త్వరితిగతిన పూర్తిచేస్తామన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల కంటే దాతలు అందించే సహకారం ఎంతో గొప్పదని చెప్పారు. పేద వర్గాలకు చెందిన వారికి ఇస్కాన్ అందిస్తున్న చేయూత ప్రతి ఒక్కరికీ ఆదర్శం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ సభ్యులు, మున్సిపల్ చైర్మన్ గఫార్, సంస్థ అధ్యక్షులు తాని గుండాల శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి పిచ్చిరెడ్డి, వాగిచర్ల వెంకటేశ్వర్లు, పచ్చవ శేఖర్, చమిడిశెట్టి(బొట్టు) శ్రీను, ఉమాకాంత్, వంశీకృష్ణ, బొగ్గరపు శ్రీనివాస్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులకు రీడింగ్ చైర్స్, ప్యాడ్‌లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయం కావాలి

పచ్చికబైళ్ళ దువా కార్యక్రమంలో చైర్మన్ గఫార్

కనిగిరి ఆగస్టు 28 : మహ్మద్ ప్రవక్త బోధనలు ప్రతి ఒక్కరూ అనుసరించాలని మున్సిపల్ చైర్మన్ గఫార్ చెప్పారు. గరికతొక్కుడు(పచ్చికబయళ్ల దువా) కార్యక్రమంలో భాగంగా బుధవారం కనిగిరి దుర్గం కొండ దిగువన ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



గాయపడిన వ్యక్తికి వైద్యం చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

దర్శి, ఆగస్టు 28 : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, రోగులకు మెరుగైన వైద్యం అందించాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ చెప్పారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లతో సమస్యల గూర్చి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల వలన ప్రజలకు సీజనల్ వ్యాధులు సోకుతున్నాయన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 24 గంటలు వైద్య సదుపాయం అందుబాటులో ఉండేవిధంగా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సుమన్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



డాక్టర్లతో మాట్లాడుతున్న దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

క్షతగాత్రునికి వైద్యం చేసిన గొట్టిపాటి లక్ష్మీ

మండలంలోని పోతవరం వెళ్లే మార్గంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి రక్తమోడుతున్న పి.చెన్నకేశవులకు టీడీపీ ఇన్‌చార్జి లక్ష్మీ గురువారం వైద్య సహాయం అందించారు. ఆమె ఒక శుభకార్యానికి పోతవరం వెళ్తుండగా చెన్నకేశవులు రోడ్డు ప్రమాదానికి గురై రక్తగాయాలతో రోడ్డుపై పడి ఉన్నారు. అదే సమయంలో వెళ్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ క్షతగాత్రుడిని చూసి హుటాహుటిన దిగి వైద్య సేవలందించారు. మెరుగైన వైద్యం కోసం ఆర్థిక సహాయం చేశారు. మొన్నటి ఎన్నికల సమయంలో ప్రసవనొప్పులతో బాధపడుతున్న మహిళకు ఆపరేషన్ చేసి తల్లిబిడ్డను సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం రాజకీయాలతో సంబంధం లేకుండా క్షతగాత్రులను రక్షించాలనే లక్ష్యంతో ప్రయాణం మధ్యలో ఆగి వైద్య సేవలందించటం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య



కాశిరెడ్డి(ఫైల్)

దర్శి, ఆగస్టు 28 : దర్శి పట్టణంలో యువకుడు బుధవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. పొదిలి మండలం ఈగలపాడు గ్రామానికి చెందిన వెన్నపూస కాశిరెడ్డి (20) పట్టణ సమీపంలోని తూర్పుగంగవరం రోడ్డులో టీ దుకాణంలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాశిరెడ్డితోపాటు ఫిరోజ్ అనే యువకుడితో కలిసి రూంలోఉంటున్నారు. కాశిరెడ్డికి బుధవారం సెలవు కావడంతో రూంలో ఉన్నాడు. ఫిరోజ్ తన పని ముగించుకొని సాయంత్రం రూంకు వచ్చే సరికి కాశిరెడ్డి ఉరివేసుకొని మృతిచెంది ఉన్నాడు. ప్రేమ విఫలమై దుర్మరణానికి పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఎస్ఐ ఎం.మురళి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తూర్పుకట్టకిందపల్లి రేషన్ డీలర్‌పై 6 ఏ కేసు



రేషన్ సరుకులను పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

పామూరు, ఆగస్టు 28 : మండలంలోని తూర్పుకట్టకిందపల్లి రేషన్ షాపుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. డీలర్ నీరుకట్టు పద్మావతి చేత షాపు తాళాలు తీయించి రికార్డులను, రేషన్ సరుకులను పరిశీలించారు. రికార్డుల్లో ఉండాల్సిన 5 కింటాళ్ల 77 కేజీల బియ్యం, 69 ప్యాకెట్ల చక్కెర తక్కువగా ఉండటంతో డీలర్‌పై కేసు నమోదు చేసి షాపును సీజ్ చేశారు. ఈ దాడుల్లో ఏఎస్‌వో జె. రవి, వీఆర్వోవో షేక్ ఖాజారఫీ పాల్గొన్నారు.

సీఐను కలిసి అభినందిస్తున్న జనసేన నాయకులు

పామూరు, ఆగస్టు 28 : పామూరు నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న భీమానాయక్‌ను జనసేన శ్రేణులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందించారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని జిల్లా కార్యదర్శి వై రహీముల్లా కోరారు. నేతలు దరిశి ఏడుకొండలు, ఎన్ నరశింహారావు, జి. వెంకటేష్, బి. అనిల్‌రసూల్, నక్కసాయి, డి. రమేష్ పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ బుచ్చిబాబుకు అశ్రునివాళి

మృతుని భార్యను పరామర్శించిన టీడీపీ ఇన్‌చార్జి లక్ష్మీ



బుచ్చిబాబు అంతిమయాత్రలో కుటుంబసభ్యులు, బంధువులు

ముండ్లమూరు, ఆగస్టు 28 : ముండ్లమూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు దద్దాల కోటేశ్వరరావు కుమారుడు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దద్దాల బుచ్చిబాబు ఈనెల 18వ తేదీ అమెరికాలో కుటుంబ సభ్యులతో కలసి ఈతకు వెళ్లి మృతి చెందారు. బుచ్చిబాబు మృతదేహం ముండ్లమూరుకు బుధవారం తెల్లవారు జామున చేరింది. దీంతో ఒక్కసారిగా కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. అతనికి భార్య, ఐదేళ్ల కుమారుడు ఉన్నారు. ఉదయం 9 గంటల సమయంలో అంతిమయాత్ర నిర్వహించారు. మృత దేహానికి దర్శి టీడీపీ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి నివాళులర్పించి బుచ్చిబాబు సతీమణి కిరణ్మయిని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, గుంటుపల్లి రంగ నాయకులు, మాజీ సర్పంచ్‌లు బేతపూడి బ్రహ్మేశ్వరరావు, మేదరమెట్ల వెంకటరావు, వీరపనేని నాగేశ్వరరావు, మేదరమెట్ల వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఎయిడెడ్ స్కూల్స్ కమిటీ నూతన కార్యవర్గం

దర్శి, ఆగస్టు 28 : నియోజకవర్గ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారు ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ కోటిరెడ్డి, అధ్యక్షుడిగా రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా రాజకేశవరెడ్డి, కోశాధికారిగా ఎం రామిరెడ్డి, ఈసీ సభ్యులుగా కేవీ రత్నాచారి, వై శ్రీనివాసరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బెట్టకు వచ్చిన పైర్లను కాపాడుకోవాలి

దర్శి, ఆగస్టు 28 : బెట్టకు వచ్చిన పైర్లను కాపాడుకునేందుకు రైతులు జాగ్రత్తలను తీసుకోవాలని వ్యవసాయాధికారి బాలకృష్ణానాయక్ సూచించారు. మండలంలోని చందలూరు, బసిరెడ్డిపల్లి, బండివెలిగండ్ల గ్రామాల్లో సాగు చేసిన కంది, పత్తి పైర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నిబద్ధతతో సేవలు అందించిన ఆంజనేయులు

తాళ్లూరు, ఆగస్టు 28 : పోలీస్‌శాఖలో నీతి, నిజాయితీతో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన సూళ్లూరుపేట ఎస్సై సోమా అంజనేయులను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చెప్పారు. తూర్పుగంగవరం గ్రామవాసి సూళ్లూరుపేట ఎస్సైగా పని చేస్తూ గత నెలలో ఉద్యోగ విరమణ చేయటంతో బుధవారం గ్రామంలో సన్మానించారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, టీడీపీ మండ అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, నాయకులు శాగం కొండారెడ్డి, మానం రమేష్‌బాబు, వల్లభనేని సుబ్బయ్య, మేడగం వెంకటేశ్వరరెడ్డి, షేక్ కాలేషావలి, మీరామొహిద్దీన్, రామలక్ష్మయ్య, పోలంరెడ్డి రమణారెడ్డి, ఆంజనేయులు సోదరులు సోమా సుబ్బారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

బ్యారన్‌ల రిజిస్ట్రేషన్ ప్రారంభం

కొండపి, ఆగస్టు 28 : పొగాకు బ్యారన్‌ల రిజిస్ట్రేషన్ స్థానిక వేలం కేంద్రంలో బుధవారం నుంచి ప్రారంభమైంది. తొలిరోజు తొమ్మిది బ్యారన్‌లను రిజిస్ట్రేషన్ చేశారు. వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పామూరు దేవస్థాన మాన్యం భూమి పరిశీలన

పామూరు, ఆగస్టు 28 : పామూరు మదనవేణుగోపాలస్వామి దేవస్థానానికి సంబంధించిన మాన్యం భూమి రికార్డులను నెల్లూరు జిల్లా వరికుంటపాడు తహసీల్దార్ సయ్యద్ హుసేన్ బుధవారం పరిశీలించారు. వరికుంటపాడు మండలం, వేంపాడు గ్రామ రెవెన్యూ ఇలాకలో సర్వేనెంబర్ 78/1 లో 6.06 ఎకరాల మాన్యం భూమి ఉందని, దీనిపై ప్రైవేట్ వ్యక్తులకు, దేవదాయ శాఖ అధికారులకు వివాదం నడుస్తోంది. వివాదం తేలే వరకు భూమిలోకి ఇరువర్గాలు వెళ్లకుండా స్టేటస్‌కో పాటించాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ప్రైవేట్ వ్యక్తులు కోర్టు తీర్పును ఉల్లంఘిస్తూ భూమిలోకి యంత్రాలతో ప్రవేశించి హెచ్చరిక బోర్డును తొలగించి చదును చేసి ఫెన్సింగ్ రాళ్లతో హద్దులు ఏర్పాటు చేశారు. ఈ విషయం వైరల్ కావడంతో తహసీల్దార్ ఆ భూమి తాలూకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద ఉన్న పత్రాలను పరిశీలించారు.



భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ సయ్యద్ హుసేన్

కొమ్మవరంలో వైభవంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



ముండ్లమూరు : పూజలు నిర్వహిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ



పామూరు : ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నిర్వాహకులు

ముండ్లమూరు, ఆగస్టు 28 : మండలంలోని కొమ్మవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. దాదాపు రూ.50 లక్షల వ్యయంతో స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అర్చకులు ముందుగా ఆకు పూజ, కుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.



కురిచేడు : మఠంలో యజ్ఞం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఈ కార్యక్రమంలో అంబాల శేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాసులు, పరుచూరి సుబ్బారావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అభయ ఆంజనేయస్వామి ఆలయానికి భూమిపూజ

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 28 : మండలంలోని రెడ్డిగారిపల్లె గ్రామంలో శ్రీ అభయాంజనేయస్వామి నూతన దేవస్థాన నిర్మాణానికి రుత్వికుల వేదమంత్రాల నడుమ బుధవారం భూమి పూజ చేశారు. రుత్వికులు చివట కార్తీక్‌శర్మ వేద మంత్రాలతో పలు పూజలు చేశారు.

యోగయ్య స్వామి ఆలయంలో పొంగళ్లు

కురిచేడు, ఆగస్టు 28 : కురిచేడులోని యోగయ్య స్వామి మఠంలోకి బుధవారం స్వామి చిత్రపటాన్ని భక్తులు కోలాహలంగా తీసుకు వచ్చారు. గతంలో ఉన్న మఠం మరమ్మతులకు గురికావడంతో దానిని పునఃనిర్మాణం చేపట్టారు. రుత్విక్కుల సూచనలతో బుధవారం గ్రామస్థులు మేళతాళాలతో సాయిబాబా ఆలయం నుంచి స్వామి చిత్రపటాన్ని మఠంలోకి తీసుకు వచ్చారు. వేద మంత్రోచ్చారణలతో మఠంలో యజ్ఞం నిర్వహించారు. అనంతరం మహిళలు పొంగళ్ళు పెట్టి స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో రుత్విక్కులు విశ్వనాథ శాస్త్రి, వెంకట సుబ్బయ్య శాస్త్రి, ఆలయ కమిటీకి చెందిన గుంటక నాసర రెడ్డి పాల్గొన్నారు.

నేడు, రేపు ఒంగోలులో రాష్ట్రస్థాయి సమావేశాలు

- **వ్యవసాయ కార్మిక సంఘం ప్రధానకార్యదర్శి వెంకటేశ్వర్లు**



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 28 : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి విస్తృతస్థాయి సమావేశాలు గురు, శుక్రవారాల్లో ఒంగోలులోని కాపు కళ్యాణ మండపంలో జరుగుతాయని సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.వెంకటేశ్వర్లు వెల్లడించారు. స్థానిక సుందరయ్యభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ రాష్ట్ర మహాసభల్లో ఉద్యమాలపై సమీక్ష చేయడంతో పాటు భవిష్యత్ పోరాటాల కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 200 మందికి పైగా ప్రతినిధులు హాజరవుతారని, జాతీయ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎ.విజయరాఘవన్, బి.వెంకట్ ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని ఆయన తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘాన్ని 1934లో అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య స్వగ్రామమైన అలగానిపాడులో స్థాపించారన్నారు. దున్నేవారికి భూమి దక్కాలని, కనీస వేతన చట్టం, ఆహార భద్రత, సామాజికన్యాయం తదితర అంశాలపై సంఘం అనేక ఉద్యమాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులన్ని కార్పొరేట్లకు తాకట్టుపెట్టే విధానాలను ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయని ఆరోపించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం పలు అంశాలపై చరిస్తామని పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, నెరుసుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వాణిజ్యపన్నులశాఖలో బదిలీలను వాయిదా వేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 28: వాణిజ్య పన్నుల శాఖలో ఉద్యోగుల బదిలీలను ప్రభుత్వం వాయిదా వేయాలని ఆశాఖ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు జాజుల నరసింగరావు కోరారు. ఒంగోలు నగరం దారావారితోటలోని వాణిజ్యపన్నులశాఖ సముదాయం భవనం వద్ద బుధవారం మధ్యాహ్నం భోజన విరామన సమయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో శాఖలో 2.0 ఆర్గనైజేషన్ పేరుతో రాజ్యాంగ వ్యతిరేకంగా రాష్ట్రపతి ఉత్తర్వులకు భిన్నంగా ఉద్యోగుల బదిలీలు జరిగాయన్నారు. వాటిని రద్దు చేస్తూ వారి సొంత యూనిట్ ఆఫ్ అపాయింట్ స్థానాలకు బదిలీచేసి మరలా సర్కిల్ వ్యవస్థను పరిపుష్టత తీసుకు రావాలని కోరారు. జీఎస్టీవోలకు వర్క్ ఫంక్షన్ ఏర్పాటు చేయాలని, రీజినల్ ఆఫీసును రద్దు చేయాలన్నారు. గత ప్రభుత్వంలో పలువురు ఉన్నతాధికారులు పన్ను ఎగవేతదారులకు సహకరించినందున ప్రభుత్వ ఖజానాకు తీరని నష్టం జరిగిందని ఆరోపించారు. గత బలవంతపు బదిలీలను సరిదిద్దేవరకు బదిలీలను వాయిదా వేయాలని ఆయన కోరారు. వాణిజ్యపన్నుల శాఖలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, ఉన్నతాధికారుల అవినీతిపై ఏసీబీ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

అనుమానాస్పద స్థితిలో ఇంటర్ విద్యార్థిని మృతి

కంభం (అర్ధవీడు), ఆగస్టు 28 : అర్ధవీడు మండలం రంగాపురం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. అర్థవీడు మండలం రంగాపురం గ్రామానికి చెందిన ఎం.లక్ష్మీ(17) రాచర్ల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆ బాలిక వద్ద 5 రోజుల క్రితం సెల్‌ఫోన్ ఉండటంతో ప్రిన్సిపాల్ ఇనుప స్కేల్‌తో కొట్టడంతోపాటు దూషించి ఇంటికి పంపారు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక ఆత్మహత్య చేసుకున్నట్లు బుధవారం సోషల్ మీడియాలో వైరలైంది. ఈ విషయం బయటకు రాకుండా ప్రిన్సిపాల్ సోదరుడు కనిగిరికి చెందిన ఓ వైసీపీ నాయకుడితో కలిసి బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడి సెటిల్‌మెంట్ చేసుకున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. పైగా ఆ బాలిక మరణించిన విషయం తెలిసినా పాఠశాలలోని ఎవరూ వెళ్లకపోవడం కూడా పలు అనుమానాలకు తావిస్తోంది. ఈవిషయమై ప్రిన్సిపాల్ మాలకొండమ్మను వివరణ కోరేందుకు పలుమార్లు ప్రయత్నించినా ఆమె అందుబాటులోకి రాలేదు.

స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డుకు దొనకొండ పాఠశాల

దొనకొండ, ఆగస్టు 28 : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన స్కూల్ అఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డుల ఎంపికలో దొనకొండ జడ్పీ పాఠశాల జిల్లాస్థాయిలో రెండో స్థానానికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు తెలిపారు. మైనంపాడులో గురువారం నిర్వహించే జాతీయ క్రీడాదినోత్సవ వేడుకల్లో ఈ అవార్డు అందజేస్తారని తెలిపారు.

సాగుచేసిన ప్రతి ఎకరాన్నీ గుర్తించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఉషా

పీసీపల్లి, ఆగస్టు 28 : రైతులు సాగు చేసిన ప్రతి ఎకరాన్ని గుర్తించాలని పీసీపల్లి తహసీల్దార్ సీహెచ్ ఉషా చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వీఆర్వోలు, వీఏఏలు ఒకరికొకరు సమన్వయం చేసుకుని క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతి పైరును గుర్తించాలన్నారు.

దొనకొండలో...

దొనకొండ, ఆగస్టు 28 : మండలంలోని గంగదేవిపల్లిలో జరుగుతున్న ఈ పంట నమోదును బుధవారం తహసీల్దార్ రమాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు వాస్తవంగా సాగుచేసిన పంటలను మాత్రమే నమోదు చేయాలన్నారు. ఏ రోజు ఏ సర్వేనెంబర్లల్లో పంటల నమోదు చేయబోతారో ఒకరోజు ముందుగానే రైతులకు తెలపాలన్నారు. ఈ పంటలో నమోదైతేనే ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా వర్తిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ, వ్యవసాయ సహాయకులు అరుణదేవి, వీఆర్వో శివ, రైతులు పాల్గొన్నారు.

50 శాతం రాయితీపై ప్లాస్టిక్ మల్చింగ్ పేపర్

పామూరు, ఆగస్టు 28 : పండ్లతోటలు సాగుచేసే రైతులకు ఉద్యానశాఖ తరఫున హెక్టారుకు ఒక ప్లాస్టిక్ మల్చింగ్ పేపర్‌ను 50 శాతం రాయితీలో అందచేస్తున్నామని ఆ శాఖ హెచ్‌వో కే కుసుమ తెలిపారు. పామూరు, సీఎస్‌పురం, పీసీపల్లి మండలాల్లో బత్తాయి, మామిడి, నిమ్మ, సపోట, సాగుచేసే రైతులకు తమ తోటల్లో ప్లాస్టిక్ మల్చింగ్ పేపర్ హెక్టార్‌కు రూ.32 వేలు కాగా, 50 శాతం రాయితీపై రూ.16 వేలకే వస్తుందని తెలిపారు. రైతులు వన్‌బీ అడంగల్, ఆధార్ కార్డు, బ్యాంక్ పాసుబుక్‌ను జత చేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.


గుంటూరులోని ఓ సీబీఎస్ఈ స్కూల్

సీబీఎస్ఈ.. శూన్యం

- సర్కారు బడుల్లో చతికలబడ్డ బోధన
- అంతర్గత పరీక్షల్లో 65 శాతం విద్యార్థులు ఫెయిల్
- ఈ ఏడాది పది పరీక్షలు లేనట్లే..
- స్టేట్ సిలబస్‌తోనే పరీక్షలకు సన్నద్ధం చేసే ప్రణాళిక
- ఉమ్మడి జిల్లాలో 35కు పైగా సీబీఎస్ఈ పాఠశాలలు

గుంటూరు(విద్య),ఆగస్టు 28: సర్కారు బడుల్లో ఆర్భాటంగా ప్రవేశ పెట్టిన సీబీఎస్ఈ బోధన.. 'ఆదిలోనే హంసపాదు' అన్న చందంగా తయారైంది. సరైన ప్రణాళిక, బోధన, ప్రమాణాలు పాటించకపోవడం, ఉపాధ్యాయులకు కొరవడిన శిక్షణ వంటి అంశాలు విద్యార్థుల పాలిట శాపంగా మారాయి. ఫలితంగా సిబిఎస్ఇలో చదినా ఈ ఏడాది పరీక్షలకు హాజరుకాలేని దుస్థితి. గత వైసీపీ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో దాదాపు 35 కు పైగా పాఠశాలల్లో సీబీఎస్ఈ బోధన ప్రవేశ పెట్టింది. ఆయా పాఠశాలల్లో ప్రస్తుతం పదవ తరగతిలో ఉన్న విద్యార్థినీవిద్యార్థుల సంఖ్య 5 వేల వరకు ఉన్నారని సమాచారం. ఈ విద్యార్థులు వచ్చే మార్చి, ఏప్రిల్‌లలో సెంట్రల్ బోర్డు ఆఫ్ సెంకడరీ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో జరిగే పరీక్షలు రాయాల్సి ఉంటుంది. అయితే, విద్యార్థులను ఆ దిశగా పరీక్షలకు సన్నద్ధం చేసిన దాఖలాలు దాదాపు శూన్యం. పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల్లో వారి నైపుణ్యాలు పరిశీలించడానికి ఇటీవల పాఠశాల విద్యాశాఖ అంతర్గతంగా పరీక్షలు నిర్వహించింది. ఆంగ్లం, సైన్స్, సోషల్ స్టడీస్, గణితం విభాగాల్లో నిర్వహించిన పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ చూసి అధికారులు నివ్వెరపోయారు. ఎందుకంటే, కనీసం 65 శాతం మంది విద్యార్థులు నైపుణ్య పరీక్షలో ఫెయిల్ అయ్యారు. వీరు సిబిఎస్ఇ విధానంలో జరిగే పరీక్షలకు హాజరైతే భారీమూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విద్యార్థులను రాష్ట్ర స్థాయిలో జరిగే ఎస్ఎస్‌సి పరీక్షలకు సన్నద్ధం చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

నాటి తప్పుడు నిర్ణయాలు.. విద్యార్థులు తిరోగమనం వైపు

గత వైసీపీ ప్రభుత్వం విద్యా రంగానికి సంబంధించి నాడు చేసిన సంస్కరణలు, తీసుకున్న అనేక తప్పుడు నిర్ణయాలకు విద్యార్థులు ఇప్పుడు మూల్యం చెల్లించుకుంటున్నారు. ఫ్లస్ టు విధానం ప్రవేశ పెట్టి అక్కడ కనీస వసతులు, బోధనకు అధ్యాపకులను నియమించలేదు. ఫలితంగా అక్కడ చదివిన విద్యార్థులు 90 శాతం ఫెయిల్ అయ్యారు. ఇలా పేద విద్యార్థులను ఇంటర్ విద్యకు దూరం చేశారు. ఐబి సిలబస్,టోఫెల్ బోధన, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబుల పంపిణీ, బైజూస్ ఒప్పందాలు ఇలా ఎన్ని ఆర్భాటాలు చేసినప్పటికీ అవి విద్యార్థులకు ఉపయోగపడక పోగా, వారిని తిరోగమన దిశలో పయనించేలా చేశాయి. సీబీఎస్ఈ విధానం కూడా అదే మాదిరి తయారవడంపై పలు విమర్శలు వస్తున్నాయి.

ఉపాధ్యాయులను సన్నద్ధం చేశారా?

ఉమ్మడి జిల్లాలో సీబీఎస్ఈ విధానంలో పాఠశాలలు ప్రారంభించడానికి ముందస్తు సన్నాహాలు ప్రభుత్వం చేయలేదు. ప్రధానంగా, ఉపాధ్యాయులకు కనీస శిక్షణ ఇవ్వలేదన్న ఆరోపణలు ఉన్నాయి. సీబీఎస్ఈ విధానంపై అమలుకు అవసరమైన మౌలిక వసతులు పాఠశాలల్లో కల్పించలేదు. సిబిఎస్ఇ బోర్డు సూచించిన విధానంలో ఎటువంటి ముందస్తు క్రాణాళికా లేకుండానే తరగతులు ప్రారంభించారు. దీంతో, విద్యార్థులను అందుకు అనుగుణంగా సన్నద్ధం చేయడంలో ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోలేదు. సీబీఎస్ఈలో బోధన అంతా విద్యార్థిలో నైపుణ్యాలను వెలికితీయడమే లక్ష్యంగా సాగుతుంది. విద్యార్థులను ఎటువంటి ఒత్తిళ్ళకు గురిచేయకుండా బోధన సాగుతుంది. విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే పాఠ్యపుస్తకాల నుంచే సొంతంగా నోట్స్ తయారు చేసుకుని పరీక్షలకు హాజరయ్యేలా సన్నద్ధం చేస్తారు. ఇందులో భాగంగా విద్యార్థులకు 20 మార్కులు ఇంటర్నల్‌లో కేటాయిస్తారు. సిబిఎస్ఇలో టీచింగ్‌లెర్నింగ్ మెటీరియల్‌ను ఉపాధ్యాయులు వినియోగిస్తారు. ఉపాధ్యాయు లకు ప్రతి సబ్జెక్టుకు సంబంధించిన బోధనపై ఏటా ప్రత్యేక శిక్షణా తరగతులు ఉంటాయి. ఇందుకు ఎన్‌సిఇఆర్‌టిలో ప్రత్యేకంగా శిక్షణ పొందిన అధ్యాపకులు, ప్రొఫెసరుల సహాయం తీసుకుంటారు. ఇలా అనేక విషయాలు బోధన విషయంలో అమలు చేస్తారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం ఇవేమీ పట్టించుకోకుండా హడావుడిగా సీబీఎస్ఈ ప్రవేశ పెట్టడంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.



వైసీపీ విలవిల

తిరుగేలేదు.. 30 ఏళ్లు మాదే అధికారం.. ఇక ప్రతిపక్షం ఆనవాళ్లే ఉండవు.. అని విర్రవీగిన వైసీపీ ప్రస్తుతం విలవిలలాడుతోంది. ఇప్పటికే గత సార్వత్రిక ఎన్నికల్లో కోలుకోలేని దెబ్బతో అల్లాడిపోతోంది. ఈ పరిస్థితుల్లో పలువురు సీనియర్లు, మాజీ ఎమ్మెల్యేల వరుస రాజీనామాలతో నేతల్లో గందరగోళం నెలకొనగా.. క్యాడర్ కలవరపడుతోంది. మొత్తంమీద 2019 ఎన్నికల్లో ఘన విజయంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఓ వెలుగువెలిగిన ఫ్యాన్ పార్టీ ప్రస్తుతం గడ్డుపరిస్థితులను ఎదుర్కొంటోంది. సార్వత్రిక ఎన్నికలకు ముందే వైసీపీ నేతలు పలువురు అధినేత జగన్‌కు షాక్ ఇచ్చారు. ఎన్నికల అనంతరం కూడా అదే పరంపర కొనసాగుతూ వస్తోంది. పార్టీ పరాజయం అనంతరం మాజీ ఎమ్మెల్యేలు మద్దాళి గిరి, కిలారి రోశయ్య రాజీనామా చేయగా తాజాగా ఎమ్మెల్సీ పోతుల సునీత అదే బాట పట్టారు. బాపట్ల జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడైన మోపిదేవి వెంకటరమణ టీడీపీలో చేరాలనే నిర్ణయం వైసీపీ నేతలను మరింత కలవరపరుస్తోంది.

ఎన్నికలకు ముందే చీ కొట్టి వచ్చేశారు..

తాడికొండ నియోజకవర్గం నుంచి 2019 ఎన్నికల్లో ప్రతిష్ఠాత్మక విజ యం సాధించిన ఉండవల్లి శ్రీదేవి 2024 ఎన్నికలకు ముందే జగన్‌ను ఛీ కొట్టి టీడీపీలో చేరరారు. తిరిగి తనకు జగన్ సీటు ఇచ్చే ఉద్దేశంలో జగన్ లేరని ముందుగానే గ్రహించిన ఆమె వైసీపీని వీడారు. ఇక ఎమ్మెల్సీ హోదాలోనే వైసీపీలో కొనసాగిన జంగా కృష్ణమూర్తి యాదవ్ ఆ పార్టీలో తనను సర్పంచ్ కంటే హీనంగా వైసీపీలో రెడ్డి సామాజికవర్గం నేతలు చూస్తున్నారనే బాధతో ఎమ్మెల్సీ పదవిని సైతం వదులుకుని టీడీపీలో చేరారు. ఇక 2014-19 మధ్య కాలంలో టీడీపీ హయాంలో ఓ వెలుగు వెలిగిన మాజీ మంత్రి మాణిక్యవర ప్రసాద్ సైతం ఎన్నికలకు ముందే జగన్‌ను వీడి టీడీపీలో చేరారు. ఎన్ని కల సమయంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్న కత్తెర హెనీ క్రిస్టీనా దంపతులు సైతం టీడీపీలో చేరారు. దీంతో ఆ పార్టీ పరిస్థితి ఉమ్మడి గుంటూరు జిల్లాలో అగమ్య గోచరంగా మారింది.

బాపట, గుంటూర్లు ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఓ వెలుగు వెలిగిన వైసీపీ నేడు దీనావస్థలో కునారిల్లుతున్నది. గత ఎన్నికల్లో ఒక్క ఎమ్మెల్యే స్థానాన్ని కూడా దక్కించుకోకుండా ఘోర పరాజయాన్ని చవి చూసింది. ఊహించని పరిణామాలతో వైసీపీ అధినేత జగన్ మరింత కుంగిపోతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో జగన్‌కు వైసీపీ నేతలు వరుసగా షాక్ ఇస్తున్నారు. ఎన్నికలకు ముందే పలువురు వైసీపీ కీలక నేతలు జగన్ తీరు నచ్చక గుడ్ బై చెప్పిన విషయం తెలిసిందే. ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయం తర్వాత కూడా రాజీనామాల పరంపర కొనసాగుతూ వస్తోంది. బాపట్ల జిల్లాలో ఎన్నికల కు ముందు వైసీపీ ద్వితీయశ్రేణి నేతాగణం చాలా వరకు టీడీపీ బాట పట్టింది. ఈ క్రమంలో వైసీపీ కీలక నేత, రాజ్యసభ ఎంపీ, జిల్లా వైసీపీ అధ్యక్షులుగా ఉన్నటువంటి ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు ఎంపీకి రాజీనామా చేయడంతో పాటు పార్టీని కూడా వీడడానికి గురువారం ముహూర్తం ఖరారైన నేపథ్యంలో వైసీపీ పరిస్థితి మరింత గందరగోళంలో పడింది. మోపిదేవి అడుగులు టీడీపీ వైపేనన్న స్పష్టత దాదాపుగా వచ్చింది. ఇక బాపట్ల జిల్లాలోని చీరాల నియోజకవర్గానికి చెందిన పోతుల సునీత తన ఎమ్మెల్సీ పదవితో పాటు వైసీపీకి కూడా రాజీనామా చేస్తున్నట్లు బుధవారమే ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో బాపట్ల జిల్లా వైసీపీలో ఏం జరుగుతుందనే అయోమయం పార్టీ శ్రేణుల్లో నెలకొంది. ఈ రాజీనామాల పరంపర ఇంతటితో ఆగబోదని మరింత మంది నేతలు టీడీపీలోకి క్యూ కట్టనున్నారనే సమాచారం వైసీపీని తత్తరపాటుకు గురిచేస్తోంది. ఎంపీ మోపిదేవి జిల్లా వైసీపీ అధ్యక్షులుగా ఉండగా, పోతుల సునీత నిన్నమొన్నటి వరకు వైసీపీరాష్ట్ర మహిళా విభాగం వంటి కీలక స్థానంలో అధ్యక్షురాలిగా పని చేశారు. వీరిద్దరూ ఒకే రోజు పార్టీని వీడుతున్నట్లు ప్రకటించడంతో వైసీపీ అధిష్ఠానం కంగుతిన్నది. మోపిదేవి తదుపరి అడుగులు టీడీపీ వైపేనన్న స్పష్టత రాగా, పోతుల సునీత విషయంలో ఇంకా ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. చీరాలలోని ఆమె అనుచరగణం మాత్రం బీజేపీలో చేరనున్నారనే ప్రచారం చేస్తున్నారు. ఎంపీ మోపిదేవి విషయంలో మంత్రి అనగానితో పాటు అన్ని వైపుల నుంచి సానుకూలతలు వ్యక్తం కావడం వల్లే టీడీపీ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. చేరికల విషయంలో తొందరపడకుండా ఆచితూచి నిర్ణయం తీసుకోవాలనే ఆలోచనలో టీడీపీ పెద్దలు ఉన్నట్లు తెలుస్తోంది.

2019 ఎన్నికల్లో పొన్నూరు నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన కిలారి వెంకట రోశయ్య కూడా ఇప్పటికే ఆ పార్టీని వీడారు. గత ఎన్నికల్లో ఆయన గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి వైసీపీ తరఫున ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. అయితే తిరిగి పొన్నూరు నుంచే ఎమ్మెల్యేగా పోటీ చేయాలని రోశయ్య భావించినా ఆయనకు అక్కడ గెలిచే అవకాశాలు లేవని భావించిన జగన్ గుంటూరు లోక్‌సభ స్థానానికి వలస తెచ్చారు. బలవంతంగా బరిలోకి దిగినా రోశయ్య పూర్తిగా కాడి కింద పడేయడంతో టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ మూడున్నర లక్షలకుపైగా మెజార్టీతో ఘన విజయం సాధించారు. తనను ఎమ్మెల్యేగా పోటీ చేయనివ్వలేదనే కోపంతో ఉన్న రోశయ్య ఇటీవల పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. అలాగే గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి 2019 ఎన్నికల్లో గెలుపొందిన మద్దాళి గిరి కూడా ఇటీవల వైసీపీకి రాజీనామా చేశారు. ఆయన 2019 ఎన్నికల్లో టీడీపీ తరఫున గెలుపొంది వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పార్టీలోకి జంప్ చేశారు. చిలకలూరిపేట నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆ నాటి మంత్రి రజినీని గుంటూరు పశ్చిమకు వలస తీసుకొచ్చి 2024 ఎన్నికల్లో గిరికి సీటు లేకుండా చేశారు. దీంతో ఆయనతో పాటు వైశ్య సామాజికవర్గం కూడా కొంత కినుక వహించింది. ఆ మనస్థాపంతో ఉన్న గిరి కూడా ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేశారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో గడ్డుకాలం

- గత సార్వత్రిక ఎన్నికల్లో క్లీన్‌స్వీప్
- వరుస రాజీనామాలతో శ్రేణుల్లో కలవరం
- ఫ్యాన్ పార్టీకి గుడ్‌బై చెప్పేందుకు సీనియర్లు సిద్ధం
- ఇప్పటికే మాజీ ఎమ్మెల్యేలు గిరి, రోశయ్య రాజీనామా
- ఎన్నికలకు ముందే పార్టీని వీడిన ఎమ్మెల్యే శ్రీదేవి, ఎమ్మెల్సీలు జంగా, డొక్కా
- టీడీపీలో చేరిన ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ క్రిస్టీనా
- తాజాగా ఎమ్మెల్సీ పోతుల సునీత రాజీనామాతో పార్టీ నేతల్లో కలవరం
- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి టీడీపీలోకి వెళ్లాలనే నిర్ణయంతో ఉలికిపాటు

ఇమడలేకపోతున్న కుడి భుజం

వైసీపీ ఆవిర్భావం నుంచి అధినేత జగన్‌కు కుడి భుజంగా మోపిదేవి వెంకటరమణ ఉన్నారు. ఆ పార్టీకి గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రస్తుతం బాపట్ల జిల్లాలో పెద్ద దిక్కుగా వ్యవహరించారు. అయితే జగన్ తీరుతో పార్టీలో ఇమడలేకపోతున్న రాజ్యసభ సభ్యుడు, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ కూడా పార్టీని వీడేందుకు సిద్ధమవటం ఆ పార్టీకి పెద్ద షాక్‌గా చెప్పవచ్చు. జగన్ సీఎం పదవిని చేపట్టక ముందు జైల్లో ఉన్న సమయంలో ఆయనతో పాటు మోపిదేవి తోటి ఖైదీగా ఉండి ఆయనకు మరింత సన్నిహితమయ్యారు. అందువల్లే ఆయన 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పరాజయం పాలైనా మంత్రి పదవిని కట్టబెట్టి ఆ తర్వాత ఎమ్మెల్సీని చేశారు. తదనంతర పరిణామాల్లో ఢిల్లీలో తనకు ఓ నమ్మకస్తుడు ఉండాలనే భావనతో ఆయన్ను రాజ్యసభకు ఎంపిక చేసి పంపించారు. అయితే 2024 ఎన్నికల్లో తిరిగి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని ఆకాంక్షను వ్యక్తం చేసినా ఆనాడు సీఎంగా ఉన్న జగన్ అందుకు నిరాకరించారు. కనీసం తన సోదరుడికైనా టికెట్ ఇవ్వాలని పట్టుపట్టినా జగన్ అంగీకరించలేదు. ఎన్నికలకు ముందు రేపల్లెలో గణేష్ అభ్యర్థిత్వంలో పునరాలోచించాలని పలుమార్లు జగన్‌ను అభ్యర్థించారు. ఇదే విషయం మాట్లాడానికైతే మరోమారు తన వద్దకు రావద్దని అప్పటి సీఎం జగన్ ఎంపీ మోపిదేవికి చెప్పినట్లు, అదే విషయాన్ని తన అనుచరుల వద్ద చెప్పి ఎంపీ ఆవేదన వ్యక్తం చేసినట్లు ప్రచారం జరిగింది. ఇదంతా ఒక ఎత్తయితే జిల్లా వైసీపీ అధ్యక్ష పగ్గాలు అప్పచెప్పి సీట్ల ఖరారు విషయంలో నామమాత్రంగా కూడా తన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని అవమానంగా మోపిదేవి భావించారు. దీనికి తోడు ఇష్టంలేని వ్యక్తికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడంతో అప్పటి నుంచి మోపిదేవి మనస్థాపానికి గురయ్యారు. ఎన్నికల ఫలితాల విడుదలయిన దగ్గర నుంచి ఎంపీ మోపిదేవి వైసీపీ పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంటూనే వస్తున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఆయన వైసీపీని వీడి టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. తద్వారా రాజ్యసభ సభ్యుడి పదవిని కూడా వదులుకునేందుకు ఆయన సిద్ధం కావడం విశేషం.

టీడీపీ ఖాతాలోకి రేపల్లె మున్సిపాలిటీ?


తీరప్రాంతంలో ఎంపీ మోపిదేవికి తన వెంట నడిచే అనుచరగణం ఉంది. ముఖ్యంగా మత్స్యకార సామాజిక వర్గం ఎప్పటి నుంచో ఆయన వెంట ఉంది. ఆయన వైసీపీని వీడి టీడీపీలో చేరనుండడంతో రేపల్లె నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు టీడీపీకి మరింత అనుకూలంగా మారనున్నాయి. ఎంపీ మోపిదేవి రాజీనామాతో రేపల్లెలో వైసీపీ దాదాపు ఖాళీ అయినట్లేననే అభిప్రాయానికి ఆ పార్టీ శ్రేణులే వచ్చాయి. రేపల్లె మున్సిపాలిటీలో మొత్తం 28 కౌన్సిలర్లకు వైసీపీ బలం 26గా ఉంది. ఎంపీ మోపిదేవితో పాటు పెద్దఎత్తున వైసీపీ నేతలు టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారని సమాచారం. దీంతో మారనున్న రాజకీయ సమీకరణాల ప్రకారం రేపల్లె మున్సిపాలిటీ టీడీపీ ఖాతాలో పడే అవకాశం ఉందని తెలుస్తోంది.



అక్రమాల బావుడా

- ఉద్దేశాన్ని నీరుగార్చిన వైసీపీ నేతలు
- అనధికార లే అవుట్లు.. ఇష్టారీతిన అనుమతులు
- అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

బాపట్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రగతిలో కీలకపాత్ర పోషించాల్సిన బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(బావుడా)ని కేవలం తమ అక్రమాలకు కొమ్ముకాసే జేబు సంస్థగా వైసీపీ నేతలు మార్చుకుని అసలు ఉద్దేశాన్ని నీరుగార్చారు. ప్రగతి ప్రణాళికలను, కేంద్రం నుం చి హక్కుగా అథారిటీకి వచ్చే నిధులపై దృష్టి సారించకుండా అనధికార లేఅవుట్లకు ఇబ్బడి ముబ్బడిగా అనుమతులు ఇచ్చి పెద్దఎత్తున సొమ్ములు దండుకున్నారు. దీనికి నిదర్శనంగా బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో 104



అనధికార లే అవుట్లు ఉన్నట్లు తాజాగా అధి కారులు బహిరంగపరిచారు. వీటిలో దాదాపు 30 శాతం వరకు బావుడా కొలువుదీరాక వేసినవే ఉ న్నాయి. దాదాపు కోటి రూపాయల వరకు అక్రమ అనుమతుల విషయంలో వైసీపీ నేతాగణం సొమ్ము చేసుకున్నట్లు తెలుస్తోంది. గతేడాది మేలో బావుడా కొలువుదీరింది. ఛైర్మన్‌గా రేపల్లె మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు బాధ్య తలు స్వీకరించారు. అప్పటి నుంచి వైసీపీ ప్రభు త్వం గద్దె దిగేవరకు బావుడా విధివిధానాలపై శ్రద్ధ పెట్టిన పాపాన పోలేదు. నిబంధనలు పా టించకపోయినా వైసీపీ నేతాగణం ఆశీస్సులు ఉం టే ఇబ్బడిముబ్బడిగా లే అవుట్లు వేసి దండు కోవడానికి తప్ప బావుడా ఏర్పాటు వల్ల వేరే ప్రయోజనం ప్రజలకు దక్కకుండా పోయింది. కార్యాలయంలో ఇద్దరు సిబ్బందిని మొక్కుబడిగా పెట్టి మమ అనిపించారు తప్పితే హక్కుగా రావాల్సిన కేంద్రం నిధులను రాబట్టే విషయంలో పట్టింపే లేక పోయింది. కూటమి ప్రభుత్వంలోకి అధికారంలోకి రాగానే నామినేటెడ్ పోస్టుల్లో ఉన్న వారంతా వైదొలగడంతో బావుడా ఛైర్మన్ పదవి కూడా ఖాళీ గానే ఉంది.

పరిధి విషయంలోనూ మార్పులు..

జిల్లాలోని చీరాల, పర్చూరు, అద్దంకి నియోజక వర్గాలు ఒంగోలు కేంద్రంగా ఉన్న ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో ఉన్నాయి. బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాలతో పాటు ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని పెద నందిపాడు, కాకుమాను మండలాలను అప్పట్లో బావుడా పరిధిలోకి తెచ్చారు. తాజాగా కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో పరిధి విషయంలో మార్పులు చేస్తూ ఇటీవలే ఆదేశాలిచ్చింది. దానిలో భాగంగా వేమూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలను సీఆర్డీఏ కిందకు తెచ్చింది. జిల్లా కేంద్రంగా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేస్తున్నప్పుడు జిల్లాలోని అన్ని ప్రాంతాలను ఆ గొడుగు కిందకు తెచ్చే ప్రయత్నం కూడా గత ప్రభుత్వం చేయకపోగా హడావిడిగా బావుడా ఏర్పాటు చేసి కొత్త చిక్కులు తెచ్చిపెట్టింది. కూటమి ప్రభుత్వం ఆ తప్పులు సరిదిద్దే దిశగా అడుగులేస్తోంది.

కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి..

దాదాపు ఏడాదికి పైగా అలంకారప్రాయంగా మాత్రమే ఉన్న బావుడాకు కొత్తరూపు తీసుకురావడంపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. తొలుత అథారిటీల పరిధిలో అడ్డగోలుగా వేసిన లే అవుట్లపై కొరడా ఝళిపంచడమే కాకుండా వాటి ద్వారా వైసీపీ నేతలు ఎంత దండుకున్నారో ప్రజల ముందుంచే ప్రయత్నం చేస్తోంది. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో ఉన్న మండలాల్లో ఇళ్ల నిర్మాణాలకు కేంద్రం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయనుంది.

చీరాలకు.. ఎఫ్‌ఎం రేడియో

మోదీ ఆమోదంతో రానున్న కేంద్రం

చీరాల, ఆగస్టు 28: చీరాలలో ఎఫ్ఎం రేడియో ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో దేశంలో 730 చానల్స్‌తో 234 కొత్త పట్టణాల్లో ఎఫ్ఎం రేడియో కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. వీటిలో ఏపీలో 22 పట్టణాలు ఉండగా అందులో చీరాల ఒకటి. ఎఫ్ఎం రేడియోతో సముద్రంలో ఎదురయ్యే ఒడిదొడుకులు, వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు మార్గం మరింత సుగమం అవుతుందని మత్స్యకార ప్రతినిధులు భావిస్తున్నారు.వస్త్రవ్యాపార కార్యకలాపాలు, బంగారు, వెండి ధరలు, ఐటీసీకి సంబంధించి ఇతరత్రా స్థానికంగా చేనేత పరిశ్రమకు సంబంధించిన విషయాలు ఇతర ప్రాంతాలవారు తెలుసుకోగలుగుతారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా

- ప్రభుత్వ ఉత్తర్వులు బేఖాతర్

చీరాల, ఆగస్టు 28: చీరాల, పర్చూరు నియోజవర్గాల పరిధిలో ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. చర్యలు చేపట్టాల్సిన అధికారులకు అక్రమార్కులు సవాల్‌గా నిలుస్తున్నారు. ఎన్ని చర్యలు చేపట్టినా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది. ఉచిత ఇసుక విధానం ద్వారా పారదర్శకంగా ఉచిత ఇసుకను అందించాలి. అయితే చీరాల, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా ఆగడం లేదు. ముందు వారిని చూచి మరికొందరు ఆ దందాకు ఆకర్షితులవుతున్నారు. చీరాల నియోజకవర్గంలో అధికారిక ఇసుక రీచ్‌లు లేవు. అయితే ప్రతి రోజు ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా కొనసాగుతూనే ఉన్నాయి. అందులో అధికారుల కంటపడి పట్టుబడుతున్నవి కొన్నయితే, వారి కళ్లుకప్పి దందా సాగిస్తున్న అగంతక చర్యలు ఎక్కువగా ఉన్నాయి. చినగంజాం మండలం పెదగంజాం పరిధిలో చినగంజాం పోలీసులు మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. సదరు టిప్పర్లకు ఏకంగా ఎక్స్‌కవేటర్లతో ఇసుక నింపేందుకు సిద్ధం చేయడం అక్కడివారి తెంపరితానికి నిదర్శనం. చీరాల వాడరేవు రోడ్డు జంక్షన్ వద్ద సోమవారం ఇసుక ట్రాక్టర్‌ను అధికారులు పట్టుకుని టూటౌన్ పోలీసులకు అప్పగించారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు సంబంధించి అధికారులు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టడం లేదనే విమర్శలున్నాయి.


చీరాల పోలీసుల అదుపులో ఇసుక ట్రాక్టర్


చినగంజాం పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న టిప్పర్

మాగాణి సాగు ప్రశ్నార్థకమేనా?

డ్యాములు పొంగిపొర్లుతున్నా ఉమ్మడి జిల్లాలో నీటి ఇక్కట్లు

అవసరం 69 టీఎంసీలు, వాటా ప్రకారం వచ్చేది 56.76 టీఎంసీలే

లోటు నీరు వర్షాలతో సర్దుబాటు

గతేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితి

ఆరుతడి పంటలకే సాగర్ నీరని యంత్రాంగం ప్రకటన

ఆందోళన చెందుతున్న ఆయకట్టు రైతులు

గతేడాది నీరు లేక సాగర్ ఆయకట్టులో నిలిచిన సాగు

ఒంగోలు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది కూడా మాగాణి సాగు ప్రశ్నార్థకంగానే కనిపిస్తోంది. ప్రధాన సాగునీటి వనరుగా ఉన్న సాగర్ కాలువల్లో గత ఏడాది నీరు రాక ఆయకట్టు భూముల్లో పంటలు సాగు కాలేదు. 3.50 లక్షల ఎకరాలలో ఆ నీరు ఆధారంగా పంటలు సాగు చేస్తారు. అందులో ఇంచుమించు లక్షన్నర ఎకరాలలో మాగాణి, రెండు లక్షల ఎకరాలలో ఆరుతడి పంటలు వేస్తుంటారు. అయితే గత ఏడాది కృష్ణానదిలో నీటి ప్రవాహం లేక కాలువల్లో నీరు రాక సాగర్ ఆయకట్టులో మాగాణి సాగు పూర్తిగా నిలిచిపోగా ఆరుతడి పంటలు వర్షాధారంగా కొంత మేర సాగయ్యాయి. వేలాది ఎకరాల వరి పంట పండే మాగాణి భూములు బీళ్లుగా మిగిలిపోయాయి. అయితే ఈఏడాది జూలైలోనే కృష్ణమ్మ పరవళ్లు తొక్కింది. ఇరవై రోజుల పాటు వరద కొనసాగింది. శ్రీశైలం, సాగర్‌డ్యామ్‌లు నిండి గేట్లు ఎత్తి సముద్రానికి నీళ్లు వదిలారు. దీంతో ఈ ఏడాది సాగుపై సాగర్ ఆయకట్టు రైతులు పూర్తి భరోసాతో ఉన్నారు. అయితే డ్యామ్‌లు నిండి పొంగి పోర్లుతున్నా కూడా ఉమ్మడి జిల్లాలో మాగాణి సాగు ప్రశ్నార్థకంగానే కనిపిస్తోంది.

> **సాగర్ ఆయకట్టు రైతుల్లో అయోమయ పరిస్థితి నెలకొంది. వరిసాగుకు నీరు ఇస్తారో లేదో అన్న విషయం అర్థంకాక తర్జనభర్జన పడుతున్నారు. శ్రీశైలం, సాగర్ జలాశయాలలో నిండుగా నీరు ఉన్నప్పటికి రెండవ జోన్‌లో ఆరుతడి పంటలకు మాత్రమే నీరిస్తామని అధికారులు ప్రకటించటంపై అన్నదాతలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గత రెండేళ్లు సక్రమంగా వర్షాలు లేక జలాశయాల్లో నీరు చేరక ఆయకట్టు వరిసాగుకు నోచుకు లేదు. ఈ ఏడాది వరుణదేవుడు కరుణించి జలాశయాల్లోకి నీరు పుష్కలంగా చేరినప్పటి ఇదేం విచిత్ర పరిస్థితి అని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. జిల్లా 4.5లక్షల ఎకరా ఆయకట్టు భూమి ఉంది. దర్శి ప్రాంతంలో ప్రస్తుతం సాగర్ ఆయకట్టు భూముల్లో కంది, సజ్జ పైర్లు వేశారు. జలాశయాలు నిండటంతో వరికి నీరు ఇస్తారన్న ఆశతో కొందరు రైతులు ఆ పైర్లను తీసేసి వరి నారు పోశారు. అధికారుల ప్రకటనతో ఏమి చేయాలో పాలుపోక ఇప్పుడు మదనపడుతున్నారు.**

రాష్ట్ర విభజనతోనే సమస్య

ఇప్పటికే ప్రకాశం జిల్లా రైతాంగం ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేసుకోవాలని జిల్లా యంత్రాంగం ప్రకటించడం ఆయకట్టు రైతులలో ఆందోళన కలిగిస్తోంది. అందుకు ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులే ప్రధాన కారణంగా చేప్తున్నారు. సాగర్ కుడి కాలువకు 132 టీఎంసీల నీరు తీసుకొనే అవకాశం స్పష్టంగా ఉంది. అయితే వాస్తవ అవసరం మరో 40 నుంచి 50 టీఎంసీల వరకు ఉంటుంది. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని కుడి కాలువ పరిధిలో సుమారు 11 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. అలాగే వందలాది చెరువులు, ఎస్‌ఎస్ ట్యాంకులు ఉండటంతో ఆమేరకు అదనపు నీరు అవసరం. పుష్కలంగా వర్షాలు కురిస్తే ఆ మేర సాగర్ నీటి అవసరం తగ్గుతుంది. అలాంటి సమయంలో వాటా ప్రకారం వచ్చే 132 టీఎంసీలకు అటుఇటుగా ఇస్తే పంట చేతికి వచ్చేది. గతంలో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు పంటలు వేశాక వర్షాలు సరిలేకపోతే సాగర్ డ్యామ్‌లో ఉన్న నీటిని పంటలను కాపాడేందుకు ఇచ్చేవారు. రాష్ట్ర విభజన అనంతరం ఆ పరిస్థితి లేకుండా పోయింది.

ముందుజాగ్రత్త కోసమే ప్రకటన

అయితే పుష్కలంగా వర్షాలు కురియడంతో పాటు నీటి సరఫరా వ్యవస్థను మెరుగ్గా చేయగలిగితే వాటా ప్రకారం వచ్చే నీటితో పంట పండించుకోనే అవకాశం ఉంటుంది. కానీ ఈ ఏడాది ఇప్పటి దాకా పరిస్థితి చూస్తే తీవ్ర వర్షాభావ పరిస్థితులే కనిపిస్తుండగా రబీ సీజన్‌లోనైనా ఏ మేరకు వర్షం కురుస్తుందన్న నమ్మకం కనిపించడం లేదు. ఈ పరిస్థితిని గమనించిన యంత్రాంగం ముందు జాగ్రత్తగా సాగర్ ఆయకట్టుకు సెప్టెంబరు మొదటివారంలో నీరు ఇస్తున్నట్లు ప్రకటించినా ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేయాలని షరతు విధించారు. ఆ మేరకు అధికారికంగా కలెక్టర్, జలవనరుల శాఖ ఎస్‌ఈలు ప్రకటన కూడా ఇచ్చారు. దీంతో ఇప్పటి దాకా కృష్ణానది పరవళ్లు చూసి నార్లు పోసేందుకు సిద్ధమైన రైతులు ఆందోళన చెందుతున్నారు.

నేతలు స్పందిస్తేనే..

తక్షణం ఉమ్మడి జిల్లా కీలక ప్రజాప్రతినిధులు ఈ అంశంపై దృష్టిసారించి రైతులకు భరోసా ఇవ్వాల్సినఅవసరం కనిపిస్తోంది. గతంలో డ్యామ్‌లు పొంగి గేట్లు ఎత్తిన సమయంలో కాలువకు ఇచ్చిననీటిని ఆఏడాది వాటా నీరు నుంచి మినహాయించేవారు. అలా వచ్చిన నీటిని రామతీర్థం, గుండ్లకమ్మ రిజర్వాయర్లు నింపడటంతో పాటు మొత్తం ఎస్‌ఎస్‌ట్యాంకులు, నోటిఫైడ్, నాన్ నోటిఫైడ్ చేరువులు నింపేవారు. తద్వారా వాటా ప్రకారం వచ్చే నీటిని అవసరమైనప్పుడు తీసుకోనే సౌకర్యం కలిగేది. అలాగే తక్కువనీటి అవసరం, తక్కువ కాల పంట సాగు వంటి అంశాలను పరిశీలించి రైతులకు మాగాణి సాగుపై భరోసా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నిండుగా ప్రవహిస్తున్న సాగర్ కాలువ

వరి సాగుకు నీరివ్వాలి

-యర్రగుంట్ల శ్రీనివాసరావు రైతు తూర్పువెంకటాపురం

సాగర్ జలాశయంలో నిండుగా నీరు ఉన్నందున వరి సాగుకు నీరు అందించాలి. గత రెండేళ్లుగా వర్షాలు లేక సాగునీరు లేక ఇబ్బందిపడ్డాము. మెట్ట పంటలు సరిగా పండలేదు. మూడు ఎకరాల సాగు భూమి ఉంది. ప్రస్తుతం కంది పైరు వేసినా ఎండిపోతోంది. వరి సాగుకు నీరు ఇచ్చి ఆదుకోవాలి.

వరిసాగుకు నీరివ్వకపోతే నష్టపోతాం

-నవులూరి సురేంద్రమోహన్, రైతు వితలాపురం

వరిసాగుకు నీరివ్వకపోతే రైతాంగం తీవ్రంగా నష్టపోతాం. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక శ్రీశైలం, సాగర్ జలాశయాలు నిండటంతో రైతులు ఎంతో ఆనందంగా ఉన్నారు. ప్రస్తుతం వర్షాభావం వల్ల సాగుచేసిన పైర్లు కూడా వాడుముఖం పట్టాయి. ఈ పరిస్థితిల్లో వరి సాగుకు నీరివ్వకపోతే రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది.

అదనపు నీరు అనుమానమే

కుడి కాలువకు వాటా ప్రకారం ఇచ్చే 132 టీఎంసీలతోనే సిద్ధం కావాల్సి ఉంటుంది. ఆ ప్రకారం చూస్తే కుడి కాలువకు వచ్చే 132 టీఎంసీల నీటిలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు 43శాతం వాటా ప్రకారం 56.70 టీఎంసీల నీరు వచ్చే అవకాశం ఉంటుంది. వాస్తవ అవసరాలు సుమారు 69 టీఎంసీలుగా అంచనా. ఈ ఏడాది సాగుకు 57 టీఎంసీలు, తాగునీటికి 12 టీఎంసీలు వెరసి 69 టీఎంసీలు అవసరంగా ఎన్‌ఎస్‌పీ ఒంగోలు సర్కిల్ అధికారులు నెలక్రితమే ఉన్నతాధికారులకు నివేదించారు. అంటే వాటా ప్రకారం జిల్లాకు వచ్చే నీటి కన్నా వాస్తవ అవసరం దాదాపు 12 టీఎంసీలు అధికంగా ఉంది. ఆ మేర అదనపు నీరు సాగర్ నుంచి ఏ మేరకు వస్తుందన్నది అనుమానమే.

అనుమానాస్పద స్థితిలో ఇంటర్ విద్యార్థిని మృతి

కంభం (అర్ధవీడు), ఆగస్టు 28 : అర్ధవీడు మండలం రంగాపురం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. అర్ధవీడు మండలం రంగాపురం గ్రామానికి చెందిన ఎం.లక్ష్మీ (17) అనే బాలిక రాచర్ల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆ బాలిక వద్ద 5 రోజుల క్రితం సెల్‌ఫోన్ ఉండటంతో కళాశాల ప్రిన్సిపాల్ ఇనుప స్కేల్‌తో కొట్టడంతోపాటు దూషించి ఇంటికి పంపారు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక ఆత్మహత్య చేసుకున్నట్లు బుధవారం సోషల్ మీడియాలో వైరలైంది. ఈ విషయం బయటకు రాకుండా ప్రిన్సిపాల్ సోదరుడు కనిగిరికి చెందిన ఓ వైసీపీ నాయకుడితో కలిసి బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడి సెటిల్‌మెంట్ చేసుకున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. పైగా ఆ బాలిక మరణించిన విషయం తెలిసినా పాఠశాలలోని ఎవరూ వెళ్లకపోవడం కూడా పలు అనుమానాలకు తావిస్తోంది. ఈవిషయమై ప్రిన్సిపాల్ మాలకొండమ్మను వివరణ కోరేందుకు పలుమార్లు ప్రయత్నించినా ఆమె అందుబాటులోకి రాలేదు.

యువకుడి ఆత్మహత్య

దర్శి, ఆగస్టు 28 : దర్శి పట్టణంలో యువకుడు బుధవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. పొదిలి మండలం ఈగలపాడు గ్రామానికి చెందిన వెన్నపూస కాశిరెడ్డి (20) పట్టణ సమీపంలోని తూర్పుగంగవరం రోడ్డులో టీ దుకాణంలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాశిరెడ్డితోపాటు ఫిరోజ్ అనే యువకుడితో కలిసి రూంలోఉంటున్నారు. కాశిరెడ్డికి బుధవారం సెలవు కావడంతో రూంలో ఉన్నాడు. ఫిరోజ్ తన పని ముగించుకొని సాయంత్రం రూంకు వచ్చే సరికి కాశిరెడ్డి ఉరివేసుకొని మృతిచెంది ఉన్నాడు. ప్రేమ విఫలమై దుర్మరణానికి పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఎస్‌ఐ ఎం.మురళి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తూర్పు కట్టకిందపల్లి రేషన్‌షాపుపై 6 ఏ కేసు



రేషన్ సరుకులను పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

పామూరు, ఆగస్టు 28 : మండలంలోని తూర్పుకట్టకిందపల్లి రేషన్ షాపుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. డీలర్ నీరుకట్టు పద్మావతి చేత షాపు తాళాలు తీయించి రికార్డులను, రేషన్ సరుకులను పరిశీలించారు. రికార్డుల్లో ఉండాల్సిన 5 కింటాళ్ల 77 కేజీల బియ్యం, 69 ప్యాకెట్ల చక్కెర తక్కువగా ఉండటంతో డీలర్‌పై కేసు నమోదు చేసి షాపును సీజ్ చేశారు. ఈ దాడుల్లో ఏఎస్‌వో జె. రవి, వీఆర్వోవో షేక్ ఖాజారఫి పాల్గొన్నారు.

వాణిజ్యపన్నులశాఖలో బదిలీలను వాయిదా వేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 28: వాణిజ్య పన్నులశాఖలో ఉద్యోగుల బదిలీలను ప్రభుత్వం వాయిదా వేయాలని ఆశాఖ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు జాజుల నరసింగరావు కోరారు. ఒంగోలు నగరం దారావారితోటలోని వాణిజ్యపన్నులశాఖ సముదాయం భవనం వద్ద బుధవారం మధ్యాహ్నం భోజన విరామన సమయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో శాఖలో 2.0 ఆర్గనైజేషన్ పేరుతో రాజ్యాంగ వ్యతిరేకంగా రాష్ట్రపతి ఉత్తర్వులకు భిన్నంగా ఉద్యోగుల బదిలీలు జరిగాయన్నారు. వాటిని రద్దు చేస్తూ వారి సొంత యూనిట్ ఆఫ్ అపాయింట్ స్థానాలకు బదిలీచేసి మరలా సర్కిల్ వ్యవస్థను పరిపుష్టత తీసుకు రావాలని కోరారు. జీఎస్టీవోలకు వర్క్ ఫంక్షన్ ఏర్పాటు చేయాలని, రీజినల్ ఆఫీసును రద్దు చేయాలన్నారు. గత ప్రభుత్వంలో పలువురు ఉన్నతాధికారులు పన్ను ఎగవేతదారులకు సహకరించినందున ప్రభుత్వ ఖజానాకు తీరని నష్టం జరిగిందని ఆరోపించారు. గత బలవంతపు బదిలీలను సరిదిద్దేవరకు బదిలీలను వాయిదా వేయాలని ఆయన కోరారు. వాణిజ్యపన్నుల శాఖలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, ఉన్నతాధికారుల అవినీతిపై ఏసీబీ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి కిరణ్‌కుమార్, డివిజన్ కార్యవర్గ సభ్యులు కురిచేటి సుధాకర్, బి.రవికుమార్, అహ్మద్ బాషా, వంశీ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు నేటి నుంచి యూనిట్ టెస్ట్-2

ఒంగోలు(విద్య), ఆగస్టు 28: జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ఇతర ప్రభుత్వ రంగ పాఠశాలల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు గురువారం నుంచి యూనిట్ టెస్ట్-2 పరీక్షలు జరుగుతాయని ఆర్‌ఐవో సైమన్‌విక్టర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు సంబంధించి ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు మాత్రమే బోర్డు నుంచి ప్రశ్నపత్రాలను సరఫరా చేస్తారు. హైస్కూలు ప్లస్, కేజీబీవీలు, ఏపీ మోడల్ స్కూళ్లలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు వారికి బోధిస్తున్న అధ్యాపకులే ప్రశ్నపత్రాలు తయారు చేసి పరీక్షలు నిర్వహిస్తారు. ఈ విద్యాసంస్థలు పాఠశాలవిద్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నందున ఈ విద్యార్థులకు ఇంటర్ బోర్డు ప్రశ్నపత్రాలను సరఫరా చేయదని తెలిపారు.

బ్యారన్‌ల రిజిస్ట్రేషన్ ప్రారంభం

కొండపి, ఆగస్టు 28 : పొగాకు బ్యారన్‌ల రిజిస్ట్రేషన్ స్థానిక వేలం కేంద్రంలో బుధవారం నుంచి ప్రారంభమైంది. తొలిరోజు తొమ్మిది బ్యారన్‌లను రిజిస్ట్రేషన్ చేశారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ మాట్లాడుతూ బోర్డు నూతన నిబంధనల ప్రకారం మూడు సంవత్సరాల నుంచి బ్యారన్‌లను రైతులు రిజిస్టర్ చేయించుకోకపోతే ఈఏడాది చేయబోమని తెలిపారు.

పంచాయతీలకు నిధులు వచ్చాయ్

రూ.37.95కోట్లు అకౌంట్లకు జమ

రూ. 4.64 లక్షలు వడ్డీ జమ

గ్రామాల్లో అత్యవసర పనులు చేపట్టేందుకు అవకాశం

నిధులు లేక కునారిల్లుతున్న పల్లెలకు ఊరట

ఒంగోలు(కలెక్టరేట్),ఆగస్టు 28: నిధులు లేక కునారిల్లుతున్న గ్రామ పంచాయతీలకు ఊరట లభించింది. ఎట్టకేలకు ఆర్థిక సంఘం నిధులు జమయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామపంచాయతీల జనరల్‌ఫండ్‌తోపాటు ఆర్థిక సంఘం నిధులను కూడా లాగేసుకోవడంతో గ్రామాల్లో ఎలాంటి పనులు చేసేందుకు అవకాశం కూడా లేకుండాపోయింది. పంచాయతీ నిధుల కోసం వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీ సర్పంచ్‌లు రోడ్డెక్కి ఆందోళనలు చేసినా పట్టించుకొనిపరిస్థితి ఏర్పడింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్థానికసంస్థల పాలకవర్గాలకు ఊరట కలిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెండింగ్‌లో ఉన్న ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు కేటాయించే విధంగా చొరవ తీసుకున్నారు. గత ఐదు రోజుల క్రితం ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులను మంజూరు చేశారు. ఆ నిధులు గత రెండు రోజులుగా జిల్లాలోని గ్రామ పంచాయతీ అకౌంట్లలో జమ అయ్యాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో విడత నిధులు జిల్లాలోని 729గ్రామ పంచాయతీలకు రూ 37.95కోట్లు, వడ్డీకింద రూ 4.64 లక్షలు పంచాయతీ అకౌంట్లలో జమ అయ్యాయి. ఒక్కొక్క పంచాయతీకి సరాసరిన రూ 1.50 లక్షల నుంచి రూ 5 లక్షల వరకు నిధులు జమ అయ్యాయి. ఈ ఆర్థిక సంఘంనిధులు బేసిన్ గ్రాంటు కింద రూ 15.18 కోట్లు, వడ్డీ కింద రూ 3.20 లక్షలు, టైడ్ గ్రాంట్ కింద రూ 22.77 కోట్లు, వడ్డీ కింద రూ 1.44 లక్షలు కలిపి సుమారు రూ 38 కోట్ల మేర నిధులు జమఅయ్యాయి. ఈ నిధుల ద్వారా గ్రామ పంచాయతీల్లో అత్యవసర పనులు చేపట్టేందుకు అవకాశం కలిగింది. ప్రభుత్వం ఇటీవల గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు గ్రామ సభలను నిర్వహించింది. ఉపాధి పథకం అనుసంధానంతో రోడ్లు, డ్రైనేజి, పైపు లైన్ల నిర్మాణాలు, గ్రామ పంచాయతీల్లో ఆర్థిక వనరులను పెంచేందుకు అవసరమయ్యే పలు రకాల పనులు గ్రామ సభల ద్వారా ఆయాపనులను ఎంపిక చేశారు. ప్రస్తుతం ఆర్థిక సంఘం నిధులు మంజూరుకావడంతో ఆ నిధుల ద్వారా ఆయా పనులను సత్వరమే చేపట్టేందుకు అవకాశం కలిగింది. మరో వైపు ప్రజలకు అత్యవసర మైన తాగునీటితో పాటు పారిశుధ్య నిర్వహణతో పాటు పలు రకాల పనులు చేపట్టేందుకు దోహదపడనుంది. నిర్వీర్యమైన గ్రామ పంచాయతీలను పునరుద్ధరణకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకోవడం పట్ల పాలకవర్గాల్లో హర్షవ్యక్తం అవుతున్నాయి.

డివిజన్ స్థాయిలో టీచర్లకు సర్దుబాటు కౌన్సెలింగ్

ఒంగోలు(విద్య), ఆగస్టు 28 : ఒంగోలు డివిజన్ స్థాయిలో ఉపాధ్యాయుల ప నిసర్దుబాటు కౌన్సెలింగ్ బుధవారం సాయంత్రం స్థానిక పాత రిమ్స్‌లోని ఉప విద్యాధికారి కార్యాలయంలో జరిగింది. ఉపవిద్యాధికారి అనితా రోజ్‌రాణి కౌన్సెలిం గ్ నిర్వహించారు. డివిజన్ పరిధిలో స్కూలు అసిస్టెంట్ తెలుగు ఒకటి, హిందీ ఆ రు, ఇంగ్లీషు 7, ఫిజికల్ సైన్స్ ఒకటి, బయాలజికల్ సైన్స్ ఒకటి, సోషల్ 4 కలిపి మొత్తం 22 పోస్టులు ఖాళీ ఉన్నాయి. డివిజన్ పరిధిలోని అన్ని మండలాల నుంచి 22 మంది స్కూలు అసిస్టెంట్లు మిగులుగా తేలారు. వీరికి సబ్జెక్టు వారీగా కౌన్సె లింగ్ నిర్వహించారు. స్కూలు అసిస్టెంట్ ఇంగ్లీషు పోస్టుల భర్తీపై అభ్యంతరం రావడంతో ఆ సబ్జెక్టుపై విచారణ కోసం కౌన్సెలింగ్ వాయిదా వేశారు. హిందీ ఆరు ఖాళీలు ఉండగా మూడు పోస్టులు భర్తీ అయ్యాయి. మిగిలిన మూడు పోస్టులకు అర్హులు లభించకపోవడంతో మిగిలిపోయాయి. తెలుగు, పీఎస్, బీఎస్, ఎస్‌ఎస్ పోస్టులు భర్తీ అయ్యాయి. బయాలాజికల్ సైన్స్ స్కూలు అసిస్టెంట్లు ఇద్దరు మి గులుగా తేలడంతో మూడు పోస్టులను అర్హులైన ఎస్‌జీటీలతో భర్తీ చేశారు.

పామూరు దేవస్థాన మాన్యం భూమి పరిశీలన



భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ సయ్యద్ హుసేన్

పామూరు, ఆగస్టు 28 : పామూరు మదనవేణుగోపాలస్వామి దేవస్థానానికి సంబంధించిన మాన్యం భూమి రికార్డులను నెల్లూరు జిల్లా వరికుంటపాడు తహసీల్దార్ సయ్యద్ హుసేన్ బుధవారం పరిశీలించారు. వరికుంటపాడు మండలం, వేంపాడు గ్రామ రెవెన్యూ ఇలాకలో సర్వేనెంబర్ 78/1 లో 6.06 ఎకరాల మాన్యం భూమి ఉందని, దీనిపై ప్రైవేట్ వ్యక్తులకు, దేవదాయ శాఖ అధికారులకు వివాదం నడుస్తోంది. వివాదం తేలే వరకు భూమిలోకి ఇరువర్గాలు వెళ్లకుండా స్టేటస్‌కో పాటించాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ప్రైవేట్ వ్యక్తులు కోర్టు తీర్పును ఉల్లంఘిస్తూ భూమిలోకి యంత్రాలతో ప్రవేశించి హెచ్చరిక బోర్డును తొలగించి చదును చేసి ఫెన్సింగ్ రాళ్లతో హద్దులు ఏర్పాటు చేశారు. ఈ విషయం వైరల్ కావడంతో తహసీల్దార్ ఆ భూమి తాలూకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద ఉన్న పత్రాలను పరిశీలించారు.

189 పొగాకు బేళ్ల తిరస్కరణ

కొండపి, ఆగస్టు 28 : కొండపి పొగాకు వేలం కేంద్రంలో లోగ్రేడ్ రకం ధరలు గణనీయంగా తగ్గాయి. కిలోకు రూ.105 నుంచి రూ.212 లభిస్తోంది. తిరస్కరణ బేళ్ల సంఖ్య కూడా పెరిగింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం జువ్విగుంట, అయ్యవారిపాలెం, తంగెళ్ల, జాళ్లపాలెం, పీరాపురం గ్రామాల రైతులకు చెందిన బేళ్లను అధికారులు వేలానికి అనుమతించారు. వాటిలో 977 బేళ్లను మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేశారు. 189 నోబిడ్ అయ్యాయి.

50 శాతం రాయితీపై ప్లాస్టిక్ మల్చింగ్ పేపర్

పామూరు, ఆగస్టు 28 : పండ్లతోటలు సాగుచేసే రైతులకు ఉద్యానశాఖ తరఫున హెక్టారుకు ఒక ప్లాస్టిక్ మల్చింగ్ పేపర్‌ను 50 శాతం రాయితీలో అందచేస్తున్నామని ఆ శాఖ హెచ్‌వో కే కుసుమ తెలిపారు. పామూరు, సీఎస్‌పురం, పీసిపల్లి మండలాల్లో బత్తాయి, మామిడి, నిమ్మ, సపోట, సాగుచేసే రైతులకు తమ తోటల్లో ప్లాస్టిక్ మల్చింగ్ పేపర్ హెక్టార్‌కు రూ.32 వేలు కాగా, 50 శాతం రాయితీపై రూ.16 వేలకే వస్తుందని తెలిపారు. రైతులు వన్‌బీ అడంగల్, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాసుబుక్‌ను జత చేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సాగుచేసిన ప్రతి ఎకరాన్నీ గుర్తించాలి

పీసీపల్లి, ఆగస్టు 28 : రైతులు సాగు చేసిన ప్రతి ఎకరాన్ని గుర్తించాలని పీసీపల్లి తహసీల్దార్ సీహెచ్ ఉషా చెప్పారు. స్థానిక త హసీల్దార్ కార్యాలయంలో బుధవారం వీఆర్వోలు, గ్రా మ వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు.

నేడు, రేపు ఒంగోలులో రాష్ట్రస్థాయి సమావేశాలు

● వ్యవసాయ కార్మిక సంఘం ప్రధానకార్యదర్శి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 28 : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రస్థాయి విస్తృతస్థాయి సమావేశాలు గురు, శుక్రవారాల్లో ఒంగోలులోని కాపు కళ్యాణ మండపంలో జరుగుతాయని సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.వెంకటేశ్వర్లు వెల్లడించారు. స్థానిక సుందరయ్యభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ రాష్ట్ర మహాసభల్లో ఉద్యమాలపై సమీక్ష చేయడంతో పాటు భవిష్యత్ పోరాటాల కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 200 మందికి పైగా ప్రతినిధులు హాజరవుతారని, జాతీయ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎ.విజయరాఘవన్, బి.వెంకట్ ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని ఆయన తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘాన్ని 1934లో అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య స్వగ్రామమైన ఆలగానిపాడులో స్థాపించారన్నారు. దున్నేవారికి భూమి దక్కాలని, కనీస వేతన చట్టం, ఆహార భద్రత, సామాజికన్యాయం తదితర అంశాలపై సంఘం అనేక ఉద్యమాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులన్నీ కార్పొరేట్లకు తాకట్టుపెట్టే విధానాలను ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయని ఆరోపించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం పలు అంశాలపై చర్చిస్తామని పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, నెరుసుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేపు అష్టలక్ష్మి ఆలయంలో కల్యాణోత్సవం

పర్చూరు, ఆగస్టు 28 : పర్చూరులో నూతనంగా రూపుదిద్దుకుంటున్న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి సమేత అష్టలక్ష్మి దేవాలయంలో ఈనెల 30వ తేదీన శ్రీనివాస కల్యాణ మహోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు బుధవారం ప్రకటనలో తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. కల్యాణ వేడుకల్లో పీటలమీద కూర్చొనే దంపతులు ముందుగానే తమ పేర్లను ఆలయాన్ని సందర్శించి నమోదు చేసుకోవాలన్నారు.

సీఎంవో నుంచి రూ.3లక్షల సాయం

చీరాల, ఆగస్టు 28 : 27వ వార్డుకు చెందిన పీ.కీర్తి కుమార్తె అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమె వైద్య ఖర్చుల కింద సీఎంవో కార్యాలయం నుంచి బుధవారం రూ.3లక్షలకు ఎన్‌వోసీ అందజేశారు. ఆ పత్రాన్ని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య కార్యాలయ ప్రతినిధి దొర బాధితులకు అందజేశారు. వైద్య సాయం కోసం కీర్తి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కొండయ్యను కలిశారు. దీంతో ఆయన వైద్యసాయం కోరుతూ సీఎంవోకు సిఫార్సు చేశారు. ఆ క్రమంలో సీఎంవో నుంచి రూ.3లక్షలకు ఎన్‌వోసీ అందజేశారు. బాధితురాలు చికిత్స పొందుతున్న ఆసుపత్రిలో రూ.3లక్షల వరకు ఉచితంగా వైద్యం, మందులు అందజేస్తారని కార్యాలయ ప్రతినిధి దొర తెలిపారు. దీంతో బాధితులు సీఎం చంద్రబాబుకు, ఎమ్మెల్యే కొండయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.



ఎన్‌వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి

పనిచేయని ల్యాండ్ ఫోన్లు

- పలు పోలీస్ స్టేషన్‌లలో మోగని వైనం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- బకాయిల కారణంగా సర్వీసులు కట్ చేసిన బీఎస్ఎన్ఎల్



చీరాల, ఆగస్టు 28 : చీరాల డివిజన్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో ల్యాండ్ ఫోన్లు పనిచేయడంలేదు. టెలికం డిపార్ట్‌మెంట్‌కు బకాయిలు చెల్లించకపోవడంతో ఫోన్ సర్వీస్‌లకు బీఎస్ఎన్ఎల్ నిలిపివేసినట్లు చెప్తున్నారు. దీంతో అవగాహన ఉన్నవారు 100కు డయల్ చేసి తమ ఫిర్యాదులు చెప్తున్నారు. అత్యవసర పరిస్థితులయితే 100కు కాల్ చేసిన వారి వివరాలు, సంఘటన, ప్రదేశంతో సంబంధిత పోలీస్ స్టేషన్లకు సమాచారం పంపుతున్నారు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బంది స్పందిస్తున్నారు. అంత వరకు బాగానే ఉంది. అయితే అసాంఘిక శక్తుల ఆగడాలు, గ్రామాల్లో జరిగే ఘర్షణలు, మత్తు పదార్థాలు సేవించిన నేపథ్యంలో జరిగే ఘర్షణలు తదితరాలకు సంబంధించి ముందస్తుగా పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసి ప్రాథమిక సమచారం అందించేందుకు ప్రజలు పోలీస్ స్టేషన్‌కు ఉండే ల్యాండ్ లైన్ ఫోన్ నెంబర్లకు ఎక్కువగా అలవాటు పడి ఉంటారు. అయితే గత కొంత కాలంగా పోలీస్ స్టేషన్ ల్యాండ్ లైన్లకు ఫోన్ చేస్తుంటే కవలడం లేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొందరు అసాంఘిక శక్తుల సమాచారం అందించేందుకు సెల్ ఫోన్ కన్నా ల్యాండ్ లైన్ అయితే తమకు ఇబ్బంది లేకుండా ఉంటుందని భావిస్తున్నారు. సెల్ ఫోన్ ద్వారా ఆ స్టేషన్ హౌస్ ఆఫీసర్, రైటర్, కానిస్టేబుల్, హోమ్‌గార్డ్, స్పెషల్ బ్రాంచ్, ఇంటిలిజెన్స్ తదితర విభాగాల వారికి ఏదన్నా సమాచారం అందిస్తే తమ నెంబరు వారి సెల్‌ఫోన్లలో డిస్‌ప్లే అవుతుందని, దీంతో తమకేదన్నా ఇబ్బందులు ఎదురవుతుయని సందేహించి సమాచారం తెలిపేందుకు వెనకడుగు వేసే అవకాశం కూడా ఉంది. అది ఏ పోలీస్ స్టేషన్ అయినా ల్యాండ్ లైన్ నెంబరు ఎప్పుడు ఒకటే ఉంటుంది. అయితే డిపార్ట్‌మెంట్‌లో ఎస్సై, ఆపై స్థాయి అధికారుల నెంబర్లు ఎవరు బదిలీపై వచ్చినా ముందు పనిచేసిన అధికారి నంబరే వారికి ఉంటుంది. కాబట్టి పెద్ద సమస్యలేదు. అయితే అందరూ ఎస్సై, ఆ పై స్థాయి అధికారులకు ఫోన్ చేసేంత అవగాహన ఉండదు. అందరూ అలా చేసినా వారికి ఉండే పనివత్తిడితో ఆ ఫోన్‌కాల్స్‌కు కొన్ని సందర్భాల్లో సమాధానం చెప్పే పరిస్థితి ఉండదు. ఇక కింద సిబ్బంది మారినపుడు వారి కొత్త నెంబర్లు సాధారణ పౌరులకు తెలిసే అవకాశం ఉండదు. అదే పక్కాగా ల్యాండ్ ఫోన్లు పనిచేస్తుంటే ఎప్పుడు ఒకే నెంబరు ఉంటుంది కాబట్టి తమ సమస్యలు తెలిపేందుకైనా, లేదా సమాచారం తెలిపేందుకైనా అనుకూలంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మార్జిన్‌లు దాటి రోడ్డుపైకి

తోపుడు బండ్లతో ట్రాఫిక్‌కు ఇక్కట్లు

అద్దంకి, ఆగస్టు 28 : అద్దంకిలో అసలే ఇరుకు రోడ్లు.. ఆపై రోడ్డు మార్జిన్‌లు ఆక్రమణలతో ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ఇది చాలదన్నట్లు ఏకంగా రోడ్ల మధ్యలోనే తోపుడు బండ్లను ఏర్పాటు చేసి అమ్మకాలు చేస్తుండడంతో మరిన్ని ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ప్రధానంగా నిత్యం రద్దీగా ఉండే మున్సిపల్ కార్యాలయం రోడ్డు, బంగ్లా రోడ్డులలో సెంటర్ డివైడర్‌లు ఉండగా జంక్షన్‌ల వద్ద రోడ్ల మధ్యలోనే తోపుడు బండ్లు ఉంచి వ్యాపారాలు చేస్తున్నారు. మున్సిపల్ కార్యాలయం రోడ్డులో పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద, మున్సిపల్ కార్యాలయం వద్ద ఐమాస్ లైట్ వద్ద తోపుడు బండ్లు ఏర్పాటు చేసి అమ్మకాలు చేస్తున్నారు. అలాగే బంగ్లా రోడ్డులో అంబేడ్కర్ వి గ్రహం వద్ద కూడా తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకొని కూరగాయలు, పండ్లు అమ్మకాలు చేస్తున్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద నాలుగు రోడ్ల కూడలి కావడం, మార్జిన్‌లు ఆక్రమణలకు గురి కావడంతోపాటు రోడ్డు మధ్యలో తోపుడు బండి ఏర్పాటు చేసి వ్యాపారాలు చేస్తుండడంతో ఆ రోడ్డులో వాహనాలు మలుపు తిరిగే సమయంలో ఇబ్బం దులు పడుతున్నామని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్, పోలీస్ అధికారులు స్పదించి రోడ్లపై తోపుడు బండ్లు వ్యాపారాలు నిర్వహించకుండా చేయాలని వాహనచోదకులు, ప్రజలు కోరుతున్నారు.



తనిఖీ చేస్తున్న వేటపాలెం ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది

నిబంధనలు తప్పకుండా పాటించాలి

వాహనదారులకు ఎస్ఐ సూచన

వేటపాలెం(చీరాల), ఆగస్టు 28 : వాహన చోదకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని ఎస్ఐ వెంకటేశ్వర్లు చెప్పారు. వారానికోసారి నిర్వహించే ప్రత్యేక తనిఖీల్లో భాగంగా బుధవారం ఎస్ఐ తన సిబ్బందితో కలసి 216 జాతీయ రహదారిలో వేటపాలెం క్రాస్ రోడ్డు వద్ద వాహనాలను ఆపి తనిఖీలు నిర్వహించారు. సుమారు 40 వాహనాలను తనిఖీ చేశారు. వారిలో హెల్మెట్, లైసెన్స్‌లు లేనివారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఫోర్‌వీలర్స్ నడిపే వారు విధిగా నిబంధనలు పాటించాలని ఎస్ఐ సూచించారు.

ఎస్ఐ మాల్యాద్రి బాధ్యతల స్వీకరణ



పర్చూరు, ఆగస్టు 28 : పర్చూరు ఎస్ఐగా జాజుల మాల్యాద్రి బుధవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు జిల్లా, రాపూరు ఎస్సైగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా పర్చూరు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్.రమేష్ చినగంజాంకు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన ఎస్ ఐకి ఏఎస్ఐ సురేష్‌రెడ్డి, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ శాంతి భద్రతల పర్యవేక్షణలో ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు

కారంచేడు(పర్చూరు) అగస్టు 28 : అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలించే వారిపై చర్యలు తీసుకోక తప్పదని కారంచేడు ఎస్ఐ వెంకట్రావు అన్నారు. బుధవారం చీరాల వైపు నుంచి కారంచేడు మీదుగా ఎలాంటి అనుమతులు లేకుండా వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



పంగులూరు, ఆగస్టు 28 : మండలంలోని రేణంగివరం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జంద్రాజుపల్లి మరియదాసు (38) మృతి చెందాడు. ఎస్ఐ వినోద్‌బాబు అందించిన సమాచారం మేరకు బల్లికురవ మండలం కొణిదెన గ్రామానికి చెందిన జంద్రాజుపల్లి మరియదాసు, నవీన్ బైకుపై ఒంగోలు వైపు నుంచి మార్టూరు వైపు వెళుతుండగా రేణంగివరం ఫ్లైవోవర్‌పై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మరియదాసుకు రెండు కాళ్లు విరిగి తీవ్రగాయాలు కాగా నవీన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్ఐ వినోద్ వారిని 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ మరియదాసు మృతి చెందగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జేవీపాలెం వద్ద

మండలంలోని జాగర్లమూడివారిపాలెం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ. వినోద్ బాబు తెలిపిన వివరాలివి. ఇంకొల్లు మండలం నక్కలపాలెం గ్రామానికి చెందిన మద్దిరాల సురేష్ గుళ్లాపల్లి గ్రోత్ సెంటర్లో విధులు ముగించుకుని బైకుపై ఇంటికి బయలుదేరారు. ద్విచక్ర వాహనంపై వెలుతున్న సురేష్‌ను ఒంగోలు వైపు నుంచి చిలకలూరిపేట వైపు వెలుతున్న కారు వెనుక వైపు నుంచి ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. గాయపడిన సురేష్‌ను 108లో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ ఇచ్చిన సమాచారంతో మార్టూరు మొబైల్ పోలీసులు కారును బొల్లాపల్లి టోల్‌ప్లాజా వద్ద అడ్డుకొని వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చోరీపై కేసు నమోదు

అద్దంకి, ఆగస్టు 28 : తాళం వేసి ఉన్న ఇంట్లో జరిగిన చోరీపై బుధవారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలివి. అద్దంకి పట్టణంలోని శ్రీనగర్ కాలువ కట్ట సమీపంలో తోట వెంకట శివ నాగేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం శ్రీశైలం వెళ్లారు. సోమవారం ఇంటికి వచ్చి చూడగా, తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో బీరువాలో ఉన్న 500 గ్రాముల వెండి చెంబు, ఇతర వస్తువులు, 10 గ్రాముల బంగారం, 8వేల రూపాయల నగదు అపహరణకు గురయ్యాయి. బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ ప్రవీణ కేసు నమోదు చేసి చేశారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

మార్టూరు, ఆగస్టు 28 : జాతీయ రహదారిపై మండల పరిదిలో జొన్నతాళి క్రాస్ రోడ్డు వద్ద ఈనెల 24వ తేదీన కారు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన పసుమర్తి డానియేలు (69) గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందారు. డానియేలు పెద్ద కుమార్తె మరియమ్మ ఫిర్యాదు మేరకు శవపంచానామా, పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు ఏఎస్ఐ సైదా తెలిపారు. మండలంలోని ఇసుకదర్శి గ్రామానికి చెందిన డానియేలుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

కోలలపూడిలో కొండచిలువ

మార్టూరు, ఆగస్టు 28 : మండలంలోని కోలలపూడి గ్రామంలో మామిడి తోటలో 10 అడుగుల పొడవు ఉన్న కొండచిలువను గ్రామస్థులు బుధవారం గుర్తించారు. గ్రామం నుంచి తాటివారిపాలెం వెళ్లే దారిలో ఇంటికి సమీపంలో కొండప్రాంతంలో ఉన్న ఒక మామిడితోటలో కొండచిలువ కోడిని పట్టుకోవడం చూశారు. తిన్న తర్వాత అక్కడే ఉండడంతో సర్పంచ్ సతీష్ కుమార్ సమాచారాన్ని అటవీ శాఖ అధికారులకు ఇచ్చారు. దాంతో అద్దంకి నుండి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె.రమేష్ సిబ్బందితో వచ్చారు. తదుపరి కొండచిలువను గోనెసంచిలో భద్రపరచి దానిని నాగరాజుపల్లి ఫారెస్ట్ ఏరియాలో వదిలివేశారు.

అర్హులందరికీ పథకాలు అందించాలి

పంగులూరు, ఆగస్టు 28 : అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ధూళిపాళ్ల రమాదేవి అన్నారు. బుధవారం పంగులూరులో గుడిపాటి మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో రమాదేవి మాట్లాడారు. జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో విసుగుచెందిన ప్రజలు అధికార మార్పును కోరుకున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు రాయిణి వినోద్‌బాబు, తలపనేని రామారావు, సుబ్బరాజు, కృష్ణకుమారి, ఏలియా పాల్గొన్నారు.

హెచ్ఐవీ నిర్మూలనకు కృషి చేయాలి

అద్దంకిటౌన్, ఆగస్టు 28: హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు అవగాహన కల్పించి కృషి చేయాలని ఎస్ఐ సీహెచ్ ప్రవీణ అన్నారు. బుధవారం అద్దంకిలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో హెల్త్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ నిర్మూన లక్ష్యంతో రూపొంచిన మీకు తెలుసా ఐసీహెచ్ అవగావహన కార్యక్రమం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ ప్రవీణ మాట్లాడుతు మంచి లక్ష్యంతో ఎయిడ్స్, హెచ్ఐవీ నియంత్రణ కోసం కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, పీడీ డేవిడ్‌రాజు, సంస్థ డైరెక్టర్ టీవీ సాగర్, కరుణ, శ్రావణి, మల్లేశ్వరి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐ ప్రవీణ

బదిలీలపై బలనిరూపణ

- ఎన్నికలు జరగని పంచాయతీలలో నిధుల వినియోగంపై ఆరా
- ప్రక్షాళనలో ఎవరి పాపాలు.. ఎవరికి శాపాలు
- కొందరు ద్వితీయ శ్రేణి నాయకులతో రాయబేరాలు

చీరాల, ఆగస్టు 28 : చీరాల నియోజకవర్గ పరిధిలో పంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బందిలో ఎక్కువ మంది బల నిరూపణకు దిగుతున్నారు. తాము ఎక్కడ పనిచేస్తున్నామో, అక్కడ కొలువులను కొనసాగించే విధంగా ఎమ్మెల్యే సిఫార్స్ చేయాలని కూటమి నాయకుల్లో తమకు అనుకూలమైన వారితో ఎమ్మెల్యేపై ఒత్తిడి తెస్తున్నారు. గ్రామాల పునర్విభజనలో భాగంగా నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో చీరాల నియోజకవర్గంలో వేటపాలెం మండలం రామన్నపేట పంచాయతీకి తప్ప మిగిలిన ఏ పంచాయతీకి ఎన్నికలు జరగలేదు. చీరాల, వేటపాలెం మండలాలకు సంబంధించిన జడ్పీటీసీ ఎన్నికలు మాత్రం జరిగాయి. ఈ క్రమంలో రామన్నపేట మినహా నియోజకవర్గంలో మిగిలిన 23 పంచాయతీలకు పాలకవర్గాలు లేవు. అధికారులు, ప్రత్యేక అధికారులతోనే పాలన కొనసాగుతోంది. నిధుల వినియోగంలో పారదర్శకత లోపిస్తోందని, పాలన కుంటుపడుతోందని పలువురు గతం నుంచి విమర్శలు చేస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా పంచాయతీలకు సంబంధించిన సెక్రటరీలు, వీర్వోలు, సచివాలయ సిబ్బంది ప్రస్తుతం ఎక్కడ పనిచేస్తున్నామో అక్కడే కొనసాగించాలని తమకు అనుకూలమైన కొంతమంది ద్వితీయ శ్రేణి నాయకులతో రాయబేరాలు నడుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటి వరకు పనిచేసినవారు అదే పంచాయతీలో ఉంటే వారి తప్పులు బయట పడకుండా జాగ్రత్త పడతారని, కచ్చితంగా వారిని మార్చాలని ఎమ్మెల్యే కొండయ్య భావిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో తమను బదిలీ చేసినా నియోజకవర్గంలోనే మరో పంచాయతీకి బదిలీ చేయాలని కూడా కొందరు కోరుతున్నట్లు తెలుస్తోంది. గత కొన్ని రోజులుగా బదిలీలకు సంబంధించిన సిఫార్స్‌ల క్రమంలో నెలకొన్న పరిస్థితులను గమనించిన ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. గతంలో ఎక్కడ పనిచేశారో వారిని అక్కడ ఉంచకుండా బదిలీ చేయించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. దీంతో పాటు ఆరోపణలు వచ్చిన పంచాయతీలలో విజిలెన్స్ విచారణకు కూడా సిఫార్స్ చేయాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఎక్కడ తమ తప్పులు వెలుగులోకి వస్తాయోనని, తప్పులు చేసినవారు భుజాలు తడుముకుంటున్నారు. ఈ నేపేథ్యంలో ప్రక్షాళనలో భాగంగా ఎవరి పాపాలు, ఎవరికి శాపాలుగా మారనున్నాయనే అంశాలపై ప్రస్తుతం జనాల్లోను, రాజకీయవర్గాల్లోను జోరుగా చర్చ సాగుతోంది.

బీజేపీలో చేరిన వైసీపీ నేతలు



పురందేశ్వరి సమక్షంలో పార్టీలో చేరుతున్న వైసీపీ నాయకులు

అద్దంకి, ఆగస్టు 28 : అద్దంకి నియోజకవర్గంలోని పలు గ్రామాల వైసీపీ నేతలు బుధవారం విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. పీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ జాగర్లమూడి యలమందరావు, జాగర్లమూడివారిపాలెం సర్పంచ్ వెంకటరత్నం, జడ్పీటీసీ మాజీ సభ్యుడు జంద్రాజుపల్లి మాతయ్య, పలు గ్రామాలకు చెందిన నల్లపనేని శ్రీనివాసరావు, యలమందరావు, మారెడ్డి శ్రీనివాసరెడ్డి, గుర్రం నాగేశ్వరరావు, పల్లకి శ్రీనివాసరెడ్డి, బండి ఓబుల్‌రెడ్డి, దూళిపాళ్ల చంద్రరావు, జాగర్లమూడి శ్రీరామమూర్తి, కొప్పుల రామారావు, బుల్లిరెడ్డి, మేడికొండ మోషేబాబు తదితరులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, పరుచూరి శ్రీనివాసరావు, కొండముది బంగారుబాబు, తమ్మన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

చినగంజాం, ఆగస్టు 28 : ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.దేవదత్తం అన్నారు. మండలంలోని పెదగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన ఇండేన్ గ్యాస్ ఏజన్సీ డీలర్ మువ్వల శ్రీనివాసరావు బుధవారం హ్యాండ్ మైక్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ దాత గతంలో పాఠశాలకు వాటర్‌కూలర్ ఫ్రిజ్, అనేక పర్యాయాలు విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు తెలిపారు. రూ.18 వేల రూపాయిలు విలువ చేసే అహూజా బిటీఏ-880 కంపెనీ హ్యాండ్ మైక్ సెట్‌ను దాత శ్రీనివాసరావు పాఠశాలకు అందజేశారు. దాతని పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ ఎ.సుదర్శనరెడ్డి, హెచ్.ఎం, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల పీ.డీ. ఎం.అనిల్ కుమార్, ఉపాధ్యాయులు డి.నారాయణరెడ్డి, బి.నాగేశ్వరరావు, ఎ.సుబ్బారావు, బి.చెంచురెడ్డి, పి.బ్రహ్మయ్య, ఎస్.శ్రీరమణ, జిహవీల దేవి, ఎస్.రవణమూర్తి, షేక్.సుభాని భాష, ఎం.రవిచంద్రరామ్, ఎం.రాజశేఖర్, డి.సుబ్బారావు, డి.ఆశాలత, ఎం.కుమార్, కే.జెస్సీఉదయిని, సుబ్రమణ్యం, రవిదేవరాజులు పాల్గొన్నారు.



దాత శ్రీనివాసరావుని సన్మానిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

తక్కెళ్లపాడు తాగు నీటి ప్రాజెక్ట్ పరిశీలన

- ఫిల్టర్ బెడ్ల మరమ్మతులకు ఆదేశం
- ఇంటింటికీ నీటి సరఫరా పునరుద్ధరించేందుకు చర్యలు
- ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రామస్వామి



తాగు నీటి ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రామస్వామి

పంగులూరు, ఆగస్టు 28 : మండలంలోని తూర్పుతక్కెళ్లపాడు తాగునీటి ప్రాజెక్ట్‌ను ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రామస్వామి బుధవారం పరిశీలించారు. మంగళవారం ఆంధ్రజ్యోతి జిల్లా పేజీలో ప్రచురితమైన తక్కెళ్లపాడు గ్రామస్థులకు ఎక్కిళ్లు అనే కథనంపై స్పందించిన బాపట్ల ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రామస్వామి డివిజన్, మండల స్థాయి అధికారులతో కలసి మంచినీటి ప్రాజెక్ట్ వద్ద ఫిల్టర్ బెడ్‌ల పరిస్థితితో పాటు నీటి నిల్వ కోసం నిర్మించిన మంచి నీటి చెరువును పరిశీలించారు. ఒక ఫిల్టర్ బెడ్ తుంగతో నిండి ఉండడం, మరో ఫిల్టర్ బెడ్‌లో ఇసుక మార్చక పోవడంతో సరిగా వినియోగంలో లేని పరిస్థితిని పరిశీలించిన ఈఈ తక్షణమే మరమ్మతు చర్యలు చేపట్టి వినియోగంలోకి తేవాలని ఏఈ శివయ్య, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. రక్షిత మంచినీటి ట్యాంక్ పరిసరాలు శుభ్రంగా ఉంచాలని, ట్యాంక్ పరిసరాలలో లీకులు లేకుండా పైప్‌లైన్‌కు తగిన మరమ్మతులు చేపట్టాలని సూచించారు.

ఇంటింటికీ నీరిస్తాం

తూర్పు తక్కెళ్లపాడు గ్రామంలో పైప్‌లైన్ విస్తరణ, ట్యాప్‌ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని, గ్రామంలో ఇంటింటికీ నీటి సరఫరా కోసం తగిన చర్యలు చేపడతామని రామస్వామి తెలిపారు. గ్రామ ఎస్సీ కాలనీలో జేజేఎం నిధులు 18.7 లక్షలతో పైప్‌లైన్ పునరుద్ధరణ, ట్యాప్‌ల ఏర్పాటు పనులు జరుగుతున్నట్లు తెలిపారు. గ్రామంలో పూర్తి స్థాయిలో పైప్‌లైన్ నిర్మాణానికి రూ.37.7లక్షల జేజేఎం నిధులు మంజూరై ఉన్నాయని, టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు చేపడతామని ఈఈ తెలిపారు. మంచినీటి చెరువులో కంప తొలగింపు, పూడికతీత పనులు ఎన్ఆర్‌జీఎస్ ద్వారా చేపట్టడం జరుగుతందన్నారు. వీరి వెంట డీఈ వి.వేణుగోపాల్, ఏఈ శివయ్య, కార్యదర్శి రజనీ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరం

ఎమ్మెల్యే కొండయ్య



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, గౌరీఅమర్‌నాథ్

చీరాల, ఆగస్టు 28 : ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మండల పరిధిలోని పిట్టువారిపాలెంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంకు ఎమ్మెల్యే కొండయ్య, ఆయన కుమారుడు గౌరీఅమర్‌నాథ్ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. బుధవారం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శాస్త్రోక్తంగా శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. కొండయ్య మాట్లాడుతూ ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తాము అన్ని విధాలా అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

చక్కగా చదవాలి..ఉన్నతంగా ఎదగాలి

పేద, ధనిక తారతమ్యం లేకుండా ఉన్నత స్థితికి చేరేందుకు చదువు చక్కటి సోపానమన్న విషయాన్ని విద్యార్థులు గుర్తెరగాలన్నారు. వాడరేవు జడ్పీ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన సభా వేదికను ఎమ్మెల్యే కొండయ్య ప్రారంభించారు. కార్యక్రమానికి లలితానంద ఆశ్రమ పీఠాధిపతి రామానంద సరస్వతి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంఈవో సుబ్రమణ్యేశ్వరరావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కారకర్తలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

వేటపాలెం మండలం రామాపురం పరిధిలో నూతనంగా నిర్మించిన టీ2 రిసార్ట్స్‌ను బుధవారం ఎమ్మెల్యే కొండయ్య, గౌరీఅమర్‌నాథ్ ప్రారంభించారు. రిసార్ట్స్ నిర్వహణలో జాగ్రత్తలు పాటించి, పర్యాటకులకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు.



పరీక్షలు చేస్తున్న వైద్యుడు

250 మందికి వైద్య పరీక్షలు

చినగంజాం, ఆగస్టు 28 : చినగంజాం గ్రామంలోని హనీ మెడికిల్స్, శ్రీనివాస క్లినిక్ వారి సహకారంతో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ వారు అంబేడ్కర్ సెంటర్‌లో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు కిమ్స్ హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ తెలిపారు. పలు వ్యాధులకు సంబంధించి 80 మందిని ఒంగోలు కిమ్స్ హాస్పిటల్‌కు రిఫర్ చేసినట్లు తెలిపారు. 80 మందికి ఆరోగ్యశ్రీ, ఈఎస్ఐ, ఈహెచ్ఎస్, ఈసీహెచ్ తదితర కార్డుల ద్వారా ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో పలు వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు, కంటి సంబంధించిన పరీక్షలు, ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు చేసినట్లు తెలిపారు. మందులు ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. వైద్య పరీక్షల కోసం వచ్చిన వారికి వైద్య సిబ్బంది గుండె, కిడ్నీ, విష జ్వరాలు తదితర వ్యాధులపై అవగాహన కల్పించి, తగు జాగ్రత్తలు, సలహాలు సూచించారు. వైద్య శిబిరంలో డాక్టర్ రామాంజనేయులు, ఆప్తమాలజిస్ట్ లత, కిమ్స్ హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సీసీ రోడ్డును వేస్తున్న కార్మికులు

గొల్లపాలెంలో సీసీ రోడ్డు

ఇంకొల్లు, ఆగస్టు 28 : మండలంలోని ఇంకొల్లు పంచాయతీ పరిధిలోని గొల్లపాలెం గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.14లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. వెనిగండ్ల ప్రభాకర్ ఇంటి నుంచి కేతమాల వెంకటస్వామి ఇంటి వరకు 280 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు మెంబరు వెనిగండ్ల శ్రీకాంత్,డీఈ శ్రీనివాసరావు, ఏఈ రామకృష్ణ, కాంట్రాక్టరు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వైద్య సేవలు

ఇంకొల్లు, ఆగస్టు 28 : వంకాయలపాడులో రెండవరోజు ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య సేవలు కొనసాగుతున్నాయి. సిబ్బంది వైద్య సేవలందించారు. గ్రామంలో ఇంటింటి తిరిగి వైద్య పరీక్షలతో పాటు రోగనిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. 41 మందికి పరీక్షలు చేసి చికిత్సను అందించారు. మందులను అందజేశారు. డాక్టర్ అంజలి, డా.భానుప్రకాశరావు, ఏఎస్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డివైడర్‌పైకి ఎక్కిన కారు

బల్లికురవ, ఆగస్టు 28 : వైదన వద్ద నామ్ రోడ్డు డివైడర్ పైకి కారు ఎక్కింది. స్థానికులు తెలిపిన వివరాలివి. బుధవారం నామ్ రోడ్డులో వేగంగా వస్తున్న లారీని గమనించిన డ్రైవర్ కారును డివైడర్ పైకి ఎక్కించాడు. కారులో ఉన్న కొమ్మినేనివారిపాలెంకు చెందిన జడ్పీటీసీ సభ్యులు చింతల అంజలి భర్త శ్రీనివాసరావుతో పాటు మరో ఇద్దరు క్షేమంగా బయటపడ్డారు. కారు ముందుభాగం పూర్తిగా దెబ్బతింది.

రూ.2,139 కోట్లతో క్రిస్ సిటీ

- 2,500 ఎకరాల్లో పారిశ్రామికవాడ ఏర్పాటు
- రూ.10,500 కోట్ల పెట్టుబడులు రాబట్టడమే లక్ష్యం
- పరిశ్రమలకు రాయితీలు ఇస్తామన్న ప్రభుత్వం
- 98 వేల మందికి ఉపాధి కల్పన

నెల్లూరు (ఆంధ్రజ్యోతి), ఆగస్టు 28 : రూ.2139 కోట్లతో క్రిస్ సిటీ (కృష్ణపట్నం ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ)ను ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు సంబంధించిన నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమైనట్లు వెల్లడించింది. వికసిత భారత్ లక్ష్యంలో భాగంగా దేశవ్యాప్తంగా 12 ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలను కేంద్రం అభివృద్ధి చేస్తోంది. ఇందులో కృష్ణపట్నం పారిశ్రామిక వాడ కూడా ఎంపికైంది. చెన్నై-విశాఖ, చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లను అనుసంధానం చేస్తూ క్రిస్ సిటీ రూపుదిద్దుకుంటోంది. భారత తూర్పు తీరంలో క్రిస్ సిటీ అతిపెద్ద పారిశ్రామిక వాడగా రూపాంతరం చెందనుంది. మొత్తం 2500 ఎకరాల్లో కృష్ణపట్నం పారిశ్రామిక ప్రాంతాన్ని కేంద్రం అభివృద్ధి చేయనుంది. కృష్ణపట్నం పోర్టుకు అనుసంధానిస్తూ నిర్మించబోతున్న ఈ పారిశ్రామిక వాడలో రూ.10,500 కోట్ల పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా నిర్దేశించారు. సుమారు 98వేల మందికి ఉపాధి కల్పనకు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్, ఆగ్రో ప్రాసెసింగ్, ఫార్మా సిటికల్స్, టెక్స్‌టైల్ పరిశ్రమలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు కేంద్రం ప్రకటించింది. క్రిస్ సిటీలో ఏర్పాటు చేయబోయే పరిశ్రమలకు రాయితీలు కూడా ఇవ్వనున్నట్లు వెల్లడించింది.

పంచాయతీ కార్యదర్శులకు రేపటి నుంచి బదిలీల కౌన్సెలింగ్

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 28: జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల బదిలీలకు ఈ నెల 30, 31వ తేదీలలో కౌన్సెలింగ్ చేపడుతున్నట్లు డీపీవో సుస్మితారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రేడ్-5 ఉద్యోగులు 160మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారని, వారందరికీ 30న ఉదయం పది గంటల నుంచి జడ్పీ కార్యాలయంలో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. అలాగే గ్రేడ్-4డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు 176 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరందరికీ 31న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీల ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు.

సెబ్ కథ ముగిసింది!

- ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో విలీనం
- బాణసంచా కాల్చిన అధికారులు

నెల్లూరు (క్రైం), ఆగస్టు 28 : గత ప్రభుత్వంలో ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసు శాఖను సమ్మేళనం చేస్తూ తీసుకువచ్చిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) కథ ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అమరావతిలో నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో సెబ్‌ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఒక టీ రెండు రోజుల్లో ఉత్తర్వులు జారీ కానున్నాయి. సెబ్‌లో నిజాయితీగా విధులు నిర్వహిస్తున్న పలువురు ఎక్సైజ్ అధికారులు సెబ్ రద్దు కావడంతో ఆయా పోలీసు స్టేషన్ పరిధిలలో టపాసులు కాల్చి పండుగ చేసుకున్నారు. అయితే సెబ్ ఏర్పడిన తరువాత అవినీతే హద్దుగా చెలరేగిపోయిన అధికారులు మాత్రం తమ బాధను ఎవరికి వ్యక్తం చేసుకోవాలో తెలియక వారిలో వారే కుమిలిపోతున్నారు.



ఎక్సైజ్ జిల్లా కార్యాలయంలో టపాసులు కాలుస్తున్న సిబ్బంది

ఇసుక కొరత రానీయొద్దు : జేసీ

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఆగస్టు 28 : జిల్లాలో గుర్తించిన ప్రదేశాల్లో డీసిల్టేషన్ ప్రక్రియ ద్వారా ఇసుక సరఫరా చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని, కొరత అనే మాట రానీయొద్దని జాయింట్‌కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో డీసిల్టేషన్ ప్రక్రియ చేపట్టేందుకు ఆసక్తి ఉన్న వారితో జేసీ సమావేశమయ్యారు. ప్రజలకు ఇసుక కొరత లేకుండా వెంటనే డీసిల్టేషన్ పద్ధతిలో ఇసుక సరఫరా ప్రారంభించాలన్నారు. నెల్లూరు, సంగం బ్యారేజీలతోపాటు సూరయపాళెం ప్రాంతాల నుంచి ట్రెడ్జింగ్ చేసి ఇసుకను అందించాలన్నారు. పూర్తి పారదర్శకంగా బిల్లింగ్ విధానంలో ఇసుక సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మైనింగ్ శాఖ డీడీ శ్రీనివాసకుమార్, ఆర్డీవో చందర్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో సెస్ బకాయిలు రూ.40 కోట్లు

సంగం, ఆగస్టు 28 : జిల్లాలో గ్రంథాలయాలకు సుమారు రూ.40.45 కోట్ల మేర సెస్ బకాయిలు ఉన్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్ రాజా తెలిపారు. బుధవారం సాయంత్రం సంగంలోని గ్రంథాలయాన్ని పరిశీలించి, పలు రికార్డులను తనిఖీ చేశారు. పుస్తకాలను పరిశీలించి గ్రంథాలయాధికారికి రవీంద్రనాథ్‌రెడ్డికి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా కుమార్‌రాజా మాట్లాడుతూ జిల్లాలో ఒక్క కార్పోరేషన్ నుంచే సుమారు 34.45 కోట్ల సెస్ బకాయి ఉన్నట్లు తెలిపారు. పంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి మరో రూ.6 కోట్లు ఉన్నట్లు చెప్పారు. అలాగే సిబ్బంది కొరతతోపాటు 12 గ్రంథాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వీటిని అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మరోవైపు గ్రంథాలయాలకు పాఠకుల రాక పెరగడంతో దిన పత్రికలతో పాటు, వార పత్రికలు తెప్పిస్తున్నట్లు చెప్పారు.

31నే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 28 : సెప్టెంబరు నెల సామాజిక పెన్షన్లను ఈ నెల 31నే పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 1వ తేదీ ఆదివారం సెలవు కావడంతో ఒక రోజు ముందుగానే పెన్షన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. 31న పెన్షన్లు అందుకోలేని వారికి 2వ తేదీన ఇవ్వనున్నట్లు తెలిపారు.

నా జీతభత్యాలు ఇవ్వండి!

- 19 నెలలకు రూ.4.43 లక్షల బకాయి
- అంతవరకు 'కృష్ణాష్టమి' వేడుకలకు సహకరించను
- ఈవోలకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు
- వేణుగోపాలస్వామి ఆలయ ప్రధాన అర్చకుడి ఆవేదన

ఉలవపాడు, ఆగస్టు 28 : వేణుగోపాల స్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకల నిర్వహణకు సహరించేది లేదని ఆ ఆలయ ప్రధాన అర్చకుడు చక్రవర్తుల రంగనాథాచార్యులు భీష్మించి కూర్చున్నారు. కృష్ణాష్టమి సందర్భంగా స్వామివారికి పల్లకి, ఊంజల్ సేవతోపాటు ఆలయ ప్రాంగణంలో భక్తుల నడుమ ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలు బుధవారం జరగవలసి ఉండగా తాను సహకరించనని ప్రధాన అర్చకుడు తేల్చి చెప్పారు. 19 నెలలుగా తనకు జీత భత్యాల కింద రూ.4,43,780 చెల్లించాల్సి ఉందని తెలిపారు. అంతవరకు స్వామి వారికి నిత్యకైంకర్యాలు ఆగకుండా జరుపుతానని సిబ్బందికి తేల్చి చెప్పారు. జీతంతో పాటు యేటా జరిగే బ్రహ్మోత్సవాలు, పవిత్రోత్సవాలకు అదనపు అర్చకులు, స్వాములు, పూజా ద్రవ్యాలు, వస్త్రాలు తన సొంత సొమ్ముతో జరిపించినట్లు తెలిపారు. అప్పట్లో ఈవోలు జానకమ్మ, కేవీపీ ప్రసాద్‌లు ఆడిట్ పూర్తికాగానే బకాయి చెల్లిస్తామని చెప్పి కాలం గడుపుకొచ్చారని వాపోయారు. దేవస్థానం ఆదాయం లక్షల్లో వస్తున్నా తనకి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆవేదన చెందారు. ఇదే విషయాన్ని దేవదాయ శాఖ కమిషనర్ సత్యన్నారాయణకు మంగళవారం వాట్సప్ మెసేజ్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



ఉలవపాడులోని వేణుగోపాలస్వామి ఆలయం

అడుగడుగునా ఆటంకాలే..!

ఆటలకు పునాది పాఠశాలల్లోనే. ఆటలకు ఓనమాలు దిద్దుకుని అంచెలంచెలుగా ఎదిగేందుకు అవసరమైన వాతావరణాన్ని పాఠశాలలకు కల్పించాలి. కానీ విద్యారంగంలో పెరిగిన పోటీ, కార్పొరేట్‌ల కలుషితం, సరైన ప్రణాళిక లేకపోవడం తదితర అంశాల కారణంగా పోటీలు నిస్సారంగా ముగుస్తున్నాయి. యేటా పాఠశాల, మండల, జోన్ స్థాయి, జిల్లాస్థాయి, క్రీడోత్సవాలను జరిపి క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీయాల్సిన అధికారులు వారి బాధ్యతలను పూర్తిగా విస్మరించారన్న విమర్శలు ఉన్నాయి. నిధుల కొరతతో పాఠశాల క్రీడలు కొట్టుమిట్టాడుతున్నాయి. క్రీడల నిర్వహణకు కృషి చేయాల్సిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర బాధ్యులు సకాలంలో షెడ్యూల్ విడుదల చేయకపోవడంతో ఆటలు అటకెక్కుతున్నాయి. ఆటలపై పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థ లేకపోవడంతో నిర్వహణా కార్యదర్శులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారుతోంది. విద్యాశాఖకు వీటిపై పట్టు లేకపోవడంతో క్రీడావ్యవస్థ నిర్వీర్యమైపోతోంది. ఇప్పటికైనా అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు సమన్వయంతో వ్యవహరించి జిల్లా పాఠశాలల క్రీడా వ్యవస్థను గాడిలో పెట్టాల్సిన అవసరం ఉందని క్రీడా ప్రముఖులు కోరుతున్నారు.



విడవలూరులో కేవీకే భవన నిర్మాణ దుస్థితి

- వైసీపీ తీరుకు నిలువుటద్దం

కందుకూరు జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం కోసం రూ.60 లక్షల మంజూరు కాగా 2018, డిసెంబరులో పనులు ప్రారంభించారు. దాదాపు సగం పనులు పూర్తయ్యేసరికి రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటం, అధికారం చేపట్టిన వెంటనే ప్రభుత్వం తీసుకున్న విధ్వంసక నిర్ణయాలలో భాగంగా ఈ పనులను రద్దు చేశారు. దీంతో స్టేడియం అసంపూర్తిగా నిలిచిపోయింది. గడిచిన ఐదేళ్లలో ఎవరూ పట్టించుకోక పోవడంతో దిష్టబొమ్మలా మారిపోయింది.

– కందుకూరు





- **కలగానే వికాస కేంద్రాలు**

అధికారుల పర్యవేక్షణ లోపం.. ఇంజనీరింగ్ అధికారుల ఉదాసీనతతో జిల్లాలో క్రీడా వికాస కేంద్రాల (కేవీకే) నిర్మాణాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించి వారిని జాతీయ స్థాయిలో రాణించేలా తయారుచేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కేవీకేలకు శ్రీకారం చుట్టింది. నాటి కేంద్ర మంత్రి వెంకయ్య నాయుడు వీటి శిలాఫలకాలను ప్రారంభించి తొలివిడత నిధులు కూడా మంజూరు చేశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని కావలి, వెంకటగిరి, కోవూరు, ఉదయగిరి, సూళ్లూరుపేట, ఆత్మకూరు, గూడూరు, సర్వేపల్లి, నెల్లూరు అర్బన్, నెల్లూరు రూరల్ ప్రాంతాల్లో కేవీకేల ఏర్పాటుకు సర్వం సిద్ధం చేశారు. కోవూరులో స్థల సేకరణలో ఇబ్బందులు ఉండటంతో విడవలూరు జడ్పీ ఉన్నత పాఠశాల స్థలాన్ని కేటాయించారు. ఇక్కడ సగం పనులు పూర్తి చేశారు. అలాగే ఆత్మకూరులో డీఎస్‌ఏకు సంబంధించిన 10 ఎకరాల్లో పనులు ప్రారంభించగా సగం పూర్తయింది. ఉదయగిరిలో 2.7 ఎకరాల్లో కేవీకే పనులు ప్రారంభించి కొద్ది నిర్మాణాలు జరిగిన వెంటనే ఆపివేశారు. కావలిలో డీఎస్‌ఏకు సంబంధించిన 9 ఎకరాల్లో పనులు ప్రారంభించి పెండింగ్‌లో పెట్టారు. ఇక నెల్లూరు రూరల్ కొత్తూరులో 5.25 ఎకరాలు కేటాయించారు. టెండర్ల ప్రక్రియ పూర్తయినా తెలుగుగంగ అధికారుల అభ్యంతరం, సాంకేతిక కారణాలతో పనులను నిలిపివేశారు. నెల్లూరు అర్బన్‌లో అల్లీపురం సమీపంలో 6 ఎకరాల డంపింగ్ యార్డ్‌ను కేటాయించారు. అయితే డంపింగ్‌ను తొలగించడానికే రూ.3 కోట్ల వరకు ఖర్చవుతుండడంతో నిధుల కొరతతో పనులు నిలిపివేశారు.

- **మండల వికాస కేంద్రాలు ఏమైనట్లో!**

కేవీకేలతోపాటు మండల వికాస కేంద్రాలు కూడా తెరపైకి రాగా ఉమ్మడి జిల్లా కోటలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానాన్ని కేటాయించారు. దీనికి రూ.2 కోట్లు కేటాయించారు. ఇక్కడా పనులు ప్రారంభించి సగంలోనే ఆపేశారు. ఈ కేంద్రాల్లో ఇండోర్ స్టేడియంతోపాటు చుట్టూ ప్రహరీ గోడలు నిర్మించి అవుట్‌డోర్ క్రీడలు కూడా ఆడేవిధంగా సిద్ధం చేయాల్సి ఉంది. ఒక్కో మైదానానికి రూ.2 కోట్లు చొప్పున కేంద్రం కేటాయించింది. ఆరు కేంద్రాల్లో పనులు ప్రారంభించి నిలిపివేశారు.

అసాంఘికాలకు అడ్డాగా

2018లో టీడీపీ ప్రభుత్వం ఉదయగిరికి సుమారు రూ.2 కోట్లతో ఇండోర్ స్టేడియం మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ స్టేడియం నిర్మాణాన్ని వేగంగా చేపట్టి రూ.90 లక్షల వరకు ఖర్చు చేసి శ్లాబ్ స్థాయికి తీసుకువచ్చారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పనులను పట్టించుకోలేదు. ప్రస్తుతం ఆ భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. కాగా దుత్తలూరు- సీతారామపురం మార్గంలో ఏర్పాటు చేయనున్న 167- బీజీ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఈ స్టేడియాన్ని తొలగించనున్నారు.

– ఉదయగిరి రూరల్



ఆంధ్రజ్యోతి ఫోకస్

- **మొగళ్లపాళెం క్రీడాగ్రామానికి గ్రహణం**

2019లో రాష్ట్రంలో జాతీయ క్రీడల నిర్వహణే లక్ష్యంగా నెల్లూరు రూరల్‌లోని మొగళ్లపాళెంలో 2014లో క్రీడా గ్రామం కోసం 150 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) రూపొందించి పంపాలని నాడు కేంద్రమంత్రిగా ఉన్న ఎం.వెంకయ్యనాయుడు అప్పటి రాష్ట్ర సర్కారును కోరారు. 2016లో 150 ఎకరాలు శాప్ పరిధిలోకి వచ్చింది. శాప్ ద్వారా డీపీఆర్ (మాస్టర్‌ప్లాన్) రూపొందించి అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన అవుట్‌డోర్, ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియాలను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కేంద్రాన్ని నెలకొల్పేందుకు అనువుగా భవనాలు నిర్మించేలా కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలి. అలా పంపిన వెంటనే ఆమోదం పొందేందుకు వెంకయ్యనాయుడు ప్రత్యేక చొరవ చూపి నాటి కేంద్ర క్రీడల మంత్రిత్వశాఖను ఒప్పించారు. రాష్ట్ర సర్కారు ఇందుకోసం శాప్ ద్వారా ప్రహరీగోడ, విద్యుత్, రోడ్లు, నీటి సౌకర్యం కల్పించేందుకు రూ.4.6 కోట్లు విడుదల చేసింది. సకాలంలో డీపీఆర్ రూపొందించి కేంద్ర సర్కారుకు పంపితే క్రీడాగ్రామం కోసం రూ.200 కోట్లతో అంతర్జాతీయ క్రీడా ప్రమాణాల కలిగిన క్రీడాప్రాంగణాలు రూపుదిద్దుకునే అవకాశం ఉందని వెంకయ్యనాయుడు సూచనలు చేసినా ప్రభుత్వం తగిన ప్రాధాన్యత చూపలేకపోయింది. జిల్లాలో రాజకీయ సమీకరణాలు, ప్రయోజనాలను పరిగణలోకి రావడంతో మొగళ్లపాళెం క్రీడాగ్రామం వేగానికి గ్రహణం పట్టింది. 2016లో రాష్ట్ర ప్రభుత్వం రూ.6కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ నిధులను భూ సేకరణలో భాగంగా రైతులకు చెల్లించి భూమిని స్వాధీనం చేసుకుంది. అయితే ఇప్పటికీ వీటి నిర్మాణాలు నత్తనడకన సాగుతుండడంతో అసలు ఇది పూర్తవుతుందా లేదా అన్న సందిగ్ధ అందరిలో నెలకొంది. అయితే తొలిదశలో రూ.8కోట్లతో మల్టీ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టేందుకు 2017, మార్చిలో భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ పనులను మాత్రం 2022లో పూర్తి చేసి 2023లో డీఎస్‌ఏకు అప్పగించారు. అప్పటి నుంచి ఈ ఇండోర్ స్టేడియం ప్రారంభానికి ఎదురుచూస్తోంది. డీఎస్‌ఏ అధికారులు మాత్రం ఈ స్టేడియంను అకాడమీలకు కేటాయించాలని ప్రతిపాదనలు పంపినా ఇప్పటికీ అతీగతీ లేదు.

కాసులు ఇస్తేనే ఎంట్రీ!

ఆడటానికి మేం సిద్ధం.. మైదానాలు, వసతులు, శిక్షకులను సమకూర్చండి చాలు.. ఇది నిన్నటి వరకు క్రీడాకారుల మాట. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో మాత్రం ఆసక్తి ఉంది కదా అని నేర్చుకుందాం, ఆడేద్దామంటే కుదరదు ఆటకు ధర చెల్లించాల్సిందేనని, ఎవరైనా సరే ఆడాలనుకున్నా, శిక్షణ పొందాలనుకున్నా అడ్మిషన్ ఫీజుతోపాటు నెలవారీ నగదు చెల్లిస్తేనే మైదానంలోకి ప్రవేశం ఉంటుంది. జిల్లాలో డీఎస్‌ఏకు సంబంధించిన ఇండోర్ లేదా అవుట్‌డోర్ స్టేడియాల్లో అడుగు పెట్టాలన్నా, ఆటలాడాలన్నా నగదు ఖచ్చితంగా చెల్లించాలం టూ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు ఆసక్తి కలిగిన విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఆయా క్రీడలకు ఎంపిక చేసి పోటీల కోసం మైదానాలకు పంపిస్తారు. గతంలో వీరంతా ఒక్క పైసా కూడా చెల్లించకుండానే క్రీడాకారులుగా రాణించారు. అయితే వైసీపీ ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెం.20తో మరింత ఇబ్బందిగా మారింది. 14 ఏళ్లలోపు క్రీడాకారులకు ఒక రేటు, 14 ఏళ్ల పైబడిన వారికి ఒక రేటు నిర్ణయించి ఆయా ధరల పట్టికను డీఎస్‌ఏకు పంపించారు. ప్రభుత్వం మారినా నేటికీ ఈ జీఓ కొనసాగుతుండటంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు.

కావలిలో ఇలా..

కావలిలో మినీస్టేడియం నిర్మాణానికి 2001లో ఉదయగిరి రోడ్డు వద్ద 9 ఎకరాల స్థలాన్ని అప్పటి టీడీపీ ప్రభుత్వం కేటాయించింది. 2014-19 మధ్య టీడీపీ హయాంలో రూ.2కోట్లు నిధులు కేటాయించి పనులు ప్రారంభించారు. అయితే అప్పటి వైసీపీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి బేస్‌మెంట్ పూర్తయ్యాక మైదానం మధ్యలో భవనం నిర్మిస్తున్నారని పనులు ఆపించారు. ఆ తర్వాత వైసీపీ పాలన వచ్చి మళ్లీ ఎమ్మెల్యేగా ప్రతాప్‌రెడ్డే గెలిచినా పనులు మాత్రం జరగలేదు.

– కావలి





నెల్లూరు రూరల్ మండలం మొగళ్లపాళెంలో పూర్తయిన ఇండోర్ స్టేడియం

- **నేడు జాతీయ క్రీడా దినోత్సవం**

ప్రపంచ క్రీడా జగతిలో దేశ ప్రతిష్టను సగర్వంగా నిలిపి హాకీ మాంత్రికుడిగా కీర్తి గడించిన ఆటగాడు మేజర్ ధ్యాన్‌చంద్. ఆయన జన్మదినం సందర్భంగా దేశవ్యాప్తంగా ఏటా ఆగస్టు 29వ తేదీన జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహిస్తారు. ఇందులో భాగంగానే జిల్లాలో గురువారం క్రీడా సంబరాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది దేశ ప్రధాని నరేంద్రమోదీ ఫిట్ ఇండియా మూమెంట్ పేరుతో ఢిల్లీలో ప్రతిజ్ఞ చేయనున్నారు.

- **ప్రతిభా పురస్కారాల ప్రదానం**

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డులను అందిస్తున్నట్లు డీఈఓ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యాశాఖ 2023-24 విద్యా సంవత్సరానికి నెల్లూరులోని బీవీనగర్ కేఎన్‌ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల, కోవూరు డివిజన్ పాటూరు జడ్పీ ఉన్నత పాఠశాల, నగరంలోని బీవీఎస్ నగరపాలక ఉన్నత పాఠశాల, కోవూరు జడ్పీ బాలికోన్నత పాఠశాల, పొదలకూరు మండలం మహ్మదాపురం జడ్పీ ఉన్నత పాఠశాలను క్రీడా అవార్డులకు ఎంపిక చేసినట్లు తెలిపారు. నగరంలోని దర్గామిట్ట జడ్పీ బాలికోన్నత పాఠశాలలో గురువారం జరిగే కార్యక్రమంలో క్రీడా ప్రతిభా పురస్కారాలు అందచేస్తామన్నారు.

– నెల్లూరు (విద్య)

- **ఆసక్తిగా క్రీడాదినోత్సవ పోటీలు**



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

నెల్లూరు (విద్య) : జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నగరం లోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రీడాపోటీలు ఆసక్తిగా జరుగు తున్నాయి. ఈ సందర్భంగా బుధవారం ఫుట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్, త్రోబాల్, యోగా, జంప్‌రోప్, లెమన్ అండ్ స్పూన్, లగోరి అండ్ లంగాడి, సాక్‌రేస్ పోటీలు జరిగాయి. గురువారం ఉదయం 7 గంటలకు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నుంచి కరెంటాఫీస్ మీదుగా తిరిగి ఏసీ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఆర్‌కె.యతిరాజ్ తెలిపారు.

వినాయక నిమజ్జన వేడుకలను సమష్టిగా నిర్వహించండి

- 11న నగరంలో శోభాయాత్ర
- విస్తృత ఏర్పాట్లు చేయాలని జేసీ ఆదేశం

నెల్లూరు (సాంస్కృతికం) : వినాయక చవితి సందర్భంగా 11న జరిగే సామూహిక గణేష్ ప్రతిమల నిమజ్జన వేడుకలను నిర్వాహకులు, అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జేసీ కె.కార్తీక్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఆయన సమావేశమై మాట్లాడారు. 7వ తేదీన వినాయక చవితి పండుగ రోజు నుంచే ఘాట్ల వద్ద గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. గణేష్ మండపం నిర్వాహకులు 5వతేదీలోగా అనుమతులు తీసుకోవాలని కోరారు. 11న శోభాయాత్ర నగరంలో 8 మార్గాల్లో జరుగుతుందని, ఆ మార్గాల్లో చెట్లు, విద్యుత్ తీగలు తొలగించాలని, ఘాట్‌ల వద్ద విద్యుత్ అంతరాయం రాకుండా చూడాలని ఆదేశించారు. కాగా, గణనాథుల నిమజ్జనానికి ఇరుకళల పరమేశ్వరి ఆలయం వద్ద గణేష్ ఘాట్, రంగనాయకులపేట పెన్నా ఘాట్‌లలో ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్పొరేషన్ అదనపు కమిషనర్ నర్మదా మాట్లాడుతూ ఈ రెండు ఘాట్ల వద్ద రూ.1.6 కోట్లతో సివిల్ వర్కులు చేస్తున్నట్లు తెలిపారు. ఇరుకళల గణేష్ ఘాట్‌ను 6జోన్లు, పెన్నా ఘాట్ 5జోన్‌లుగా విభజించి నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టుతున్నట్లు ఈఈ చంద్రయ్య తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు సౌజన్య, శ్రీనివాసులురెడ్డి, డీఆర్‌ఓ లవన్న, విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, విక్రమ సింహపురి గణేష్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



గణేష్ నిమజ్జనంపై అధికారులతో సమీక్షిస్తున్న జేసీ కార్తీక్

అనంతసాగరం కేంద్రంగా రేషన్ బియ్యం రాకెట్

● యథేచ్ఛగా అక్రమ వ్యాపారం ● పట్టించుకోని అధికారులు

అనంతసాగరం, ఆగస్టు 28: పేదలకు అందించే రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు చేరుతున్నాయి. మండలంలోని వెంగంపల్లికి చెందిన కొందరు అక్రమ వ్యాపారానికి ఆజ్యం పోస్తున్నా పట్టించుకొనే నాథుడు లేడు. ప్రతి నెలా ఒకటవ తేదీ నుంచి 15 వరకు ఎండీయూ వాహనాల ద్వారా బియ్యం పంపిణీ చేస్తారు. అనంతరం మాఫియా సభ్యులు రంగంలోకి దిగుతారు. ప్రతి గ్రామంలోనూ లబ్ధిదారుల నుంచి కేజీ రూ. 10 వంతున కొనుగోలు చేస్తారు. ఆ బియ్యాన్ని ఒక రహస్య ప్రాంతంలో నిల్వ చేసి నెలలో రెండు సార్లు అనుమానం రాకుండా ట్రాలీ ఆటోల ద్వారా నెల్లూరు, బుచ్చిలోని రైస్ మిల్లులకు తరలిస్తారు. అక్కడ బియ్యాని పాలిష్ పట్టి బహిరంగ మార్కెట్‌లో కేజీ రూ.25 నుంచి రూ . 35లకు అమ్ముతారు. కొన్ని సందర్భాల్లో ఆ బియాన్ని చెన్నైకి తరలిస్తారు. రేషన్ బియ్యం రాకెట్ వైసీపీ హయాం నుంచి జరుగుతుంది. ప్రభుత్వం మారినా స్థానిక అధికారుల్లో చలనం లేదు. గతంలో ఆటోతో సహా రేషన్ బియ్యాన్ని స్థానిక అధికారులు పట్టుకొన్నారు గానీ, సరైన చర్యలు చేపట్టలేదు. దీంతో ఈ అక్రమ వ్యాపారం విచ్చలవిడిగా సాగుతోంది. అధికారులు మామూళ్లకు అలవాటు పడి పట్టించుకోవడం లేదన్న విమర్శలు



సంగం పోలీసులు పట్టుకొన్న రేషన్ బియ్యం వాహనం (ఫైల్)

వినిపిస్తున్నాయి. రెండు రోజుల క్రితం సంగం వద్ద పోలీసులు రేషన్‌బియ్యంతో వెళ్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. ఇది అనంతసాగరానికి కావడం గమనార్హం.

బదిలీపై వచ్చిన సీఐ, ఎస్‌ఐల బాధ్యతల స్వీకరణ






ఎస్‌ఐలుగా బాధ్యతలు చేపట్టిన మర్రిపాడులో శ్రీనివాస్, వింజమూరులో వీరప్రతాప్, ఏఎస్ పేటలో సైదులు, సంగంలో సీఐ వేమారెడ్డిని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

సంగం, ఆగస్టు 28: సర్కిల్‌లో బాధ్యతలు స్వీకరించిన సీఐ వేమారెడ్డిని టీడీపీ నేతలు బుధవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, బాణా శ్రీనివాసులురెడ్డి, పిట్టు పట్టాభిరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ పేట : ఎస్‌ఐగా బుధవారం ఏ సైదులు బాధ్యతలు స్వీకరించారు.నెల్లూరు వన్ టౌన్ ఎస్‌ఐగా పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకి వచ్చారు. ముందుగా ఆయన నాయబ్‌రసూల్ దర్గాను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.అనంతరం బాధ్యతలు చేపట్టారు. సమస్యల పరిష్కారనికి కృషి చేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

మర్రిపాడు: ఎస్‌ఐగా కె.శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో బాగంగా ఆయన నెల్లూరు వీఆర్ నుంచి మర్రిపాడుకి వచ్చారు. మండలంలోని టీడీపీ నాయకులు యువత ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు.

వింజమూరు : ఎస్‌ఐగా కె.వీరప్రతాప్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలను కాపాడతానని, అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతానని తెలిపారు.



ఉదయగిరి ఎస్‌ఐని సన్మానిస్తున్న టీడీపీ నేతలు

ఎస్‌ఐకి ఘన సన్మానం

ఉదయగిరి రూరల్ : విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనపరిచి స్వాతంత్ర్యం దినోత్సవం సందర్భంగా మంత్రి పొంగూరు నారాయణ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డిని బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సన్మానించారు. మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సందిరెడ్డి రామారావు, గానుగపెంట ఓబులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

అనంతసాగరం : స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆత్మకూరు సీఐ గంగాదర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణాష్టమి వేడుకల ముగింపు



శ్రీకృష్ణుడి గ్రామోత్సవం

వింజమూరు, ఆగస్టు 28 : మండలంలోని శంఖవరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం ముగిశాయి. చివరిరోజు స్వామివారిని కృష్ణావతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు జరిపించారు. శ్రీకృష్ణుని జననం గురించి వివరించారు. అనంతరం స్వామివారిని పల్లకీపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచి తాటిబోయిన మాల్యాద్రి, భోగిరెడ్డి వెంకటరమణారెడ్డి, భోగిరెడ్డి మాలకొండరెడ్డి, చింతనబోయిన మాల్యాద్రి, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్) : దుత్తలూరు సెంటర్‌లో త్రైత సిద్ధాంతం వారి ఆధ్వర్యంలో మూడోరోజైన బుధవారం భక్తులు శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామివారికి విశేష అలంకరణలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామంతోపాటు పరిసర గ్రామాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

వాహనాల రుసుం వసూలుకు నేడు వేలంపాట

ఏఎస్ పేట,ఆగస్టు28: స్థానిక ఖాజా నయాబ్‌రసూల్ దర్గాకు వచ్చే ప్రైవేటు వాహనదారుల నుంచి రుసుము వసూలు చేయడానికి గురువారం వేలంపాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి యస్థాని ఓ ప్రకటనలో తెలిపారు. దర్గా గంధమహోత్సవం సందర్భంగా 2024 సెప్టెంబరు ఒకటి నుంచి 2024 సెప్టెంబరు 30వతేదీ వరకు (30 రోజులు) వాహనదారుల నుంచి రుసుము వసూలు చేసుకోడానికి స్థానిక సచివాలయంలో గురువారం ఉదయం 11గంటలకు వేలం పాట నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా రూ.10వేలు చెల్లించాలని తెలిపారు.ఇతర వివరాలకు తనను సంప్రదించాలన్నారు.

వైఎస్‌ఆర్ విగ్రహం చుట్టూ అరుగు తొలగింపుపై ఫిర్యాదు

మర్రిపాడు : స్థానిక వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం చుట్టూ ఉన్న అరుగును తొలగించారని ఎక్స్‌కవేటర్ ఆపరేటర్ దుద్దుగుంట శ్రీనివాసులురెడ్డిపై వైసీపీ నాయకులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మర్రిపాడులోని మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఇంటి ముందు వైఎస్‌ఆర్ విగ్రహం ఉంది. ఆప్రాంతంలో చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబం గురువారం వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించేదుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో పక్కనే ఉన్న వైఎస్‌ఆర్ విగ్రహం చుట్టూ అరుగు దగ్గర ఉన్న మెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. ఉద్దేశపూర్వకంగా ఆ మెట్లను తొలగించారని వైసీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చోరీలు, నేరాల నియంత్రణపై అవగాహన

సంగం : సమాజంలో జరిగే చోరీలు, నేరాలపై మండలంలోని జెండాదిబ్బలో సీఐ వేమారెడ్డి గ్రామస్థులకు బుధవారం సాయంత్రం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లు అనుమానం వస్తే సమాచారం అందించాలన్నారు. ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లేటప్పుడు ఇంట్లో విలువైన బంగారు నగలు, నగదు ఉంచకుండా బ్యాంకు లాకర్ లేక వెంట తీసుకెళ్లాలన్నారు. చిన్న చిన్న విషయాలకు గొడవలు పెట్టుకుని చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగార్జునరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

వైభవంగా బాలాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ

సంగం, ఆగస్టు 28: మండలంలోని దువ్వూరులో నిర్మించిన ఆలయంలో బాలాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల మధ్య బాలాంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం కుంభాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



ప్రతిష్ఠించిన బాలాంజనేయస్వామి విగ్రహం

దాతల చేయూత మరువలేనిది : ఎంఈవో-2

ఉదయగిరి రూరల్, ఆ గస్టు 28: ప్రభుత్వ పాఠశా లల అభివృద్ధికి దాతలు అందిస్తున్న చేయూత మరువలే నిదని ఎంఈవో-2 తోట శ్రీని వాసులు పేర్కొన్నారు. బుధ వారం మండలంలోని బిజ్జం పల్లి జడ్పీ ఉన్నత పాఠశాల లో స్టేజీ, ముఖద్వారం ఏర్పా టుకు దాతలతో కలిసి భూ మి పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడు తూ స్టేజీ నిర్మాణానికి మూలె రాజశేఖర్‌రెడ్డి, ముట్టుకుందు ప్రభాకర్‌రెడ్డి, ముఖద్వారం నిర్మా ణానికి కల్లూరి సిద్ధారెడ్డి జ్ఞాపకార్థం రవీంద్రరెడ్డిలు ముందుకు రావడం అభినంద నీయమన్నారు. ఈ సందర్భంగా శుభదిన్‌భోజన్ కార్యక్రమంలో భాగంగా మూలె రాజశేఖర్‌రెడ్డి, ప్రత్యూషల వివాహం సందర్భంగా విద్యార్థులకు అతిథి భోజనం అందించారు. కాగా మం డలంలోని గడ్డంవారిపల్లి జడ్పీ ఉన్నత, గన్నేపల్లి ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న స్వీయ మదింపు పరీక్షలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం. నాయబ్, మాలకొండయ్య, సర్పంచి లక్కు రమణమ్మ, ఎస్‌ఎంసీ చైర్మన్ కవిత, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జట్‌ఫట్ బీబీ గంధోత్సవం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 28: ఉదయగిరి దుర్గంపై బుధవారం పర్యాటకుల సందడి నెలకొంది. మొహర్రం మాసంలో వచ్చే చివరి బుధవారం(అఖర్ ఛాస్ముంబా) రోజున ముస్లింలు కుటుంబ సమేతంగా వనభోజనాలకు వెళ్లి పచ్చికబయళ్లు తొక్కితే, పాపాలు హరించి, పుణ్యం లభిస్తుందని వారి విశ్వాసం. అందులో భాగంగా దుర్గంపై పట్టణంతోపాటు వింజమూరు, పామూరు, నెల్లూరు, బద్వేల్, కావలి, ఆత్మకూరు తదితర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు అధికసంఖ్యలో తరలి వచ్చి తొట్టి, లొద్ది ప్రాంతంలో సేదతీరారు. సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం దుర్గంపై గల పురాతన కట్టడాలను తిలకించారు. అలాగే దుర్గంపై గల జట్‌ఫట్‌బీబీ దర్గాలో గంధ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, ఫకీరు జరుబులు, బాణసంచా పేలుళ్ల నడుమ గంధాన్ని హక్కుదారుల ఇంటి నుంచి ఊరేగింపుగా దర్గాకు చేర్చారు. చదివింపుల అనంతరం గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా దర్గాలో భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న భక్తులు

ఎన్నికల నిధుల వినియోగంపై విచారణ

వరికుంటపాడు, ఆగస్టు 28: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు నిధుల వినియోగంపై బుధవారం కందుకూరు డీఎల్పీవో కృష్ణమోహన్ విచారణ చేపట్టారు. అప్పట్లో తమకు నిధులు ఇవ్వకుండా ఎంపీడీవో వెంకటకృష్ణకు మారి అక్రమాలకు పాల్పడ్డారని బీఎల్‌వోగా విధులు నిర్వర్తించిన రామాపురం పంచాయతీ కార్యదర్శి ప్రభుదాస్ ఆర్వోకి ఫిర్యాదు చేశారు. అదే సమయంలో ఎంపీడీవో సైతం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో కార్యదర్శిని సస్పెండ్ చేశారు. దీంతో తనకు న్యాయం చేయాలని కోరుతూ ఆ కార్యదర్శి ఇటీవల కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ నేపథ్యంతో ఎంపీడీవో, తహసీల్దారు కార్యాలయాల్లో బీఎల్‌వోలుగా విధులు నిర్వర్తించిన ఉద్యోగులను డీఎల్పీవో విచారించి, నివేదికలు సేకరించారు. కాగా సేకరించిన నివేదికలను ఉన్నతాధికారులకు అందచేస్తామని డీఎల్పీవో తెలిపారు.



నివేదికలు స్వీకరిస్తున్న డీఎల్పీవో కృష్ణమోహన్

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

బిట్రగుంట, ఆగస్టు 28: బోగోలు మండలంలో బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి సీవీవీ సత్యం అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంపై బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల మహిళ అధ్యక్షురాలు ఎస్.రాజ్యలక్ష్మి, పార్టీ నేతలు మల్లికార్జున, అభిరామ్, జంపాని ప్రసాద్, కొండూరు పోలయ్య, వేణునాయుడు, సముద్రాల వెంకటేశ్వర్లు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కాపు సంఘం నియోజకవర్గ మహిళా కన్వీనర్‌గా మద్దెల ఉష

కందుకూరు, ఆగస్టు 28: కందుకూరు నియోజకవర్గ కాపు సంఘం మహిళా కన్వీనర్‌గా మద్దెల ఉష నియమించినట్లు సంఘం రాష్ట్ర, జాతీయ నాయకులు తోట లక్ష్మీనారాయణ, మల్లెల శివనాగేశ్వరరావులు తెలిపారు.

రామలింగేశ్వర ఆలయంలో అంకురార్పణ

బిట్రగుంట: బోగోలు మండలం రామస్వామిపాలెంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం అంకురార్పణ జరిగింది. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచన కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు బత్తుల రవిచంద్ర పాల్గొన్నారు.

కావలి సమగ్రాభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

● పాతూరులో సీసీ రోడ్లకు శంకుస్థాపన

కావలి, ఆగస్టు 28: కావలి సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని పాతూరు 5, 7 వార్డులలో రూ.9.5 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5వ వార్డు రామిరెడ్డి వారి వీధిలో రూ.4.5 కోట్లతో, 7వ వార్డు కాటావారి వీధిలో రూ.5 కోట్లు ఎంపీ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. కావలిలో ఇటీవల రూ.70 లక్షలతో కాలువల్లో పూడిక తీసి, రోడ్లకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగింపచేశామన్నారు. అన్ని వార్డుల్లో అవసరమైన చోట సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మాణాల కోసం రూ.10 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని, నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామన్నారు. అమృత్ పథకం నిధులు రూ.62 కోట్లతో నిర్మిస్తున్న మంచినీటి సరఫరా ప్రాజెక్ట్ పనులు పూర్తి చేసి త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం చేయనున్నట్లు తెలిపారు. ట్రంకు రోడ్డు విస్తరణ పనులు సైతం ప్రారంభమయ్యాయని త్వరలో పూర్తి చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోతుగంటి అలేఖ్య, చిలకపాటి శ్రీనివాసులు, సురేష్, జనిగర్ల మనోహర్, బొంతా శ్రీనివాసులు, తిరువీది ప్రసాద్, రమణయ్య పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

సీఎంను కలిసిన ఎమ్మెల్యే

కావలి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అమరావతిలో బుధవారం సాయంత్రం కలిసి చేపట్టాల్సిన పనులను వివరించారు. త్వరలో కావలికి రావాలని కోరారు. దామవరం ఎయిర్‌పోర్టు నిర్మాణ విషయాలను సీఎంతో చర్చిం చి అభివృద్ధికి సహకరిస్తున్న సీఎంకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు మెరుగైన వైద్యం ప్రభుత్వ లక్ష్యం : ఇంటూరి

వలేటివారిపాలెం, ఆగస్టు 28 : పేదలకు సకాలంలో మెరుగైన వైద్యం అందిచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. వలేటివారిపాలెం పీహెచ్‌సీలో నేషనల్ హెల్త్ మిషన్ పథకం కింద మంజూరైన రూ.50 లక్షలతో నిర్మించనున్న ల్యాబ్ భవనానికి టుబాకో బోర్డు వైస్ చైర్మన్ గుత్తా వాసు బాబుతో కలిసి బుధవారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భగా ఆసుపత్రిలోని అన్ని విభాగాలతోపాటు పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ పరీక్షలకు గ్రామీణ ప్రాంత ప్రజలు దూరప్రాంతాల్లోని పట్టణాలకు వెళ్లేందుకు ఆర్థిక ఇబ్బందులతో పడుతున్న అవస్థలను దృషిలో పెట్టుకొని వలేటివారిపాలెంలో అన్ని రకాల రక్తపరీక్షలు నిర్వహించేందుకు అనుగుణంగా ల్యాబ్ భవనం ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు. ల్యాబ్‌కు వసరమైన అన్ని పరికరాలు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు వైద్యం అందక పడిన ఇబ్బందులు అందరికీ తెలుసన్నారు. అర్హత కలిగిగన బాధితులకు సీఎం సహాయ నిధిని మంజూరు చేస్తునట్లు తెలిపారు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.15 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, కాంట్రాక్టర్ వలేటి నరసింహం, వైద్యులు మణిదీపిక, శ్రీనివాసరావు, శివప్ప, ఎంపీడీవో శేషుబాబు, తహసీల్దారు అబ్దుల్‌అమీర్, ఆర్ అండ్‌బీ డీఈ మస్తాన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

కందుకూరు టీడీపీ కార్యాలయంలో చీరాల ఎమ్మెల్యే

కందుకూరు, ఆగస్టు 28 : చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య బుధవారం సాయంత్రం కందుకూరులోని టీడీపీ కార్యాలయానికి విచ్చేశారు. కందుకూరు ప్రాంత వాసి కొండయ్య కందుకూరుకు రావటంతో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సాదరంగా ఆహ్వానించారు. వారివెంట పలువురు స్థానిక టీడీపీ నాయకులు, యాదవసంఘం నాయకులు ఉన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

లింగసముద్రం, ఆగస్టు 28 : మండలంలోని వీఆర్ కోట గ్రామ సమీపంలోని మన్నేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ఐదు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. వివరాల మేరకు.. గుడ్లూరు సీఐ ఎం మంగారావుకు అందిన సమాచారం మేరకు ఆయన లింగసముద్రం ఎస్సై ఎం బాజీబాబు, సిబ్బందితో కలసి మంగళవారం అర్ధరాత్రి 11 గంటల సమయంలో వీఆర్ కోట గ్రామ శివారులో దాడులు నిర్వహించారు. ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని, డ్రైవర్లను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసులు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. కాగా పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్లలో రెండు ట్రాక్టర్లు తనవని, వాటిని విడిచి పెట్టాలని వలేటివారిపాలెంకు చెందిన ఓ టీడీపీ నాయకుడు ఎస్సై బాజీబాబును కోరగా ఎస్సై చలానాలు కట్టి తీసుకెళ్లాలని చెప్పడంతో వారి మధ్య వాగ్వాదం జరిగినట్టు తెలిసింది.

అడవి పందిని ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు

వలేటివారిపాలెం, ఆగస్టు 28 : మోటారుబైకుపై వెళ్తున్న ఓ యువకుడు షడన్‌గా రోడ్డుపైకి వచ్చిన అడివిపందిని ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన వలేటివారిపాలెంలోని తూమలేరు సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగింది. మండలంలోని అయ్యావారిపల్లెకు చెందిన ముచ్చు సుబ్బారావు వలేటివారిపాలెంలోని కిరాణా దుకాణంలో పని చేస్తాడు. అక్కడ పని ముగించుకొని తిరిగి అయ్యావారిపల్లెకు మోటారుబైకుపై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో సుబ్బారావుకు తల పగిలి తీవ్ర గాయాలయ్యాయి. అడవిపంది అక్కడికక్కడే మృతి చెందింది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కందుకూరుకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు, అక్కడి నుంచి గుంటూరుకు తరలించారు.

అసభ్యకరంగా తిడుతున్నాడని ఫిర్యాదు

కావలి రూరల్, ఆగస్టు 28: కావలి పట్టణం వైకుంఠపురంకు చెందిన ఓ మహిళను శ్రీకాంత్ అనే వ్యక్తి అసభ్యకరంగా తిడుతున్నాడని బుధవారం 1వ పట్టణ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల మేరకు.. ఆమె తన భర్తతో పనిచేసే శ్రీకాంత్ అనే వ్యక్తితో గతంలో సన్నిహితంగా ఉండేది. 5 నెలలుగా దూరం పెట్టడంతో ఆమె కనిపించినప్పుడు ఆ వ్యక్తి అసభ్యంగా దూషించే వాడు. మంగళవారం ఆమె భర్తతో కలసి మోటారు సైకిల్‌పై వెళ్తుండగా మానస థియేటర్ వద్ద శ్రీకాంత్ మోటారు సైకిల్‌కు ఎదురు వచ్చి బండిని కాలుతో తన్ని అసభ్యంగా తిట్టాడని ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ జమాల్‌వలి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

కొండాపురం, ఆగస్టు 28: పాఠశాలలో విద్యార్థుల వివరాలు, తదితర రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఎంఈవో-2 ఆనందరావు అన్నారు. కొండాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అలాగే స్కూల్ అసెస్‌మెంటు మోడల్‌పేపర్-1 పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఎఫ్‌ఏ-1 పరీక్షల స్థానంలో శాంప్-1 పరీక్షలను అదే విధానంలో ప్రభుత్వం నిర్వహిస్తుందని, దీనిపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

మధ్యాహ్న భోజనానికి బియ్యం వితరణ

బిట్రగుంట, ఆగస్టు 28: బోగోలు మండలం తిప్ప ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం టీడీపీ నేత బోగిరి ప్రభాకర్ తన తల్లి బోగిరి మన్నెమ్మ జ్ఞాపకార్థం ఐదు బియ్యం బ్యాగులను ప్రిన్సిపాల్ విజయలక్ష్మికి బుధవారం అందచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, బీజేపీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, కావ్యా యువసేన సభ్యులు గోచిపాతల సంజయ్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

లింగసముద్రం, ఆగస్టు 28 : ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పెన్నా కృష్ణయ్య చెప్పారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్ను వసూలు చేసి పంచాయతీల ఆదాయం పెంచాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ టి ప్రసాద్, ఎంపీడీఓ కె శ్రీనివాసులు, ఈఓపీఆర్డీ కెవి రామసుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానం అమలు చేయాలి

బిట్రగుంట, ఆగస్టు 28: టీడీపీ ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని సీఐటీయు మండల కార్యదర్శి చల్లా నరహరి, వ్యవసాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తాలూరి మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు తుమ్మల శీనయ్య, నాయకులు షేక్.బాదుల్లా, పూండ్ల తిరుపతి, కనుమూరి క్రిష్ణయ్య, ఏ.బ్రహ్మయ్య, షబీర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల సంరక్షణకు హైడ్రా చట్టం తేవాలి

కావలి, ఆగస్టు 28: కావలి డివిజన్‌లో ఆక్రమణలకు గురవుతున్న చెరువులను సంరక్షించేందుకు హైద్రాబాద్‌లాగా హైడ్రా చట్టాన్ని మన రాష్ట్రంలో కూడా తీసుకు రావాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేసి ఆర్డీవో శీనానాయక్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నేతలు సాదు ప్రసాద్, శ్రీనివాసులు, జరుగుమల్లి దయాకర్, నారుబోయిన లక్ష్మీనర్సు, జరుగుమల్లి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయంలో మాజీ సీఎం జగన్ ఫొటో

బిట్రగుంట, ఆగస్టు 28: బోగోలు పంచాయతీ వార్డు సభ్యుల సమావేశానికి బుధవారం వచ్చిన ఇద్దరు వార్డు సభ్యులు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోను తీసుకువచ్చి వదంటున్నా విధులకు ఆటంకం కలిగిస్తూ గోడకు తగిలించారని పంచాయతీ కార్యదర్శి జహీర్ తెలిపారు. ఈ మేరకు ఫొటో తగిలించిన 4వ వార్డు సభ్యుడు సూరపనేని శ్రీనివాసులు, 7వ వార్డు సభ్యుడు గంగపట్ల సన్నపమ్మలపై ఎస్సై భోజ్యకు ఆయన ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి ద ర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



గోడకు తగిలించిన జగన్ ఫొటో

రైలు పట్టాలపై మృతదేహం

బిట్రగుంట, ఆగస్టు 28: బిట్రగుంట రైల్వే స్టేషన్ దక్షణం వైపు రైలు పట్టాలపై రాధానాథ్ బిందాని (57) మృతదేహం పడి ఉన్నట్లు కావలి జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన వివరాల మేరకు ఒడిశాకు చెందిన రాధానాథ్ బిందాని అతని భార్య అలమణి బిందాని భువనేశ్వర్ నుంచి చెన్నైకి బుధవారం రైలులో వెళుతున్నారు. రైలు నెల్లూరు స్టేషన్ చేరుకున్నా భర్త రాకపోవడంతో అనుమానంతో భార్య రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో బిట్రగుంట స్టేషన్ దాటిన తరువాత ప్రమాదవశాత్తు రైల్లో నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్పీ పోలీసులు ఆమెకు తెలిపారు. సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని ఆమె తన భర్తదిగా గుర్తించారు. దీంతో మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించి శవపంచనామ చేసి బంధువులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు

కావలి రూరల్, ఆగస్టు 28: అదనపు కట్నం కోసం అత్తింటి వారు వేధిస్తున్నారని కావలి పట్టణం మేదరబజార్‌కు చెందిన షాజీలా బుధవారం 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. షాజీలాకు నెల్లూరుకు చెందిన మొహిద్‌తో 2021లో వివాహం జరిగింది. వారికి పుట్టిన పాప కలర్ నలుపు ఉందన్న కారణంగా షాజీలాపై అనుమానాలు వ్యక్తం చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతోపాటు అదనపు కట్నం కోసం అత్త పర్వీన్, మామ మహబూబ్ బాషా, ఆడబిడ్డ గౌషియా వేధిస్తున్నారని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్‌ఐ జమాల్‌వలి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.